www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 2-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 94 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.11.59 తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తర ఉ.11.07 తదుపరి హస్త, వర్జ్యం: రా.8.28-10.15, దుర్ముహూర్తం: ఉ.11.53-12.45, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బుమ్రా ఆడేనా?

- ఎటూ తేల్చుకోలేని టీమిండియా
- రెండో స్పిన్నర్‌గా కుల్దీప్?
- నేటి నుంచి ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..


గిల్
స్టోక్స్

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఏకంగా ఐదు శతకాలు నమోదైనా.. టీమిండియాకు నిరాశ తప్పలేదు. ఈనేపథ్యంలో గిల్ సేన బుధవారం నుంచి ఎడ్జ్‌బాస్టన్‌లో రెండో టెస్టుకు సిద్ధమైంది. అంతకంటే ముందు జట్టు కూర్పుపై అత్యంత ఆసక్తి నెలకొంది. హెడింగ్లేలో పేసర్ బుమ్రా మాత్రమే ఆకట్టుకోగా..అతనికి వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్ కింద ఈ టెస్టుకు విశ్రాంతినిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. అసలే బలహీనంగా కనిపిస్తున్న బౌలింగ్ విభాగంలో బుమ్రా లేకపోతే పరిస్థితేమిటి? అని సర్వత్రా చర్చ జరుగుతోంది. అయితే బుమ్రా జట్టు ఎంపికకు అందుబాటులోనే ఉంటాడని కెప్టెన్ గిల్ తేల్చాడు. కానీ మ్యాచ్ రోజు ఉదయం పిచ్ పరిస్థితిని చూశాకే అతడి ప్రాతినిథ్యంపై నిర్ణయానికి వస్తామని పేర్కొన్నాడు. ఈ సిరీస్‌కు ముందే బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడతాడని కోచ్ గంభీర్ ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ తొలి టెస్టు పరాజయం తర్వాత అతడు లేకుండా రెండో మ్యాచ్‌కు వెళ్లడం సరైన నిర్ణయం అనిపించుకోదని విశ్లేషకులు భావిస్తున్నారు. అటు ఆతిథ్య ఇంగ్లండ్ మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా ఇప్పటికే తుది జట్టును కూడా ప్రకటించింది. మరోవైపు ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో భారత్ ఇప్పటివరకు గెలిచిందిలేదు. ఆడిన 8 టెస్టుల్లో ఏడు ఓడి, ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. 2022లో ఇక్కడ ఆడిన చివరి టెస్టులో భారత్‌పై 378 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఇంగ్లండ్ నెగ్గింది.


పంత్

తుది కూర్పుపై మల్లగుల్లాలు

రెండో టెస్టులో ఎవరిని ఆడించాలనే విషయం కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్‌కు సవాల్‌గా మారింది. పేసర్ బుమ్రాపై ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. మూడో పేసర్‌గా ఆకాశ్, అర్ష్‌దీప్‌లలో ఎవరి వైపు మొగ్గు చూపాలి? అలాగే జడేజాకు తోడు మరో స్పిన్నర్‌గా ఎవరిని ఆడించాలి? శార్దూల్‌ను పక్కనబెట్టి నితీశ్‌ను ఆడిస్తే ఎలా ఉంటుంది? విఫలమైన సాయి సుదర్శన్, కరుణ్ నాయర్‌లను కొనసాగించాలా? ఇలా టీమ్ మేనేజ్‌మెంట్‌ను అనేక ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తొలి టెస్టులో మరో స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకపోవడంతో ఇంగ్లండ్ భారీ లక్ష్యాన్ని సులువుగా ఛేదించింది. ముఖ్యంగా స్పిన్నర్ కుల్దీప్‌ను ఆడించి ఉంటే బావుండేదనే కామెంట్స్ వినిపించాయి. కుల్దీప్‌ను తీసుకుంటారా? లేక ఎనిమిదో నెంబర్‌లో బ్యాటింగ్ చేయగల సుందర్‌ను ఆడిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. ఇక ఆల్‌రౌండర్ కోటాలో శార్దూల్ ఠాకూర్ అంచనాలను అందుకోలేకపోయాడు. దీంతో నితీశ్ కుమార్‌ను ఆడించే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు బుమ్రా ఆడకపోతే పేస్ విభాగం సిరాజ్, ప్రసిద్ధ్, ఆకాశ్‌దీప్‌లతో బరిలోకి దిగవచ్చు. ఇక బ్యాటింగ్‌లో జైస్వాల్, రాహుల్, గిల్, పంత్ శతకాలతో అదుర్స్ అనిపించారు. కానీ రెండు ఇన్నింగ్స్‌లోనూ చివరి వరుస బ్యాటర్లు విఫలం కావడం ప్రభావం చూపింది. ఒక విధంగా మ్యాచ్ కోల్పోయేందుకు కూడా కారణమయ్యారు. అలాగే ఫీల్డింగ్‌లో జైస్వాల్ వదిలేసిన క్యాచ్‌లతో జట్టు గట్టి మూల్యమే చెల్లించుకుంది. అందుకే ఈసారి అన్ని లోపాలను సరిదిద్దుకుని పకడ్బందీగా బరిలోకి దిగాలని భారత్ భావిస్తోంది.

మార్పుల్లేకుండానే..

తొలి టెస్టు విజయంతో ఉత్సాహంగా ఉన్న ఇంగ్లండ్ తమ తుది జట్టులో ఎలాంటి మార్పులూ చేయలేదు. నాలుగేళ్ల తర్వాత టెస్టులకు ఎంపికైన పేసర్ ఆర్చర్ కుటుంబ కారణాలరీత్యా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేడు. అయితే క్రిస్ వోక్స్ నేతృత్వంలోని పేస్ విభాగం పటిష్ఠంగానే కనిపిస్తోంది. భారత్ రెండు ఇన్నింగ్స్‌లోనూ టెయిలెండర్లను స్వల్ప స్కోర్లకే కట్టడి చేయడంలో విజయం సాధించారు. టంగ్, కార్స్, కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్‌లో రాణించారు. అటు బ్యాటింగ్‌లోనూ ఎనిమిది మంది బ్యాటర్లతో అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. క్రాలే, డకెట్, పోప్, రూట్, స్టోక్స్, స్మిత్ మరోసారి భారత బౌలర్లపై ఆధిక్యం ప్రదర్శించాలనుకుంటున్నారు.

తుది జట్లు

భారత్ (అంచనా): జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, గిల్, పంత్, జడేజా, నితీశ్/శార్దూల్, కుల్దీప్/సుందర్, బుమ్రా/ఆకాశ్, సిరాజ్, ప్రసిద్ధ్.

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్ (కెప్టెన్), స్మిత్, వోక్స్, కార్స్, టంగ్, బషీర్.

పిచ్, వాతావరణం: ఎడ్జ్‌బాస్టన్ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. చివరి 10 టెస్టుల్లో తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 334గా ఉంది. ఇక ఆరంభంలో పేసర్లు ప్రభావం చూపిస్తారు. చివరి రోజు స్పిన్నర్లు కీలకమవుతారు. తొలి రోజు చిరుజల్లులకు ఆస్కారం ఉంది.

నిఖత్‌కు రజతం

నిహారికకు కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ ఎలీట్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ బాక్సర్లు మూడు పతకాలు కొల్లగొట్టారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో వారం రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. రైల్వేస్ జట్టు 9 పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ 48 కిలోల విభాగం ఫైనల్లో గాయం కారణంగా ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వడంతో రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 60 కి., కేటగిరీలో తెలంగాణకు చెందిన గోనెల్ల నిహారిక, 65 కిలోల విభాగంలో యషి శర్మ కాంస్యాలు సాధించారు.

నెలకు రూ. 4 లక్షలు చెల్లించాలి

- విడాకుల కేసులో షమికి హైకోర్టు ఆదేశం


(ఫైల్ ఫోటో)

కోల్‌కతా: విడాకుల కేసులో టీమిండియా ఆటగాడు మహ్మద్ షమికి హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నిర్వహణ ఖర్చుల కింద మాజీ భార్య హసీన్ జహా, కుమార్తెకు కలిపి నెలకు రూ. 4 లక్షలు చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పింది. ఇందులో హసీన్‌కు రూ. 1.5 లక్షలు, కూతురికి రూ. 2.50 లక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లా కోర్టు జహాకు రూ. 50 వేలు, అతడి కూతురుకు రూ. 80 వేలు చెల్లించాలని తీర్పు నిచ్చింది. దీన్ని జహా హైకోర్టులో సవాల్ చేసింది.

దక్షిణాఫ్రికా ఘనవిజయం

బులవాయో: దక్షిణాఫ్రికా ఖాతాలో మరో ఘనవిజయం చేరింది. బ్యాటింగ్‌లో శతకం బాదిన కార్బిన్ బాష్ బౌలింగ్‌లోనూ చెలరేగి ఐదు వికెట్లతో రాణించాడు. దీంతో జింబాబ్వేతో నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో సఫారీలు 328 పరుగుల తేడాతో గెలుపొందారు. 537 పరుగుల భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 208 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 418/9 డిక్లేర్, రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగులు చేయగా.. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 251 పరుగులకు పరిమితమైంది.

'నీరజ్ చోప్రా క్లాసిక్' నుంచి పీటర్స్ అవుట్

బెంగళూరు: నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ త్రో ఈవెంట్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) చీలమండ గాయంతో తప్పుకొన్నాడు. అతని స్థానంలో సిప్రియాన్ (పోలెండ్) ఆడనున్నాడు.

క్రీడలకు కొత్త జోష్



- టార్గెట్ 2047గా నూతన జాతీయ స్పోర్ట్స్ పాలసీ
- 'ఖేలో భారత్ నీతి'గా నామకరణం
- టాప్-5 క్రీడా దేశాల్లో చేరాలని లక్ష్యం
- 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం పోటీ

న్యూఢిల్లీ: కొత్త జాతీయ స్పోర్ట్స్ పాలసీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నూతన క్రీడా పాలసీకి 'ఖేలో భారత్ నీతి' అని నామకరణం చేశారు. 2047 నాటికి ప్రపంచంలో టాప్-5 క్రీడా దేశాల్లో భారత్ ఒకటిగా నిలబడాలనే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించినట్టు ప్రధాని మోదీ తెలిపారు. కొత్త పాలసీలో ఐదు ప్రధాన అంశాలను పొందుపరిచారు. ప్రపంచ వేదికలపై సత్తా చాటడం, ఆర్థిక అభివృద్ధిలో క్రీడారంగం భాగస్వామ్యం, సామాజిక అభివృద్ధిలో క్రీడల పాత్ర, ప్రజా ఉద్యమంగా క్రీడలు, జాతీయ విద్యా విధానంలో క్రీడలకు చోటు అనే ఐదు అంశాలకు కొత్త పాలసీలో ప్రాధాన్యత ఇచ్చారు. ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించడం, క్రీడా సంబంధిత పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక అభివృద్ధికి దోహదం, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలు, మహిళలను క్రీడారంగంలో రాణించేందుకు ప్రోత్సహించడం, జాతీయ విద్యా విధానంలో క్రీడలను తప్పనిసరి అధ్యాయంగా చేర్చడం, ఇవన్నీ అమలయ్యేందుకు ప్రత్యేక పరిపాలన వ్యవస్థను రూపొందించాలనే అంశాలకు పాలసీలో ప్రాముఖ్యత ఇచ్చారు.

1984లో తొలిసారి...: స్పోర్ట్స్ పాలసీ 1984లో తొలిసారి అమల్లోకి రాగా 2001లో చివరిసారిగా ఆధునీకరించారు. 2014 తర్వాత బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఖేలో ఇండియా, టాప్స్ వంటి పథకాలను ప్రవేశపెట్టారు. 2028లో జరిగే తదుపరి ఒలింపిక్స్‌లో భారత పతకాల సంఖ్య రెండు అంకెలకు చేరాలని కేంద్ర క్రీడాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం కూడా భారత్ ప్రయత్నాలు చేస్తోంది.

అహ్మదాబాద్‌లో ఒలింపిక్స్..: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష బృందం లాసన్నేలోని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) ప్రధాన కార్యాలయానికి మంగళవారం వెళ్లింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి ఇప్పటికే సన్నద్ధత లేఖను ఇచ్చిన ఐఓఏ, భారత్‌లో విశ్వక్రీడల నిర్వహణకు ఉన్న వనరుల గురించి ఐఓసీ ప్రతినిధులకు ఉష బృందం వివరించింది. అహ్మదాబాద్ వేదికగా ఒలింపిక్స్ నిర్వహణ ప్రతిపాదనల గురించి చర్చించారు. ఉష బృందంలో కేంద్ర, గుజరాత్ క్రీడా శాఖ అధికారులు, ఐఓఏ ప్రతినిధులు ఉన్నారు.

పెగులా, జ్వెరెవ్‌కు షాక్

- సినర్, స్వియటెక్, క్రెజికోవా ముందుకు
- వింబుల్డన్



పెగులా

లండన్: వింబుల్డన్‌లో రెండో రోజు సీడెడ్ ప్లేయర్లకు చుక్కెదురైంది. పురుషుల, మహిళల విభాగాల్లో మూడో సీడ్ క్రీడాకారులు అలెగ్జాండర్ జ్వెరెవ్, జెస్సికా పెగులా, ఐదో సీడ్ క్విన్‌వెన్ జాంగ్‌లకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. అయితే, టాప్ సీడ్ జానిక్ సినర్, డిఫెండింగ్ చాంప్ బార్బరా క్రెజికొవా, స్వియటెక్ అలవోకగా రెండో రౌండ్‌కు చేరుకొన్నారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో పెగులా (అమెరికా) 2-6, 3-6తో ఎలిజబెత్ కికియారిటో (ఇటలీ) చేతిలో, చైనా ప్లేయర్ క్విన్‌వెన్ జాంగ్ 5-7, 6-4, 1-6తో సినియకొవా (చెక్) చేతిలో, 15వ సీడ్ ముచోవా 5-7, 2-6తో వాంగ్ (చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు. కాగా, 8వ సీడ్ స్వియటెక్ 7-5, 6-1తో కుదెర్మెటోవాపై, 17వ సీడ్ క్రెజికొవా 3-6, 6-2, 6-1 అలెగ్జాండ్రా (ఫిలిప్పీన్స్)పై, ఆండ్రీవ 6-3, 6-3తో మయర్ షరీఫ్‌పై, కసట్‌కినా (ఆస్ట్రేలియా) 7-5, 6-3 ఎమిలియానా (కొలంబియా)పై, అలెగ్జాండ్రోవా 6-2, 7-5తో ప్రిసిల్లాపై, సంసనోవా 6-3, 6-2తో జాయింట్‌పై, నవారో 6-3, 6-1తో క్విటోవా (చెక్)పై గెలిచారు.

సినర్ అలవోకగా..: పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సినర్ 6-4, 6-3, 6-0తో లూకా నార్డీని, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 6-7(6), 6-7(8), 6-4, 7-6(6), 6-4తో పెరికార్డ్‌ను, మినార్ 6-2, 6-2, 7-6(2)తో రాబర్టో (స్పెయిన్)ను ఓడించారు. అయితే, మూడో సీడ్ జ్వెరెవ్ 6-7(3), 7-6(8), 3-6, 7-6(5), 4-6తో ఆర్థర్ రెండర్‌కెంచ్ (ఫ్రాన్స్) చేతిలో, ముసెట్టి (ఇటలీ) 2-6, 6-4, 5-7, 1-6తో నికోలజ్ బాసిల్లాష్‌విలి (జార్జియా) చేతిలో పరాజయం పాలయ్యారు.

రూ.11.65 లక్షల కోట్లు

గత ఆర్థిక సంవత్సరం రెమిటెన్స్‌ల్లో సరికొత్త రికార్డు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రవాస భారతీయులు స్వదేశానికి రికార్డు స్థాయిలో 13,546 కోట్ల డాలర్ల (దాదాపు రూ.11.65 లక్షల కోట్లు) నిధులు పంపారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే, దేశంలోకి రెమిటెన్స్‌లు 14 శాతం పెరిగాయి. 8 ఏళ్ల క్రితం (2016-17 ఆర్థిక సంవత్సరం) వచ్చిన 6,100 కోట్ల డాలర్ల (రూ.5.25 లక్షల కోట్లు) రెమిటెన్స్‌లతో పోలిస్తే రెట్టింపునకు పైగా పెరిగాయి. మరిన్ని విషయాలు..

- ప్రపంచంలో అత్యధిక రెమిటెన్స్‌లు అందుకున్న దేశాల్లో భారత్ మరోసారి తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఈ విషయంలో భారత్ పదేళ్లకు పైగా కాలంగా నం.1 స్థానంలో ఉంది.
- గత ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల డాలర్లుగా నమోదైన కరెంట్ ఖాతా నిధుల రాకలో 10 శాతానికి పైగా వాటా రెమిటెన్స్‌లదే.
- ఆర్‌బీఐ రీసెర్చ్ ప్రకారం.. మొత్తం రెమిటెన్స్‌లో 45 శాతం అమెరికా, బ్రిటన్, సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచే వస్తున్నాయి. గతంలో అధిక రెమిటెన్స్‌లు సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవి. గడిచిన కొన్నేళ్లలో గల్ఫ్ దేశాల వాటా క్రమంగా తగ్గుతూ వస్తోంది. భారత వృత్తి నిపుణులు అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోతుండటం ఇందుకు కారణం.
- రెమిటెన్స్‌లు మన వాణిజ్య లోటును తగ్గించడంలో, ఆర్థిక వ్యవస్థ బలోపేతంలోనూ ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. 2024-25లో మన వాణిజ్య లోటు 28,700 కోట్ల డాలర్లు. ఈ లోటులో 47 శాతం వరకు రెమిటెన్స్‌లతో పూడ్చుకోవచ్చన్నమాట.

హైదరాబాద్‌లో ఎస్‌బీఐ గ్లోబల్ ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) 70వ వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా మంగళవారం నాడు హైదరాబాద్ సహా కోల్‌కతాలో రెండు గ్లోబల్ ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్స్ (జీటీఎఫ్‌సీ)ను ప్రారంభించింది. ఈ కేంద్రాల ద్వారా ఎగుమతి, దిగుమతిదారులకు త్వరితగతిన అవసరమైన అందించనున్నట్లు ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. అంతర్జాతీయ బ్యాంకింగ్ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మకంగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అంతర్జాతీయ వాణిజ్యం రోజురోజుకి డిజిటలైజ్ అవుతోంది. దీంతో మారుతున్న జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య అవసరాలకు అనుగుణంగా బ్యాంక్ ఫైనాన్స్ సామర్థ్యాలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఏర్పడిందని, ఈ రెండు కేంద్రాల ద్వారా ఆ లక్ష్యం నెరవేరుతుందని శెట్టి తెలిపారు.

సెప్టెంబరు నుంచి మెరుగైన లాభాలు: ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపుతో ప్రస్తుతం బ్యాంకుల లాభాలపై ఒత్తిడి ఉన్న మాట నిజమేనని ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి చెప్పారు. అయితే సెప్టెంబరు తర్వాత బ్యాంకుల లాభాలు మళ్లీ గాడిలో పడతాయని ఆశిస్తున్నట్టు ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ని 4 నుంచి 3 శాతానికి కుదిస్తూ ఇటీవల ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో సెప్టెంబరు నుంచి తమ నిధుల సమీకరణ ఖర్చులూ తగ్గుతాయన్నారు.

స్వల్ప లాభంతో సరి

90 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు ప్రామాణిక సూచీలను మంగళవారం లాభాల్లో నడిపించాయి. ఒక దశలో 267.83 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 90.83 పాయింట్ల స్వల్పలాభంతో 83,697.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 24.75 పాయింట్లు పెరిగి 25,541.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 లాభపడగా.. మిగతా 17 నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ షేరు 2.51 శాతం ఎగిసి సూచీ టాప్ గెయినర్‌గా నిలవగా.. రిలయన్స్ స్టాక్ 1.84 శాతం పెరిగింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.18 శాతం వరకు నష్టపోయాయి.

సిగాచీ షేరు మరో 6 శాతం పతనం: హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు వరుసగా రెండో రోజూ భారీ పతనాన్ని చవిచూసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు మరో 6 శాతం మేర క్షీణించి రూ.46.07 వద్ద ముగిసింది.

టాఫే-ఏజీసీఓ వివాదం సుఖాంతం

న్యూఢిల్లీ:మాసే ఫెర్గూసన్ బ్రాండ్‌పై దేశీయ ట్రాక్టర్ల తయారీ కంపెనీ టాఫే, అమెరికా కేంద్రంగా పనిచేసే ఏజీసీఓ కార్పొరేషన్ మధ్య తలెత్తిన వివాదం సుఖాంతమైంది. ఈ వివాదాన్ని కోర్టు వెలుపలే పరిష్కరించుకునేందుకు రెండు కంపెనీలు ఒక ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం టాఫే ఈక్విటీలో అమెరికా కంపెనీకి ఉన్న 20.7 శాతం వాటాను టాఫే కంపెనీ రూ.2,225 కోట్లకు కొనుగోలు చేస్తుంది. అందుకు బదులుగా టాఫే తన ట్రాక్టర్లను భారత్, నేపాల్, భూటాన్ దేశాల్లో ఫెర్గూసన్ బ్రాండ్ పేరుతో మార్కెట్ చేసేందుకు అమెరికా కంపెనీ ఏజీసీఓ అంగీకరించింది.

హైదరాబాద్‌లో ఐషర్.. చిన్న ట్రక్కుల (ప్రొ ఎక్స్) కోసం కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. గండిమైసమ్మ వద్ద ఎంజీబీ మోటార్, ఆటో ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ షోరూమ్‌ను ఏర్పాటు చేశాయి.

బిజినెస్



జీఎస్‌టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లు

జూన్‌లో 6.2 శాతం వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్‌లో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.2 శాతం వృద్ధితో రూ.1.84 లక్షల కోట్లకు చేరాయి. అయితే, ఈ ఏప్రిల్, మే నెలల్లో నమోదైన రూ.2 లక్షల కోట్లకు పైగా వసూళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. 2024 జూన్‌లో జీఎస్‌టీ స్థూల ఆదాయం రూ.1.74 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2.37 లక్షల కోట్లకు పెరగగా.. మే నెలలో రూ.2.01 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో జీఎస్‌టీ రిఫండ్లు 28.4 శాతం పెరిగి రూ.25,491 కోట్లకు చేరాయి. దాంతో, జీఎస్‌టీ నికర వసూళ్లు రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత జూన్‌తో పోలిస్తే, నికర ఆదాయంలో 3.3 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మే నెలతో పోలిస్తే మాత్రం 8.48 శాతం తగ్గాయి.

తొమ్మిదో వసంతంలోకి జీఎస్‌టీ: జీఎస్‌టీ చట్టం అమలులోకి వచ్చి 8 ఏళ్లు పూర్తయ్యాయి. మంగళవారం తొమ్మిదో వసంతంలోకి అడుగుపెట్టింది. జీఎస్‌టీ దేశ ఆర్థిక దృశ్యాన్ని పునర్నిర్మించిన మైలురాయి సంస్కరణ అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా అన్నారు. "నిబంధనల భారాన్ని తగ్గించడం ద్వారా దేశంలో వ్యాపార నిర్వహణను, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల కార్యకలాపాలను మరింత మెరుగుపరిచింది. అంతేకాదు, ఆర్థిక వృద్ధికి చోదకంగా మారింది" అని ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ (గతంలో ట్విటర్)లో ప్రధాని పోస్ట్ చేశారు.

జీఎస్‌టీ ఇకపై సులభతర వ్యాపార నిర్వహణను ప్రోత్సహించడం, పన్ను చెల్లింపుదారుల్లో బలమైన సమ్మతి, ఆర్థిక సమ్మిళితాన్ని పెంపొందించడంపై దృష్టిసారించనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశవ్యాప్తంగా ఏకరీతి పరోక్ష పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు 17 రకాల స్థానిక పన్నులు, 13 రకాల సుంకాల విలీనం ద్వారా రూపొందించిన జీఎస్‌టీ చట్టం 2017 జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది.

ఏపీ, తెలంగాణల్లో

తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, ఈ జూన్‌లో తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7 శాతం పెరిగి రూ.5,653 కోట్లకు చేరగా.. ఆంధ్రప్రదేశ్‌లో వసూళ్లు అతి స్వల్పంగా పెరిగి రూ.4,027 కోట్లుగా నమోదయ్యాయి.

గత నెల గణాంకాలు (రూ.కోట్లు)	
సెంట్రల్ జీఎస్‌టీ	34,558
స్టేట్ జీఎస్‌టీ	43,268
ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ	93,280
సుంకం ఆదాయం	13,491
మొత్తం	1,84,597

ఆధార్ ఉంటేనే పాన్ కార్డు

న్యూఢిల్లీ: పాన్ కార్డు జారీని ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసింది. ఇక నుంచి ఎవరికైనా కొత్తగా పాన్ కార్డు కావాలంటే వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ కూడా సమర్పించాలి. ఈ నిబంధన మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు ఎవరికైనా పాన్ కార్డు కావాలంటే వారి పేరు, పుట్టిన తేదీ గుర్తింపు పత్రాలు లేదా ఇతర ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలు సమర్పిస్తే సరిపోయేది. పన్ను ఎగువేతలను మరింత పక్కాగా అడ్డుకునేందుకు ప్రభుత్వం ఈ తాజా చర్య తీసుకుంది.


ఆటో డీలా

జూన్ అమ్మకాల్లో రెండంకెల క్షీణత

న్యూఢిల్లీ: మార్కెట్లో కార్లకు డిమాండ్ భారీగా తగ్గింది. ఫలితంగా జూన్ నెలలో ఆటో అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. ఆటో రంగ దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుండయ్ మోటార్ ఇండియా, టాటా మోటార్స్ అమ్మకాల్లో రెండంకెల క్షీణతను నమోదు చేశాయి. చిన్న కార్లకు ఆదరణ తగ్గడమే అమ్మకాల్లో ఈ భారీ క్షీణతకు కారణం. మారుతి సుజుకీ.గత నెలలో 1,18,906 కార్లను మాత్రమే విక్రయించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 1,37,160 యూనిట్ల విక్రయాలతో పోల్చితే ఇది 13 శాతం తక్కువ. మినీ కార్ విభాగంలోకి వచ్చే ఆల్టో, ఎస్-ప్రెసో కార్ల అమ్మకాలు గత ఏడాది జూన్‌తో పోల్చితే 9,395 యూనిట్ల నుంచి 6,414 యూనిట్లకు పడిపోయాయి. కాంపాక్ట్, యుటిలిటీ వాహనాల అమ్మకాలు కూడా నిరాశావహంగానే ఉన్నాయి. మరోవైపు హ్యుండయ్ మోటార్ ఇండియా అమ్మకాలు 12 శాతం క్షీణించి 50,103 నుంచి 44,024 కార్లకు పరిమితం అయ్యాయి.

కంపెనీ	అమ్మకాలు (జూన్ 2025)	అమ్మకాలు (జూన్2024)	క్షీణత/ వృద్ధి (%)
టాటా మోటార్స్	37,083	43,524	- 15
ఆడి	2,128	2,477	- 14
మహీంద్రా	47,306	40,022	+ 18
టీకేఎం	28,869	27,474	+ 5
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ	5,829	---	+ 21
టూవీలర్ కంపెనీలు			
బజాజ్ ఆటో	1,88,460	2,16,451	- 13
టీవీఎస్ మోటార్	2,81,012	2,55,734	+ 10
రాయల్ ఎన్‌ఫీల్డ్	76,957	66,117	+ 16
హోండా మోటార్ సైకిల్	4,29,247	5,18,799	- 17


ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	575	విజయవాడ	590
వరంగల్	577	గోదావరి	570
చిత్తూరు	633	విశాఖపట్నం	585

దజను గుడ్లు రూ. 78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	90
వరంగల్	90	గుంటూరు	95
కరీంనగర్	90	ఒంగోలు	98
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	93
కర్నూలు	90	నెల్లూరు	98
విశాఖపట్నం	79	అనంతపురం	98
గోదావరి	90		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,400 ▲	90,020 ▲	1,20,000 ▲
విజయవాడ	99,000 ▲	93,000 ▲	1,09,500 ▲
విశాఖపట్నం	1,00,670 ▲	90,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	98,400 ▲	90,200 ▲	1,09,000 ▼
ప్రొద్దుటూరు	97,300 ▲	89,520 ▲	1,07,000 ▲
ముంబై	97,430 ▲	89,246 ▲	1,06,963 ▲

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 2-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 94

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరంగల్

రూ.50 కోట్ల చక్కెర నీటి పాలు

హరియాణాలో భారీ వర్షాలు

షుగర్ మిల్లులోకి వరద నీరు

కొట్టుకుపోయిన పంచదార నిల్వలు

8



రాంచందర్‌రావుకు నియామక పత్రం అందజేస్తున్న శోభ, కిషన్‌రెడ్డి. చిత్రంలో లక్ష్మణ్, డీకే అరుణ

ట్రోల్స్ కాదు.. దమ్ముంటే నేరుగా రండి!

మీరనుకుంటున్నట్టు సౌమ్యుణ్ని కాను.. విద్యార్థుల కోసం 14 సార్లు జైలుకు వెళ్లొచ్చా

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సవాల్

పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేయాలని శ్రేణులకు పిలుపు

కాంగ్రెస్ నేతలకు బీజేపీ అధ్యక్షుడిపై వ్యాఖ్యలు చేసే అర్హత లేదు: కిషన్‌రెడ్డి

రాంచందర్‌రావు మిస్సైల్.. ఆయన చరిత్ర వింటే కన్నీళ్లొస్తాయి: బండి సంజయ్

అందరి ఆమోదంతో రాంచందర్‌రావు ఎన్నిక: ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, న్యాయవాదుల కోసం గతంలో పోరాటాలు చేశానని.. ఇప్పుడు రాష్ట్ర ప్రజల కోసం పోరాటం చేస్తానని రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. దూకుడంటే చొక్కా గుండీలు విప్పడం కాదని, నమ్మిన సిద్ధాంతం కోసం త్యాగాలు చేయడమని చెప్పారు. "మీరు అనుకుంటున్నట్లు నేను సౌమ్యుణ్ని కాను. ఉస్మానియా క్యాంపస్‌లో ఉన్నప్పుడు విద్యార్థుల కోసం 14 సార్లు జైలుకు వెళ్లొచ్చా. పోలీసుల లాఠీ దెబ్బలు తిన్నా. జితేందర్‌రెడ్డిని హత్య చేసిన

మిగతా 12వ పేజీలో...

బీజేపీ సభకు ఎంపీ అర్వింద్ డుమ్మా!

అధ్యక్ష పదవి దక్కలేదన్న అసంతృప్తితోనే?

వ్యక్తిగత కారణాలతోనే రాలేదని అర్వింద్ ప్రకటన

12



పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ శిథిలాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, వివేక్

మాంసపు ముద్దలు

బూడిద కుప్పలు

46కి చేరిన మృతుల సంఖ్య.. 9 మంది గల్లంతు

ఆస్పత్రుల్లో 30 మందికి చికిత్స.. వారిలో 10 మంది పరిస్థితి విషమం

'సిగాచి' శిథిలాల నుంచి మరో 16 మృతదేహాల వెలికితీత

వాటిలో 13 గుర్తింపు.. కుటుంబసభ్యులకు అప్పగింత

పేలుడు తీవ్రతకు మాంసంముద్దలు, బూడిద కుప్పలుగా మృతదేహాలు.. డీఎన్ఏ పరీక్షకు ఎముకలు, దంతాల సేకరణ

సాగుతున్న గాలింపు.. మృతుల సంఖ్య పెరిగే ముప్పు

పరిశ్రమ ఎండీ చిదంబరనాథ్ ఎక్కడ?.. రెండు రోజులుగా ఆయన పరిశ్రమవైపుగా రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం

అక్కడే ప్రేమించుకుని.. అక్కడే కన్నుమూసి

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో ఓ యువ జంట మృత్యువాత

సంగారెడ్డి ప్రతినిధి, పటాన్‌చెరు, పటాన్‌చెరు రూరల్, దండేపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సిగాచి రసాయన పరిశ్రమలో పేలుడు మృతుల సంఖ్య మంగళవారం అర్ధరాత్రి సమయానికి 46కి చేరింది. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో జరిగిన ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య సోమవారం అర్ధరాత్రి సమయానికే 20కి చేరినట్టు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద మంగళవారం

మిగతా 10వ పేజీలో...

మృతుల కుటుంబాలకు కోటి పరిహారం

తీవ్ర గాయాలైతే 10 లక్షలు.. క్షతగాత్రులకు రూ.5 లక్షలు

యాజమాన్యం చెల్లించేలా సీఎం సమక్షంలో ఒప్పందం

పరిశ్రమ ప్రాంగణంలో రేవంత్‌రెడ్డి పరిశీలన

11

గోదావరి-బనకచర్ల రాచపుండు

రాజేసింది కేసీఆరే

చచ్చిన పాము లాంటి బీఆర్ఎస్‌ను లేపేందుకే ఈ వివాదం

అబద్ధాలనే నమ్ముకున్న కేసీఆర్ కుటుంబం

తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టింది వారే

జలవివాదాలపై కేంద్రం పెద్దన్నలా ఉండాలి

రాష్ట్రాల మధ్య వివాదాలు తేల్చకుండా..

జుట్లు పట్టుకొని ఆడించాలనుకుంటోంది

కిషన్‌రెడ్డి తీరు అనుమానం కలిగిస్తోంది

ప్రభుత్వాన్ని బద్‌నాం చేసే కుట్ర

దుష్ప్రచారాన్ని గ్రామగ్రామానా వివరించాలి

రాష్ట్ర హక్కులను కాపాడటమే లక్ష్యం కావాలి

మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం పిలుపు

బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో చర్చిద్దాం..

రావాలని బీఆర్ఎస్‌కు రేవంత్ సవాల్

బనకచర్లను అడ్డుకుంది మేమే: మంత్రి ఉత్తమ్



బనకచర్లపై అవగాహన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ చచ్చిన పాము అని, ఆ పామును బతికించేందుకు గోదావరి-బనకచర్ల వివాదాన్ని వాడుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నీళ్ల సెంటిమెంటే పార్టీని బతికిస్తుందనుకుంటున్నారని, అందుకోసం రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను భూతాలుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. "క్షుద్రపూజలు చేసే ఫామ్‌హౌస్ నాయకుడికి ఈరోజు ఇదొక్కటే జీవనాధారంగా మారింది. అందుకే ప్రభుత్వాన్ని బద్‌నాం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అబద్ధాలతో బతికే బీఆర్ఎస్ 2023లో అధికారం కోల్పోయింది. 2024లో డిపాజిట్లు కోల్పోయింది. 2025 ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు కూడా దొరకలేదు. ఇది ఆ పార్టీ రాజకీయ పరిస్థితి. దీంతో నదుల పునరుజ్జీవం పేరుతో బీఆర్ఎస్ పునరుజ్జీవం కోసం తాపత్రయ పడుతున్నారు" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మంగళవారం.. గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. జలవివాదాలపై పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. వివాదం పరిష్కారమైతే తెలుగు రాష్ట్రాలు తమ వద్దకు రావని, పంచాయితీ

మిగతా 9వ పేజీలో...



బీవీ పట్టాభిరామ్

కన్నుమూత

గుండెపోటుతో మృతి

11

వ్యక్తిత్వ వికాస నిపుణుడు, హిప్నాటిస్ట్, కౌన్సెలర్‌గా అంతర్జాతీయ గుర్తింపు

57కు పైగా వ్యక్తిత్వ వికాస రచనలు

హిప్నాటిజంపై తొలిసారిగా పీహెచ్‌డీ

సీఎంలు రేవంత్, చంద్రబాబు సహా పలువురు ప్రముఖుల సంతాపం

జూన్ నెలలో

లోటు వర్షపాతమే!



గడువుకు ముందే వచ్చినా.. తర్వాత ఉసూరుమనిపించిన రుతుపవనాలు

297 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు

20 జిల్లాల్లో సాధారణ వర్షపాతం

ఇక రైతుల ఆశలన్నీ జూలై పైనే..

నేడు, రేపు రాష్ట్రంలో భారీ వర్షాలు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ముందే వచ్చి మురిపించినా ఉపయోగం లేకుండాపోయింది. జూన్‌లో లోటు వర్షపాతమే నమోదైంది. నైరుతి రుతుపవనాలు మేలోనే రావడం, ఆ నెల చివరివారంలో భారీ వర్షాలు కురవడంతో రాష్ట్ర రైతాంగం ఎంతో సంతోషపడింది. కానీ, అన్నదాతల ఆశలు మాత్రం వానల్లేక విత్తిన విత్తు మొలకెత్తక ఎండుతుండడంతో అడియాసలయ్యాయి. జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా పత్తి, మొక్కజొన్న, సోయాబీన్‌లాంటివి వేశారు. మే చివరి, జూన్ మొదటివారంలో పడ్డ వర్షాలతో విత్తనాలు నాటారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. దాంతో జూన్‌లో సాధారణం కంటే తక్కువ అంటే సగానికిపైగానే తీవ్రలోటు వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 621 మండలాలుండగా, అందులో సగం మండలాల్లో లోటు వర్షపాతమే. జూన్‌లో రాష్ట్రంలో సగటు వర్షపాతం 130 సెంటీమీటర్ల నమోదు కావాలి. కానీ ఈ ఏడాది జూన్‌లో కేవలం 104 సెంటీమీటర్లే కురిసింది. అంటే సాధారణం కంటే 26 సెంటీమీటర్ల లోటు వర్షపాతమే. గతేడాది జూన్‌లో 159 సెంటీమీటర్లు అంటే సాధారణం కంటే 29 సెంటీమీటర్లు అధిక వర్షపాతం నమోదైంది. ఇక జూలైలో 227, ఆగస్టులో 215 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాలి. ప్రస్తుతం లోటు వర్షపాతం నమోదు కావడంతో, రాష్ట్ర రైతాంగం ఆశలన్నీ జూలై, ఆగస్టులపైనే పెట్టుకుంది. కాగా, రాష్ట్రంలో జూన్ నెలలో 20 జిల్లాల్లో సాధారణ వర్షపాతం పడినట్లు వాతావరణ కేంద్రం గణాంకాలు

మిగతా 12వ పేజీలో...



మస్క్‌ను అమెరికా నుంచి

పంపించేస్తాం!

ప్రభుత్వ సబ్సిడీలు లేకుంటే మస్క్ తన దుకాణం మూసుకోవాల్సిందే

తిరిగి దక్షిణాఫ్రికాకు పోవాల్సిందే

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు

'సూటిగా చెబుతున్నా.. సబ్సిడీలు వెంటనే తొలగించండి' అంటూ మస్క్ ప్రతి సవాల్


రిపబ్లికన్ పార్టీని పందుల పార్టీ అంటూ మండిపాటు.. కొత్త పార్టీ పెడతానని వెల్లడి

వాషింగ్టన్, జూలై 1: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఈలాన్ మస్క్ మధ్య భేదాభిప్రాయాలు మరింతగా ముదిరాయి. మరోసారి ఒకరిపై ఒకరు బహిరంగంగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించుకున్నారు. "చరిత్రలోనే ఎవరూ పొందలేనంతగా మస్క్ సబ్సిడీలు పొందుతున్నారు. ఈ సబ్సిడీలే లేకుంటే రాకెట్ ప్రయోగాలు

మిగతా 8వ పేజీలో...

సెటిల్‌మెంట్ అడ్డాలుగా

పోలీస్‌స్టేషన్లు!



రాష్ట్రం ఏర్పడ్డాక ఈ ట్రెండ్ పెరిగిపోయింది

ప్రస్తుతం ఉధృతంగా మారి పతాకస్థాయికి..

కోర్టు ఉత్తర్వుల్ని సైతం లెక్క చేయట్లేదని పోలీసులపై పిటిషన్లు వస్తున్నాయి

సివిల్ కేసు సెటిల్ చేసుకోవాలని పౌరుడిని స్టేషన్‌లో నిర్బంధించడమేంటి?

నాగోల్ పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం

ఎస్‌వోపీ రూపొందించాలని డీజీపీకి ఆదేశం

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లు సెటిల్‌మెంట్ దందాలకు అడ్డాలుగా మారుతున్నాయని హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పోలీసు శాఖలో ఈ ట్రెండ్ పెరిగిపోయిందని, ప్రస్తుతం ఉధృతంగా మారి పతాక స్థాయికి చేరిందని వ్యాఖ్యానించింది. సివిల్ కోర్టులు ఇంజంక్షన్ ఆర్డర్‌లు ఇచ్చినప్పటికీ కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా పోలీసులు జోక్యం చేసుకుంటున్నారనే ఫిర్యాదులతో ఎక్కువ పిటిషన్‌లు దాఖలవుతున్నాయని ప్రస్తావించింది. ఆస్తి వివాదాలతో వచ్చే కక్షిదారులకు సివిల్ కోర్టుకు వెళ్లి విషయాన్ని పరిష్కరించుకోవాలని పోలీసులు చెప్పాలని స్పష్టం చేసింది. బలప్రయోగంతో సెటిల్‌మెంట్లు చేయడం, కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడం సరికాదని వ్యాఖ్యానించింది. ఎన్ని దశాబ్దాలుగా భూమి స్వాధీనంలో ఉన్నా సరైన హక్కు పత్రాలు లేకపోతే సదరు ఆస్తిపై ఎలాంటి హక్కులు దఖలు పడవు అని తేల్చిచెప్పింది. ఈ మేరకు

మిగతా 12వ పేజీలో...



హాసన్‌లో హడలెత్తిస్తున్న గుండెపోటు మరణాలు

40 రోజుల్లో 24 మంది మృతి

తీవ్ర ఆందోళనలో కర్ణాటకలోని హాసన్ జిల్లా ప్రజలు

విచారణకు ఆదేశించిన సీఎం

8

ప్రాణాలు తీస్తున్న

ఒంటరితనం

కుంగుబాటుకు, ఆత్మహత్య ఆలోచనలకు కారణమవుతున్న ఏకాకి జీవనం

8

ఏటా ప్రపంచవ్యాప్తంగా 8.71 లక్షల మరణాలు.. డబ్ల్యూహెచ్‌వో నివేదిక

ఉపాధికి లక్ష కోట్ల ఊతం

రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలే లక్ష్యం

ఈఎల్ఐ పథకానికి కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా

మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి గరిష్ఠంగా రూ.15వేల దాకా ప్రోత్సాహకం అందజేత

నూతన జాతీయ క్రీడా విధానం

8

'ఖేలో భారత్ నీతి'.. టార్గెట్ 2047



రైలు సేవలన్నీ ఒకే చోట

సరికొత్తగా 'రైల్ వన్' యాప్

రిజర్వేషన్, ప్లాట్‌ఫాం టికెట్ సహా.. అన్ని సేవలు అందుబాటులో

8

గురుకులాల డైట్ చార్జీలకు రూ. 170 కోట్లు

ఏప్రిల్ దాకా బకాయిల నిధులు విడుదల

నెలాఖరుకు విద్యార్థులకు యూనిఫాంలు

ఇకపై ఏ నెలకు ఆ నెల బిల్లుల చెల్లింపు

12

సాంఘిక సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విలువలు కోల్పోతున్న కోల్‌కతా!

బ్రిటిష్ సామ్రాజ్యంలో రెండో మహానగరంగా వర్ధిల్లి నవ భారత జాగృతికి ఆలంబనగా నిలిచిన నాటి కలకత్తా నేడు కోల్‌కతాగా నవ జీవన నిర్మాణ సామర్థ్యాన్ని కోల్పోయి నాగరీక విలువలను నిర్వీర్యపరుస్తోంది. భారతావని మేధో, సాంస్కృతిక, ఆర్థిక హృదయంగా నీరాజనాలు అందుకున్న బెంగాల్ రాజధాని, రాజ్యాధినేత్రి మమతా బెనర్జీ రాజనీతిజ్ఞతకు, ప్రజాహితంలో పథ నిర్దేశకత్వానికి కాకుండా పాలనా అస్తవ్యస్తతకు పదే పదే వార్తల కెక్కుతోంది. ఇందులో తాజా ఘట్టమే దక్షిణ కోల్‌కతాలోని ఒక న్యాయ కళాశాల ప్రాంగణంలో విద్యార్థినిపై పైశాచికత్వం, ఈ అమానుషాన్ని ఆసరాగా చేసుకున్న రాజకీయుల విశృంఖల స్వార్థ క్రీడలు.

దక్షిణ కలకత్తా న్యాయ కళాశాలలో గత నెల 25న మొదటి సంవత్సరం విద్యార్థిని ఒకరిపై మూకుమ్మడి అత్యాచారం జరిగింది. కోల్‌కతా నగరమూ సమస్త బెంగాలీ సమాజమూ ఈ దురాగతానికి దిగ్భ్రాంతి చెందాయి. నగరంలోని ఆర్‌జీ కర్ వైద్యకళాశాలలో యువ డాక్టర్ ఒకరు అత్యాచారం, హత్యకు గురై ఏడాది కూడా కాకముందే న్యాయకళాశాలలో చోటు చేసుకున్న దురాగతం అందరినీ నివ్వెరపరిచింది. ఆగ్రహపరిచింది. ఆందోళనలకు పురిగొల్పింది. పాలక ప్రతిపక్షాలు యథావిధిగా తమ చాణక్యాలు ప్రదర్శిస్తున్నాయి. అందునా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణమిది. నిందితులు పాలక తృణమూల్ కాంగ్రెస్‌తో సంబంధమున్న వారు కావడంతో ముఖ్యమంత్రి మమత రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. బీజేపీ నిజనిర్ధారణ సంఘాన్ని పంపించింది. బెంగాల్ కంచుకోటను జయించేందుకై ఈ ఘటనను పూర్తిగా ఉపయోగించుకునేందుకు ఆ పార్టీ అన్ని విధాల సమయాత్తమవుతోంది.

మన సమాజంలో మహిళలపై హింసాకాండ వ్యవస్థాబద్ధమైనది. దీన్ని నివారించేందుకు చట్టాలు చాలా ఉన్నాయి. అయితే వాటిని అమలుపరచడంలో చిత్తశుద్ధి చూపుతున్నారా? ఈ బాధ్యతా రాహిత్యం కారణంగానే చిన్నారులు, యువతులు, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినవారు శిక్ష నుంచి తప్పించుకోగలుగుతున్నారు. 2012లో సమస్త భారతీయులను కలవరపరిచిన నిర్భయ ఉదంతంతో అత్యాచారాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చారు. చిత్రమేమిటంటే ఆ చట్టాలు వచ్చిన తరువాత అత్యాచారాల సంఖ్య మరింతగా పెరిగిపోయింది. శిక్షలకు గురవుతున్న సంబంధిత నేరస్తుల సంఖ్య మాత్రం ఎప్పటిలానే తక్కువగా ఉంటోంది. ఎందుకిలా జరుగుతోంది? ఒక విద్యార్థిని మానహాని భయం లేకుండా విద్యాలయానికి వెళ్ల లేని పరిస్థితికి, ఒక గృహిణి వైద్యం నిమిత్తం నిర్భయంగా ఆసుపత్రికి వెళ్లలేని అగత్యానికి ఎవరు బాధ్యులు? పాలకులేనా? తప్పకుండా. అయితే సమాజానికి నైతిక బాధ్యత లేదూ?

కోల్‌కతాలో దాదాపు ఏడాది క్రితం ఒక ప్రభుత్వాసుపత్రిలో సంభవించిన హత్యాచారం, ఇప్పుడు న్యాయకళాశాలలో చోటుచేసుకున్న దురాగతం రెండిటి వెనుక ప్రభుత్వ పాలనా వైఫల్యమూ, విశాల సమాజ నైతిక దౌర్బల్యమూ ఉన్నాయి. ఒప్పుకుని తీరాల్సిన కఠోర వాస్తవాలివి. ఒక మహిళ ప్రభుత్వాధినేతగా ఉన్న సమాజంలో ఈ ఘోరాలు పదే పదే జరగడమేమిటి? మహిళలు అర్ధరాత్రి పూట స్వేచ్ఛగా బజారులలో తిరగగలిగిన నాడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అని మహాత్మా గాంధీ అన్నారు. అలా తిరగలేని దుస్థితిని కేవలం ఒక వర్తమాన పరిణామంగానే కాకుండా చారిత్రక కోణంలో కూడా వివేచించవలసి ఉన్నది.

'భారతదేశంలో తొలి ఆధునిక మానవుడు' రామమోహన్ రాయ్ నడయాడిన గడ్డ బెంగాలీ సమాజం. దారుణమైన సతీసహగమన దురాచారాన్ని రూపుమాపేందుకు ఫలవంతమైన కృషి చేసిన మానవతామూర్తి ఆయన. మహిళాభ్యుదయానికి విశేష దోహదం చేసిన రామమోహన్ రాయ్ స్ఫూర్తి కాలానుగుణంగా సమాజ జీవితంలో ప్రతిఫలిస్తుందా? బెంగాలీల అభిమాన ఆట ఫుట్‌బాల్‌ను నడి రాత్రి వీధుల్లో ఆడాలనే బెంగాలీ యువతుల కలలు కలలుగా మిగిలిపోని రోజులు వచ్చేనా? అటువంటి శుభదినాల రాకతో మాత్రమే బెంగాల్ జీవనవాహిని భ్రష్టత్వాన్ని వదిలించుకుని భవ్యత్వాన్ని సంతరించుకుంటుంది. అలా జరగాలన్నదే ప్రతి భారతీయుడి ఆకాంక్ష.

మరలిపోయిన మనసు మాంత్రికుడు

ఆయన సినీ నటుడు కాదు, రాజకీయ నాయకుడు కాదు, కాని ఆయన్ని వినటానికి వందలాదిగా జనం వస్తారు. నిశ్శబ్దంగా వింటారు. కొందరయితే చిన్న పుస్తకం తెచ్చుకొని చెప్పినవి శ్రద్ధగా రాసుకుంటారు. ఆయనతో సంభాషించటానికి ఉవ్విళ్లూరుతారు. ఆయన మనసుతో మాట్లాడగలిగిన మనిషి, మనసు మర్మాన్ని తెలుసుకున్న మాంత్రికుడు. మాటలతో వైద్యం చేయగల డాక్టర్. ఆయనే బి.వి. పట్టాభిరామ్.

సుమారు మూడు దశాబ్దాల పాటు ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌గా, రచయితగా... తను పని చేసిన ప్రతి రంగం లోనూ అగ్రస్థానంలో నిలిచిన వ్యక్తి పట్టాభిరామ్. ఆయనతో నా ప్రయాణం సుమారు 30 ఏళ్లు. ఈ కాలంలో ప్రతిరోజు కనీసం 15 నిమిషాలు ఆయనతో మాట్లాడేవాడిని. వివిధ సామాజిక అంశాల గురించి చర్చించేవాళ్లం.

మొన్న ఆదివారం వాళ్ల అబ్బాయి, కోడలు, మనవరాళ్లు, భార్య జయగారితో గంటసేపు గడిపాం. "ఈరోజు ఆయన లేడు" అనేది నాకు వెలితిగా అనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాలలో కొన్ని లక్షల కుటుంబాల్లో ఆయనకు అభిమానులు ఉన్నారు. తెలుగులో అత్యధిక పాఠకాదరణ కలిగిన రచయితగా సుమారు 25 ఏళ్లుగా ఆయన కొనసాగుతున్నారు.



ఆ మ్యాజిక్ వెనక ఉన్న లాజిక్ చెప్పమని బాలమురళీకృష్ణ, సిరివెన్నెల పట్టుపట్టారు. "సంగీతం, సాహిత్యం మీకు ఎంత తెలిస్తే అంతగా ఎంజాయ్ చేస్తారు, మ్యాజిక్ మాత్రం మీకు ఎంత తెలియకపోతే అంత ఎంజాయ్ చేస్తారు" అని తక్కున సమాధానం చెప్పారు పట్టాభిరామ్. అదే ఆయన సమయస్ఫూర్తి.

2002 సెప్టెంబర్‌లో నేను, పట్టాభిరామ్ కలిసి ఢిల్లీ వెళ్ళాం. పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు ఉదయం అల్పాహారానికి పిలిచారు. ఆయనతో చాలా సమయం సరదాగా గడిపాం. పీవీగారు చిన్న పిల్లాడిలా మ్యాజిక్‌లు చూస్తూ చప్పట్లు కొట్టడం నాకు ఆశ్చర్యం కలిగించింది. పట్టాభిరామ్‌ని పీవీగారు మ్యాజిక్ రహస్యాలు అడిగారు. "అయ్యా, ఇవీ రాజకీయల్లోలాగానే, వ్యూహం ముందే తెలిసిపోతే ఇంద్రజాలికుడు విఫలం అవుతాడు" అని నవ్వుతూ తప్పించుకున్నారు పట్టాభిరామ్. అలాంటిదే మరో సంఘటన: మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సిరివెన్నెల సీతారామశాస్త్రి, పట్టాభిరామ్, నేను ఒకరోజు సాయంకాలం కాలక్షేపానికి కూర్చున్నాం. పట్టాభిరామ్ కొన్ని మ్యాజిక్‌లు చేశారు. మంగళంపల్లి, సిరివెన్నెల ఆ మ్యాజిక్‌ల వెనకాల లాజిక్ చెప్పమని పట్టుపట్టారు. దానికి పట్టాభిరామ్ చెప్పిన సమాధానం ఇప్పటికీ నాకు గుర్తుంది: "సంగీతం, సాహిత్యం మీకు ఎంత తెలిస్తే అంతగా ఎంజాయ్ చేస్తారు, మ్యాజిక్ మాత్రం మీకు ఎంత తెలియకపోతే అంత ఎంజాయ్ చేస్తారు" అని తక్కున సమాధానం చెప్పారు. అదే ఆయన సమయస్ఫూర్తి.

మ్యాజిక్‌లో ఉండే సమయస్ఫూర్తిని ఆయన కౌన్సిలింగ్‌లోనూ అద్భుతంగా ఉపయోగించేవారు. మా అమ్మాయి శారద సైకాలజీ కౌన్సిలర్. ఆయన దగ్గర కొంతకాలం శిక్షణ తీసుకుంది. తరువాత ఆయనతో కలిసి కొంత ప్రాక్టీస్ కూడా చేసింది. పట్టాభిరామ్ కౌన్సిలింగ్ శైలి సాంప్రదాయికమైంది కాదనీ, ఒక విలక్షణమైన ఆకర్షణ శక్తితో ఆయన తన మాటల్ని ఎదుటివాళ్ల మెదడులోకి జొప్పిస్తారనీ ఆమె చెప్పేది. ఎమెస్కో ప్రచురించిన 'మైండ్ మ్యాజిక్' చరిత్ర సృష్టించినా, 'కష్టపడి చదవొద్దు – ఇష్టపడి చదవండి' లక్షలాది కాపీలు అమ్మినా, ఆయన రచించిన సుమారు 100 పుస్తకాలు ఎంతో విజయవంతమైనా దాని వెనకాల పట్టాభిరామ్ విలక్షణమైన ఆకర్షణ శక్తి ఉంది.

ఆంధ్రజ్యోతి పత్రికాధిపతి రాధాకృష్ణగారు, పట్టాభిరామ్, నేనూ ఒక సమావేశంలో కలిసాం. "అయ్యా అందరినీ ఇరుకునపెట్టే ప్రశ్నలతో ఇబ్బందిపెట్టే మీరు, పట్టాభిరామ్‌తో 'ఓపెన్ హార్ట్' కార్యక్రమంలో ఆయనకి ఒక్క ఇబ్బందికరమైన ప్రశ్నా వేయలేదు" అన్నాను నేను రాధాకృష్ణగారితో. దానికి సమాధానంగా రాధాకృష్ణగారు, "కొంతమందిని మనం ఇబ్బందిపెట్టకూడదు, వాళ్లను అలా ఉండనివ్వాలి," అంటూ పట్టాభిరామ్ భుజం మీద చేయివేసి దగ్గరికి తీసుకున్న సంఘటన నాకు ఇంకా గుర్తుంది.

పట్టాభిరామ్ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే చిన్న సంఘటన ఒకటి ఇక్కడ పంచుకోవాలి. అనంతపురంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సుమారు 3000 మందికి పైగా విద్యార్థులు, 300 మందికి పైగా అధ్యాపకులు, సిబ్బంది పట్టాభిరామ్‌ని వినటానికి యూనివర్సిటీ కాన్వొకేషన్ హాల్‌లో గుమిగూడారు. గంటసేపు ఆయన అనర్గళంగా ప్రసంగించారు. అందరూ నిశ్శబ్దంగా విన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ప్రశ్నలు వేసే సమయం ఆసన్నమైంది. ఒక విద్యార్థి లేచి "దేశభక్తి అంటే ఏమిటి?" అని అడిగాడు. ఆయన ఆ కుర్రాణ్ణి ముందు వరుసలోకి వచ్చి కూర్చోమని చెప్పారు. "అందరూ వెళ్లిపోయేదాక ఇక్కడే కూర్చో నీకు సమాధానం చెబుతాను" అన్నారు. సమావేశం ముగిసింది. ఆయన వేదిక దిగి ఆ కుర్రాడి దగ్గరకు వెళ్ళి, "బాబు, అందరూ వెళ్లిపోయారు కదా, ఇప్పుడు ఏం చేద్దాం" అన్నారు. "సర్, నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి?" అని అడిగాడు ఆ కుర్రాడు. "సరే, బయటకు పోతున్నాంగా లైట్లు అన్నీ స్విచ్ ఆఫ్ చేసి రా," అంటూ బయటకు నడిచారు. బయటకు వచ్చిన తర్వాత మళ్లీ ఆ కుర్రాడు అడిగాడు. అప్పుడు పట్టాభిరామ్ అన్నారు గదా: "ఇప్పుడు నువ్వు చేసిన పనే దేశభక్తి అంటే. అందరూ వెళ్లాక చివరికి వెళ్లేవాళ్లు గదిలో లైట్లు ఆర్పివేయటం, రోడ్డు మీద చెత్త పారేయకుండా ఉండటం, ఎక్కడన్నా నీరు వృథాగా పోతుంటే దాని గురించి పట్టించుకోవటం... ఇదే దేశభక్తి. దేశభక్తి అంటే మనం బాధ్యతగా ఉండటం". ఈ మాట చెప్పిన పట్టాభిరామ్ ఇప్పుడు తన బాధ్యతను పూర్తిచేసుకొని తనకున్న శక్తిమేరకు లక్షలాదిమందిలో స్ఫూర్తిని నింపి నిష్క్రమించారు. మన పట్ల, సమాజం పట్ల సానుకూల దృక్పథంతో ఉండటమే ఆయనకు మనం ఇచ్చే నివాళి.

■ 'ఎమెస్కో' విజయ్‌కుమార్

పోలీసులు ఎవరి కోసం పనిచేయాలి?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్ |

రాజకీయ నాయకులు చెప్పినట్లు నడుచుకోవాల్సిన పరిస్థితుల్లో పోలీసులు ఎన్నో ఒత్తిళ్లకు గురవుతారని, తమ నియంత్రణలో లేని పనులు చేయడం వారికి కత్తి మీద సాములాంటిదని 'ఇండియన్ పోలీస్ జర్నల్' తాజా సంచికలో వచ్చిన ఒక వ్యాసం వ్యాఖ్యానించింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్' (బీపీఆర్‌డీ) ఈ జర్నల్‌ను ప్రతి ఆరునెలలకోసారి ప్రచురిస్తుంటుంది. దాదాపు 72 శాతం మంది పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతారని, ఏది తప్పో, ఏది ఒప్పో ఆలోచించకుండా పనులు చేయాల్సి ఉంటుందని ఇది పోలీసుల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని ఈ వ్యాసకర్తలు రాశారు. పోలీసులు తీసుకునే ప్రతి నిర్ణయమూ ఒక నైతిక యుద్ధంలాగా మారుతుందని, చట్టాన్ని అమలు చేయాలా లేక రాజకీయ ప్రయోజనాలను పరిరక్షించాలా తేల్చుకోలేకపోతారని ఆ వ్యాసరచయితలు తెలిపారు.

'మీరు అయిదు సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉంటారు. కాని మేము అంతకంటే ఎక్కువ కాలం బాధ్యతల్లో ఉంటాం. రాజ్యాంగాన్ని కాపాడడం మా విధి' అని ప్రభుత్వాధినేతలకు ధైర్యంగా చెప్పిన అధికారులు సినిమాల్లోనే కాదు, నిజజీవితంలోనూ కనపడకపోరు. రూల్ ఆఫ్ లా, ప్రాథమిక హక్కులను కాపాడేందుకు, రాజకీయ జోక్యాన్ని ఎదుర్కొనేందుకు, దర్యాప్తు నిజాయితీగా కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందేందుకు ప్రయత్నించిన అధికారులు ఎందరో ఉన్నారు. అదే సమయంలో ఇందుకు విరుద్ధంగా చాలా సందర్భాల్లో పోలీసు అధికారులు పార్టీ కార్యకర్తల్లా ప్రవర్తిస్తూ అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తి అనేక దారుణాలకు పాల్పడిన సందర్భాలు కూడా మనకు ఎదురవుతున్నాయి. ఇవాళ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలువురు ఐపీఎస్, ఇతర పోలీసు అధికారులు గతంలో తాము చేసిన పాపాలకు సస్పెండ్ కావడం, విచారణను ఎదుర్కోవడం, శంకరగిరి మాన్యాలు పట్టడం మొదలైన పరిణామాలు సంభవిస్తున్నాయి.

రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు, వారిని భయభీతులను చేసేందుకు, మీడియాను నియంత్రించేందుకు, తమ వ్యక్తిగత కోరికలను తీర్చుకునేందుకు అధికార పార్టీ నేతలు పోలీసు యంత్రాంగాన్ని ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకునే ఉదంతాలు గడచిన పది సంవత్సరాలుగా ఎక్కువైపోయాయి. పార్లమెంట్ సభ్యులనే అరెస్టు చేసి చితకబాదేందుకు, గడచిన ప్రభుత్వాల హయాంలో జరిగిన పాపాలను కప్పిపుచ్చేందుకు, హార్డ్ డిస్క్‌ల వంటి సాక్ష్యాధారాలను మాయం చేసేందుకు కూడా పోలీసులు వెనుకాడలేదు. ఒక వ్యక్తిని అరెస్టు చేసేందుకు అవసరమైన సాధారణ నిబంధనలను కూడా పాటించాలన్న విజ్ఞతను కోల్పోయి రాజకీయ బాస్‌లు చెబితే చాలు, తప్పుడు కేసులు బనాయించే విషయంలో నిర్విచక్షణగా, అత్యుత్సాహంతో వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉన్నవారు చేసే నేరాలను విస్మరిస్తున్నారు. సామాన్యులపై హింసాత్మకంగా వ్యవహరించే పోలీసులు పలుకుబడిగల వారి పట్ల శీత కన్ను వేస్తున్నారు. గ్లోబల్ టార్చర్ ఇండెక్స్ ప్రకారం మానవ హక్కుల ఉల్లంఘనలో భారత్ ముందువరుసలో స్థానం సంపాదించింది. ప్రజా ప్రయోజనాలకు, సుపరిపాలనకు టెక్నాలజీని ఉపయోగించుకోవాల్సి ఉండగా, దాన్ని పూర్తిగా దుర్వినియోగం చేయడం దేశంలో రోజురోజుకూ ఎక్కువైపోతోంది. రాజకీయాలు, పరిపాలనా వ్యవస్థలు పూర్తిగా నైతికత కోల్పోతున్నాయన డానికి ఈ సంఘటనలు ప్రత్యక్ష నిదర్శనం.

నిజానికి గతంలో కూడా రాజకీయ ప్రయోజనాలకు పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకున్న దాఖలాలు లేకపోలేదు. కాని అత్యంత కీలకమైన పరిస్థితుల్లోనే అలా జరిగేది. 2000లో అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పెట్టే విధంగా తరుణ్ తేజ్‌పాల్, అనిరుద్ధ్ బహల్ అనే ఇద్దరు జర్నలిస్టులు ఆపరేషన్ వెస్ట్ ఎండ్ పేరుతో కొన్ని సంచలనాత్మక వార్తలు రాశారు. ఈ జర్నలిస్టులు అప్పటి బీజేపీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్, మరికొందరు ఎన్డీఏ నేతలు, సీనియర్ సైనిక అధికారులపై స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. దీనితో బంగారు లక్ష్మణ్ రాజీనామా చేశారు. వాజపేయి ప్రభుత్వం జవాబు చెప్పుకోలేని పరిస్థితిలో పడింది. ఇదే సమయంలో ఈ కథనాలు రాసిన జర్నలిస్టులను హత్య చేస్తే ఆ పాపం కూడా వాజపేయి ప్రభుత్వంపై పడుతుందని, అంతర్జాతీయంగా సంచలన వార్తగా మారి మొత్తం ప్రభుత్వమే కుప్పకూలిపోతుందని పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ కుట్రపన్నింది. అప్పటికే 1993లో పీవీ హయాంలో ఐఎస్ఐకి ముంబైలో సీరియల్ పేలుళ్లకు పాల్పడిన చరిత్ర ఉంది. దీన్ని నిర్వహించడంలో పాత్ర పోషించిన దావూద్ ఇబ్రహీం లాంటి వారు పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్నారు. స్టింగ్ ఆపరేషన్ నిర్వహించిన ఇద్దరు జర్నలిస్టులను హత్య చేసే కుట్రలో ఈసారి బిహార్‌కు చెందిన మాఫియా నేత, ఆర్జేడీ పార్లమెంట్ సభ్యుడు షాబుద్దీన్ పాలుపంచుకుంటున్నారన్న విషయం సీబీఐ దృష్టికి వచ్చింది. షాబుద్దీన్ పేరు చెబితే అప్పుడు పోలీసులకే కాదు, అనేకమందికి సింహస్వప్నం. తనను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులను కొట్టి చంపించిన ఘనుడు షాబుద్దీన్. తనకు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన మెజిస్ట్రేట్‌ను నిండు కోర్టులోనే హతమారుస్తామని హెచ్చరించినవాడు. నీరజ్‌కుమార్ అనే సీబీఐ జాయింట్ డైరెక్టర్ పాట్నా నుంచి ఢిల్లీ వస్తుండగా, షాబుద్దీన్‌ను విమానంలోనే చూశాడు. దీనితో ఢిల్లీలో స్పెషల్ పోలీసులకు వర్తమానం పంపించాడు. విమానం ఢిల్లీ చేరుకోగానే అతడ్ని అరెస్టు చేయాలన్నది నీరజ్ కుమార్ ప్లాన్. విచిత్రమేమంటే ఢిల్లీలో విమానం దిగిన తర్వాత అక్కడ ఢిల్లీ పోలీసులెవరూ కనిపించ లేదు. ఆరా తీస్తే షాబుద్దీన్‌ను ముట్టుకోవద్దని, నీరజ్ కుమార్‌కు సహకరించవద్దని ఢిల్లీలో రాజకీయ పెద్దలు చెప్పినట్లు తేలింది. ఈ విషయం గురించి తన పదవీ విరమణ తర్వాత నీరజ్ కుమార్ 'ఖాకీ ఫైల్స్' అనే పుస్తకంలోనే పూసగుచ్చినట్లు వివరించారు. తన ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించిన షాబుద్దీన్‌ను వాజపేయి ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయకుండా అడ్డుకుంది? బిహార్‌లో అప్పుడున్న ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు స్థానిక రాజకీయనాయకులు షాబుద్దీన్‌తో ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారనీ, అదే అతడిని రక్షించిందని నీరజ్ కుమార్ రాశారు. తర్వాతి కాలంలో షాబుద్దీన్ అరెస్టు అయి, తిహార్ జైలులో మరణించాడు. అది వేరే సంగతి.



ప్రభుత్వ యంత్రాంగంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న పోలీసులు సమాజంలో శాంతి భద్రతలను సమర్థంగా కాపాడేలా చూడాల్సిన బాధ్యత రాజకీయ వ్యవస్థపై ఉన్నది. ఈ విధ్యుక్త ధర్మాన్ని విస్మరించి రాజకీయవేత్తలు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకే వారిని ఉపయోగించుకుంటే పోలీసులే కాదు, మొత్తం సమాజం మానసిక ఒత్తిళ్లకు గురికాక తప్పదు. గత కొద్ది సంవత్సరాలుగా చోటు చేసుకున్న పరిణామాలు పునరావృతం కాకుండా చూడడం తక్షణ కర్తవ్యం.

షాబుద్దీన్ లాంటి ఓ మాఫియా డాన్ అటు ఆర్జేడీ రాజకీయ సమీకరణాలకు, ఇటు బీజేపీ రాజకీయాలకూ కూడా ఉపయోగపడడం, ఈ క్రమంలో పోలీసు అధికారులు నిస్సహాయ స్థితిలో పడడం భారత రాజకీయాల్లో వికృత పరిణామం. పప్పుయాదవ్, ఆనంద్ మోహన్, ముఖ్తార్ అన్సారీ, అతీఖ్ అహ్మద్‌తో పాటు అనేక మంది చట్టసభల్లో రాజ్యమేలారు. తానున్న వేదికపైనే మాఫియాడాన్‌లు ఉన్నారంటూ ఫైజాబాద్‌కు చెందిన బీజేపీ మాజీ ఎంపీ గత ఏడాది ఆ సమావేశాన్ని బహిష్కరించి వార్తల్లో కెక్కారు. యోగి ఆదిత్యనాథ్ హయాంలో యూపీలో అనేకమంది మాఫియాడాన్ లను అంతం చేసినప్పటికీ బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు నేర చరితులకు చట్టసభల్లో స్థానం కల్పించాయని 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) తన నివేదికలో వెల్లడించింది. గత లోక్‌సభలో ఎన్నికైన 543 మందిలో 251 మందిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. రాజ్యసభలో 36 శాతం మంది నేరచరితులే. ఇవాళ అనేకమంది నేరచరితులైన రాజకీయనాయకులపై కేసులు ఏళ్లతరబడి కొనసాగేందుకు కేంద్ర సంస్థలు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసు, దర్యాప్తు అధికారులు తమ పనులు తాము చేసేందుకు అనుమతిస్తే ఈ ఆరోపణలకు తావెక్కడుంటుంది?

భారతీయ పోలీసులపై కేవలం 30 శాతం మంది ప్రజలకే విశ్వాసం ఉన్నదని లోక్ నీతి-సీఎస్‌డీఎస్ నిర్వహించిన సర్వేను ఇండియన్ పోలీసు జర్నల్ ఉటంకించింది. దాదాపు 42 శాతం మంది ప్రజలు పోలీసుల నిజాయితీని శంకిస్తున్నారని, పోలీసుల ప్రతి చర్యా ప్రజల దృష్టిని దాటిపోవడం లేదని తెలిపింది. ఈ విషయం తెలిసినందువల్లే అనేకమంది పోలీసులు మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారని, ఈ క్రమంలో భారతీయ పోలీసుల్లో ఆత్మహత్యలు కూడా పెరిగిపోతున్నాయని ఈ జర్నల్ తెలిపింది. 2021లో 405 మంది పైగా పోలీసులు ఆత్మహత్య చేసుకున్నట్లు జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రికార్డు చేసింది. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో పోలీసుల ఆత్మహత్యల సంఖ్య ఎక్కువ. 83 శాతం పోలీసులు తమ విధి నిర్వహణలో మానసిక ఆరోగ్య ప్రభావాలకు లోనైనట్లు 2024లో జరిగిన ఒక సర్వే పేర్కొంది. నిరంతర వృత్తిపరమైన ఒత్తిళ్లు, ఆర్థిక కష్టాలు, తమ స్వంత వ్యవస్థ నుంచే మద్దతు లభించకపోవడం ఇందుకు కారణమని ఈ సర్వే తెలిపింది. ఇటీవల ఢిల్లీ పోలీసుల్లో వృత్తిపరమైన ఒత్తిళ్లపై కూడా ఒక సంస్థ శాస్త్రీయంగా సర్వే నిర్వహించింది. సిబ్బంది, వనరుల కొరత, పని పరిస్థితులు, సహచరుల నుండి మద్దతు లేకపోవడం, వ్యక్తిగత, సామాజిక జీవితం కోల్పోవడం, అలిసిపోవడం వల్ల అనేకమంది పోలీసులు ఒత్తిళ్లకు లోనవుతున్నట్లు పేర్కొంది. అత్యధిక శాతం మంది డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి జబ్బులకు లోనయ్యారని గుర్తించింది.

ప్రభుత్వ యంత్రాంగంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న పోలీసులు సమాజంలో శాంతి భద్రతలను సమర్థంగా కాపాడేలా చూడాల్సిన బాధ్యత రాజకీయ వ్యవస్థపై ఉన్నది. ఈ విధ్యుక్త ధర్మాన్ని విస్మరించి రాజకీయవేత్తలు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకే పోలీసులను ఉపయోగించుకుంటే పోలీసులే కాదు, మొత్తం సమాజం మానసిక ఒత్తిళ్లకు గురికాక తప్పదు. గత కొద్ది సంవత్సరాలుగా చోటు చేసుకున్న పరిణామాలు పునరావృతం కాకుండా చూడడం తక్షణ కర్తవ్యం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పెరుగుదల సరే, నిలకడ సంగతేమిటి?

ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 48వేల మందికి పైగా విద్యార్థులు కొత్తగా నమోదయ్యారని ఇటీవలి సమీక్షా సమావేశంలో విద్యాశాఖ వెల్లడించింది. ఈ చేరికలపై 'బడిబాట' ప్రభావం చాలా ఉందంటూ ఉపాధ్యాయుల కృషిని అభినందించింది. కానీ, చేరిక లెక్కలు చూసి సంబరపడితే సరిపోదు. ఆ సంఖ్య నిలకడగా కొనసాగడం ముఖ్యం. తల్లిదండ్రులు ఏం ఆశించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారో, ఆ ఆశయాలతో పాటు విద్యా లక్ష్యాలు సాధించాలి. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచి, శుచితో మధ్యాహ్న భోజనం అందించాలి. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలతో పాటు, ఆధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ బోర్డు, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి. ప్రాథమిక, ఉన్నత స్థాయిల్లో విద్యార్థులకు నైతిక విద్య, కౌమార విద్య, పారిశ్రామిక విద్య, వ్యవసాయ విద్యను పరిచయం చేయాలి. ప్రీప్రైమరీ విద్యను కొనసాగిస్తూ, రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను ప్లే స్కూళ్లుగా మార్చాలి. గురుకులాలు, ఆదర్శ పాఠశాలల వంటి రెసిడెన్షియల్ స్కూళ్లపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కనీసం వారానికి రెండు రోజులు పాఠశాలలను తప్పనిసరిగా తనిఖీ చేయాలంటూ అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించడం మంచి నిర్ణయమే! అయితే కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో మానిటరింగ్ వ్యవస్థ కుప్పకూలింది. విద్యాశాఖలో ఏళ్లుగా జిల్లా ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారుల నియామకాలు లేకపోవడం విచారకరం. విద్యాశాఖలో ఇన్‌చార్జి అధికారులతోనే ప్రభుత్వం సరిపెడుతోంది. అవసరమైతే రిటైర్డ్ విద్యాశాఖ అధికారులు, అనుభవజ్ఞులైన రిటైర్డ్ ఉపాధ్యాయుల సేవలను స్వచ్ఛందంగా వినియోగించుకోవడం మంచి ప్రత్యామ్నాయం. కానీ, ఉపాధ్యాయులనే ఇతర ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల తనిఖీకి వాడుకోవడం వల్ల బోధన కుంటుపడుతుంది. 'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిన' చందంగా తయారవుతుంది. కాబట్టి విద్యాశాఖ తీసుకునే నిర్ణయాలు ఆ శాఖకే ప్రతిబంధకాలుగా మారకూడదు. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు అంతర్గత శిక్షణతోపాటు, పటిష్ఠమైన మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ బడుల సంస్కరణను ప్రభుత్వం కేవలం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలి.

– ఎన్. తిర్మల్


ఏ కోణంలోనూ కాళేశ్వరాన్ని సమర్థించలేం!

పార్లమెంట్ మాజీ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ 'గతం తెలిసీ కాళేశ్వరంపై ఎందుకీ నిందలు' పేరుతో జూన్ 19న 'ఆంధ్రజ్యోతి'లో రాసిన వ్యాసం కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నంగా కనిపించింది. అది ప్రజలను తప్పుదారి పట్టించేందుకు, కేవలం రాజకీయ కోణంలో రాసిన వ్యాసం.

వినోద్ కుమార్ తన వ్యాసంలో తుమ్మిడిహెట్టి వద్ద ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మించడం అశాస్త్రీయమని, మేడిగడ్డ వద్ద నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకమే శాస్త్రీయమని వాదించారు. ఈ వాదన అవాస్తవమే గాక, ప్రజలను గందరగోళానికి గురి చేసే ప్రయత్నం. 2015లోనే కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టత పొందేందుకు రిటైర్డ్ ఇంజనీరింగ్ నిపుణులతో కూడిన కమిటీని నియమించింది. ఆ కమిటీ తన నివేదికలో స్పష్టంగా తుమ్మిడిహెట్టి ప్రాంతమే ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి అనుకూలమని పేర్కొంది. భౌగోళికంగా తక్కువ ఎత్తులో ఉన్న మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణానికి అనువు కాదని, అది ఆర్థికంగా తలకు మించిన భారమవుతుందని కూడా కమిటీ నివేదికలో హెచ్చరించింది. అయినా సరే, ఆ ఇంజనీరింగ్ నిపుణుల కమిటీ సిఫారసులను పక్కకుపెట్టి కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని 'కాళేశ్వరం ఎత్తిపోతల పథకం'గా పునర్నామకరణం చేసి, ప్రాజెక్టు స్థలాన్ని తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అంశాన్ని తానే నిర్ణయించానని, ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియ అన్నీ తానేనని కేసీఆర్ అనేక సందర్భాల్లో ప్రకటించారు. ఆ విధంగా, కేవలం మూడేళ్ల లోపే ఈ ప్రాజెక్టును నిర్మించామని చెబుతూ, 2019లో అట్టహాసంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. కానీ నాలుగేళ్ళు కూడా పూర్తికాకముందే కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో కీలకమైన పిల్లర్లు కుంగిపోయాయి. దీనివల్ల బ్యారేజీలో నిల్వ చేసిన నీటిని సముద్రంలోకి వదిలివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా, కేసీఆర్ ప్రభుత్వ కాలంలోనే మేడిగడ్డ బ్యారేజ్‌ను మూసివేయాల్సి వచ్చింది. ఈ అంశాలేవీ ప్రస్తావించకుండా, గతంలో తీసుకున్న తప్పుడు నిర్ణయాలను సమర్థించడమే ప్రధానంగా వినోద్ కుమార్ వ్యాసం కొనసాగింది.

ఆయన వ్యాసంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు వ్యయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 2007లో ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు వ్యయంతో పోలుస్తూ, కాళేశ్వరం వ్యయాన్ని లక్ష కోట్ల రూపాయలకు పెంచడాన్ని సమర్థించే ప్రయత్నం చేశారు. నిజానికి, 2007లో ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకానికి అప్పటి ప్రభుత్వం 2010లో నిర్మాణ వ్యయాన్ని రూ.38,000 కోట్లుగా తుది అంచనా వేసింది. ఇందులో సుమారు 20 శాతం వ్యయాన్ని ఖర్చు చేయడంతో పాటు, ముఖ్యమైన నిర్మాణ పనులు 2014 నాటికి ప్రారంభమయ్యాయి. అంతేకాక, ఈ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని అనుమతులను కేంద్ర ప్రభుత్వం నుంచి అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పొందింది. ఇలా ప్రాణహిత-చేవెళ్ల ఎత్తిపోతల పథకం నిర్మాణంలో ఉండగానే, 2014లో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అకస్మాత్తుగా నిలిపివేసింది. పేరు మార్చి రీడిజైనింగ్ పేరుతో ప్రాథమిక బారేజీని తుమ్మిడిహెట్టి ప్రాంతం నుంచి మేడిగడ్డకు మార్చింది. దీంతో ప్రాజెక్టు వ్యయం ఒక్కసారిగా లక్ష కోట్ల రూపాయలకు పెరిగింది. అప్పటికే ప్రాణహిత-చేవెళ్ల పథకంపై ఖర్చైన రూ.7,000కోట్ల వ్యయాన్ని లెక్కచేయకుండా, తనకు తానే నియమించిన రిటైర్డ్ ఇంజనీరింగ్ నిపుణుల కమిటీ సిఫారసులను పూర్తిగా విస్మరించి, మేడిగడ్డ వద్ద బారేజీ నిర్మించారు. ఎలాంటి ఆర్థిక లేదా శాస్త్రీయ ప్రమాణాలను పాటించని ఈ భారీ వ్యయాన్ని ఎలా సమర్థించగలం? రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసిన బోయినపల్లి వినోద్ కుమార్ గారికి ఈ అంశాలపై అవగాహన లేదంటే ఎవరు నమ్మగలరు?

అప్పటికే ప్రాణహిత–చేవెళ్ల పథకంపై ఖర్చైన రూ.7,000కోట్ల వ్యయాన్ని లెక్కచేయకుండా, తనకు తానే నియమించిన రిటైర్డ్ ఇంజనీరింగ్ నిపుణుల కమిటీ సిఫారసులను పూర్తిగా విస్మరించి, మేడిగడ్డ వద్ద బారేజీ నిర్మించారు కేసీఆర్. ఎలాంటి ఆర్థిక లేదా శాస్త్రీయ ప్రమాణాలను పాటించని ఈ భారీ వ్యయాన్ని ఎలా సమర్థించగలం? రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసిన బోయినపల్లి వినోద్ కుమార్‌కి ఈ అంశాలపై అవగాహన లేదంటే ఎవరు నమ్మగలరు?



ఇంకొక ముఖ్యమైన అంశం: కేంద్ర ప్రభుత్వ విభాగమైన కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన నివేదికలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుపై చేసిన కీలకమైన ఆర్థిక, శాస్త్రీయ అభ్యంతరాలను వినోద్ కుమార్ తన వ్యాసంలో ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం. కాగ్ నివేదిక ప్రకారం, కాళేశ్వరం ప్రాజెక్టు సమాజానికి లాభసాటిగా ఉండే ప్రాజెక్టు కాదని స్పష్టంగా వెల్లడైంది. ఖర్చు చేసిన ప్రతి 100 రూపాయలకు కేవలం 52 రూపాయల లాభమే సమాజానికి లభిస్తుందని నివేదిక పేర్కొంది. అంతేగాక, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును పూర్తిగా పూర్తిచేయాలంటే అదనంగా మరో రూ.50,000 కోట్లు అవసరమవుతాయని కాగ్ తెలిపింది. ఇప్పటివరకు ఖర్చు చేసిన లక్ష కోట్ల రూపాయల పెట్టుబడికి సరైన ఫలితాలు రాకపోవడమే కాకుండా, నిర్వహణ వ్యయం కూడా చాలా అధికంగా ఉంటుందని కాగ్ నివేదిక పేర్కొంది. ఇప్పటికే వేల కోట్లు ఖర్చయ్యాయి. ఇప్పుడు మరో రూ.50వేల కోట్లు ఖర్చు చేయడం ఎంతవరకు సమంజసం? పైగా, ఇప్పటికైనా ఈ ప్రాజెక్టు సమాజానికి ఉపయోగపడుతుందనే నమ్మకానికి ఎటువంటి ఆధారాలు లేకపోవడం విషాదకరం. ఉదాహరణకు, 2022-23, 2023-24 సంవత్సరాల్లో తెలంగాణ సుమారు 250 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలోనే వరి ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచినప్పుడు, కేసీఆర్ ప్రభుత్వం దీనికి కారణం కాళేశ్వరం ప్రాజెక్టేనని గొప్పగా చెప్పుకుంది. అయితే 2023 అక్టోబరులో కాళేశ్వరం బ్యారేజ్‌లో పిల్లర్లు కుంగిపోయి ప్రాజెక్టును పూర్తిగా నిలిపివేశాక కూడా, 2023-24లో రాష్ట్రం వరి ఉత్పత్తి మరింతగా పెరిగి సుమారు 280 లక్షల మెట్రిక్ టన్నులతో రికార్డు స్థాయికి చేరింది. దీన్ని బట్టి, కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే వరి ఉత్పత్తి పెరిగిందన్న వాదనలో ఏమాత్రం నిజం లేదని అర్థమవుతుంది. రాష్ట్రంలో వరి ఉత్పత్తి పెరగటానికి ప్రధాన కారణాలు 2014 నుంచి 2024 మధ్య కాలంలో రైతుల స్వంత ఖర్చుతో తవ్వించుకున్న బోరు బావుల సంఖ్య 16 లక్షల నుంచి 30 లక్షలకు పెరగడం, గడచిన దశాబ్దంలో వర్షపాతం అనుకూలంగా ఉండడం, అలాగే రైతుల కృషి! అంతేతప్ప కాళేశ్వరం ప్రాజెక్టుకూ, పెరిగిన వరి ఉత్పత్తికి ప్రత్యక్ష సంబంధం లేదు.

కాబట్టి, ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా మారిన ఈ ప్రాజెక్టుపై ఇక మరింత ఖర్చు చేయకుండా, దాని బదులు ఇప్పటికే సుమారు 80 శాతం పూర్తయిన ఇతర ప్రాజెక్టులపై దృష్టి పెడితే మంచిది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ దిశగా కొన్ని ముందడుగులు వేస్తున్న నేపథ్యంలో, అభివృద్ధిని కోరుకునే అన్ని వర్గాలు కూడా ఈ విషయాన్ని ఇదే దృక్కోణంలో ఆలోచించాలి.

• ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

ఉపకులపతి, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం



విప్రచిత్త, మహా వజ్రేశ్వరిగా..

శాకంబరీ వేడుకల్లో భద్రకాళి అవతారాలు

4

విప్రచిత్త అలంకరణలో ఉత్సవమూర్తి



హనుమకొండ కలెక్టరేట్‌లో డాక్టర్స్ డే వేడుకలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఆరోగ్య తెలంగాణ సాధిద్దాం

- డాక్టర్స్ డే వేడుకల్లో కలెక్టర్ స్నేహ శబరీష్

వరంగల్ మెడికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారానే వైద్య వృత్తికి న్యాయం చేకూర్చడం జరుగుతుందని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీఎస్ రాయ్ వైద్యరంగంలో చేసిన సేవలకు గుర్తుగా జూలై 1వ తేదీన దేశంలో డాక్టర్స్ డే నిర్వహించుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ పేదవాడికి వైద్యం అందాలని, ఆరోగ్య తెలంగాణ దిశగా కృషి చేయాలన్నారు. తాను కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అయ్యానని, ప్రభుత్వ ఆస్పత్రులలో డెలివరీ అయ్యేలా ప్రతి గర్భిణీని ప్రోత్సహించాలని కోరారు. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను వినియోగించుకోవాలని, ప్రతీ వైద్యుడు కూడా అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యుల సేవలు మరువలేనివన్నారు. అందరికీ జాతీయ వైద్యుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వైద్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, డాక్టర్ మహేందర్, డాక్టర్ హిమబిందు, డాక్టర్ మంజుల, డాక్టర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సంగెం కళాశాలలో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనం

ఇంటర్ విద్య.. వసతులు మిథ్య...

జూనియర్ కళాశాలల్లో తిష్టవేసిన సమస్యలు

- ఒక్కో కళాశాలలో ఒక్కో సమస్య
- పలుచోట్ల నామమాత్రంగా ల్యాబ్‌లు
- ప్రైవేటు కళాశాలలకు దీటుగా కానరాని వైనం
- ప్రవేశాలు అంతంత మాత్రమే..

4

పదేళ్ల తర్వాత దక్కిన 'అధికారం' పండుగ అవుతుందనుకుంటే, దండగలా మారింది... మా గోడు వినేవారే లేరు... మమ్మల్ని పట్టించుకున్న వారే లేరు.. ఎంత సేపూ మీ గొడవలేనా...? మా పదవుల సంగతి ఏంది? పార్టీ కోసం కష్టపడితే ఇదా ప్రతిఫలం? ఇలాగైతే మా భవిష్యత్తు ఏమిటి...? ఇది కాంగ్రెస్ కేడర్‌లో నెలకొన్న ఆవేదన. ఒకరకంగా ఆగ్రహపూరితమైన నిలదీత. ఓరుగల్లు కాంగ్రెస్‌లో మునుపెన్నడూ లేని పరిస్థితులు నెలకొన్నాయి. సమస్త క్యాడర్ అసంతృప్తితో రగులుతోంది. ఎమ్మెల్యేలు, మంత్రులు మధ్య విభేదాలతో తమకు గుర్తింపు దక్కటం లేదని ఆవేదన చెందుతున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నప్పటికీ నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, కీలక నేతలు దృష్టి పెట్టడం లేదనే అసంతృప్తి ద్వితీయ శ్రేణి నేతల్లో వ్యక్తమవుతోంది. పార్టీ జిల్లా కమిటీలు ఎప్పుడు నియమిస్తారని, మార్కెట్, ఆలయ పాలక మండలితో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు ఎప్పుడు భర్తీ చేస్తారని ద్వితీయ శ్రేణి నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



అధికార 'హస్తం'..

అసంతృప్తే సమస్తం!



- ఎప్పటికీ మీ లొల్లేనా.. మా గురించి పట్టించుకునేది ఎప్పుడని ప్రశ్న
- 'పవర్' దక్కి ఏడాదిన్నర గడిచినా నామినేటెడ్ పదవుల ముచ్చటేది..?
- మార్కెట్, దేవాలయ కమిటీలతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి పదవులపై దాటవేత
- డీసీసీ కార్యవర్గం, అనుబంధ సంఘాల నియామకాలు ఏవీ..?
- పదవులు, ఆధిపత్యం కోసం నేతల లొల్లితో ద్వితీయశ్రేణి నేతల్లో అసహనం
- కమిటీలు, పదవులు లేకుండా పంచాయతీ ఎన్నికలను ఎదుర్కొనేది ఎలా
- ఓరుగల్లు కాంగ్రెస్ క్యాడర్‌లో అంతర్గతంగా రగులుతున్న అసంతృప్తి

ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య విభేదాలపై క్యాడర్‌లో అసంతృప్తి



▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

ఓరుగల్లు కాంగ్రెస్ పార్టీలో సమన్వయం కరువైంది. కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మంత్రులతో పాటు కీలక నేతల మధ్య వర్గ విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ఇటీవల మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి చేసిన వ్యాఖ్యలతో నివురుగప్పిన నిప్పులా ఉన్న అంతర్గత విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరిప్రకాష్ రెడ్డిలపై మురళి చేసిన అనుచిత వ్యాఖ్యలు రాష్ట్ర కాంగ్రెస్‌లో, క్యాడర్‌లో చర్చనీయాంశంగా మారాయి. దీంతో కొండా దంపతులకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు అధిష్ఠానానికి ఫిర్యాదు చయడమే కాకుండా, మురళిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. మరరోవైపు తమపై ఫిర్యాదు చేసిన నేతలపై కొండా మురళి కాంగ్రెస్ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేశారు. తమపై మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

పరస్పర ఫిర్యాదులతో ఓరుగల్లు కాంగ్రెస్‌లో విభేదాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. ఈ నెల 5వ తేదీలోగా ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలని కొండా మురళికి క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మల్లు రవి నోటీసులు ఇవ్వడంతో ఉత్కంఠ నెలకొంది. మరో వైపు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నుంచి అభ్యర్థిని తానే అనేలా కొండా దంపతుల కుమార్తె సుస్మిత పటేల్ ఇన్‌స్టాలో తన ప్రొఫైల్ మార్చుకుంది. ఇప్పటికే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డితో కొండా దంపతులకు విభేదాలు తీవ్రంగా ఉండటంతో సుస్మిత పోస్టు పరకాల కాంగ్రెస్‌లో గ్రూపుల లొల్లికి మరింత ఆజ్యం పోసిందనే చర్చ జరుగుతోంది.

ఇక ములుగు కాంగ్రెస్‌లో ముసలం మంత్రి సీతక్కకు ఇబ్బందిగా మారింది. పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ దందాలు చేస్తూ పార్టీని నాశనం చేయడమే కాకుండా, మంత్రి సీతక్కను తప్పుదారి పట్టిస్తున్నారని, పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని నాగన్న పేరుతో ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేసిన కాపీలను సోమవారం హనుమకొండ కాంగ్రెస్ కార్యాలయంలో మీడియాకు అందించారు. ఇది

(మిగతా 5వ పేజీలో...)

బాలికపై అత్యాచారం..

- యువకుడిపై పోక్సో కేసు

గీసుగొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలో దారుణం జరిగింది. వంచనగిరికి చెందిన కొమ్ముల లిటిల్(22) అనే యువకుడు... ఓ బాలిక(16)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా వున్నాయి... ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉంటున్న లిటిల్.. సోమవారం రాత్రి బాలికకు మాయమాటలు చెప్పి ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లాడు. అనంతరం అత్యాచారానికి పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం ధర్మారం వద్ద బాలికను వదిలి వెళ్లడంతో ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు విషయాన్ని తెలిపింది. బయటికి చెబితే చంపుతానని లిటిల్ బెదిరించినట్లు చెప్పింది. బాలిక ఇటీవల 10వ తరగతి పూర్తి చేసింది. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. జరిగిన ఘటనపై మంగళవారం బాలిక తల్లి గీసుగొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా, తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడు లిటిల్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు.

స్నాతకోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

కేయూ క్యాంపస్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం ఈనెల 7న జరుగనుంది. ఇందుకోసం స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేసి విస్తృత ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి నేతృత్వంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ ఎస్.వాసుదేవ రెడ్డి, వరలక్ష్మి, మెంబర్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌ను నియమించారు. వీరితో పాటు సమన్వయం చేసుకునేందుకు మరో 10 మందితో సబ్ కమిటీలు ఏర్పాటు చేశారు. స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో పాటు ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి హాజరుకానున్నారు.

స్నాతకోత్సవం నేపథ్యంలో పరిపాలన భవనం నుంచి వర్సిటీ ఆడిటోరియం వరకు రోడ్డును శుభ్రం చేస్తున్నారు. గ్రౌండ్‌లో ప్రత్యేక ఆకర్షణతో టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆడిటోరియం లోపల శుభ్రం చేసి డాక్టరేట్ పట్టాలు పొందనున్న అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తున్నారు. ఆర్ట్స్, సోషల్ సైన్స్, లైఫ్‌సైన్స్, ఇంజనీరింగ్, కామర్స్, లా, ఫార్మసీ విభాగాల వారీగా డాక్టరేట్ల కోసం సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. స్నాతకోత్సవంలో బంగారు పతకాలు, డాక్టరేట్ డిగ్రీలు పొందే అభ్యర్థులకు అయా విభాగాల ప్రిన్సిపాల్స్ కార్యాలయాల్లో పాస్‌లను జారీ చేస్తున్నారు డాక్టరేట్ పట్టాల కోసం ఇప్పటి వరకు 387మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరందరికీ కేయూ పరీక్షల నియంత్రణాధికారి కార్యాలయంలో



కేయూ క్యాంపస్‌లో స్నాతకోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం తదితరులు

పాస్‌లు జారీ చేస్తున్నారు.

కేయూ ఆడిటోరియాన్ని ప్రత్యేకంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఆడిటోరియం లోపల, బయట ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆడిటోరియంలో ఏసీతో పాటు విద్యుత్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే విద్యుత్ అందించేందుకు ఇన్వర్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ వస్తున్న దృష్ట్యా ప్రత్యేక సెక్యూరిటీ ఏర్పాట్లను చేస్తున్నారు. స్టేజీ కమిటీ నిర్వహణతో అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు ఏర్పాట్లు చేపట్టా రు. అలాగే కార్యక్రమానికి జిల్లా ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు. జిల్లా కలెక్టర్, సీపీతో పాటు ఇతర విద్యావేత్తలను ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రికలను అందచేస్తున్నారు. ఈ దఫా మాజీ వీసీలు ప్రొఫెసర్ బి.వెంకటరత్నం, విద్యావతి, సాయన్న, వైకుంఠంతో పాటు ఇతర వీసీలకు హైదరాబాద్‌కు వెళ్ళి ఆహ్వాన పత్రాలను అందచేశారు. స్నాతకోత్సవం సందర్భంగా హాస్టల్ విద్యార్థులకు నాన్‌వెజ్ భోజనాన్ని సిద్ధం చేయనున్నారు. అలాగే స్నాతకోత్సవానికి వచ్చే అభ్యర్థులకు, గెస్ట్‌లకు, శాకాహారాన్ని అందిస్తారు. గెస్ట్‌హౌజ్, స్పోర్ట్స్ బోర్డుతో పాటు అడ్మిషన్ల డైరెక్టరేట్ కార్యాలయంలో భోజనాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

- ఈ నెల 7న ఆడిటోరియంలో నిర్వహణ
- అతిథులుగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి
- ఏర్పాట్లలో నిమగ్నమైన నిర్వహణ కమిటీలు
- క్యాంపస్‌ను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు

బెల్టుతో ఉరేసి.. కత్తితో పొడిచి..

- బంగారం కోసమే నవీన్‌కుమార్ హత్య
- నిందితుడు ప్రవీణ్ సహా మహిళ అరెస్టు

5

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వద్దు

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- నగరంలో పలు చోట్ల ఆకస్మిక తనిఖీలు
- రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించాలని ఆదేశం



వడ్డెపల్లి బండ్‌ను సందర్శిస్తున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని జిడబ్ల్యుఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హనుమకొండ పరిధిలోని 7, 8, 31 డివిజన్‌లలో అక్కడి శానిటేషన్ సిబ్బందితో కలిసి సందర్శించారు. అంతే కాకుండా వడ్డెపల్లి బండ్, స్మార్ట్‌సిటీ పనులు, ప్రశాంత్‌నగర్‌లోని 15 ఎంఎల్‌డీ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించారు. అక్కడి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డీ సిల్టేషన్ ప్రక్రియ నిరంతరం జరగాలని అన్నారు. శానిటేషన్ సిబ్బంది ప్రతీ రోజు నాలుగు సార్లు బయోమెట్రిక్ ద్వారా హాజరు వేయాలని, విస్మరించిన వారిపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. హనుమకొండ చౌరస్తా రావిచెట్టు వద్ద ఉన్న టీస్టాల్ ప్రాంతం అపరిశుభ్రంగా ఖాళీ కప్పులతో కనిపించడంతో సదరు యజమానికి రూ. 10 వేల జరిమానా విధించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం వడ్డెపల్లి బండ్‌కు వెళ్లి అక్కడి పరిసరాలను పరిశీలించారు. బండ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రశాంత్‌నగర్‌లోని సివరేజ్ ప్లాంట్, నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌వో రమేష్, ఈఈ రవికుమార్, డీఈ కార్తీక్‌రెడ్డి, ఏఈ మేనక, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోలెపాక అనిల్‌కుమార్‌తో పాటు స్మార్ట్ సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



7న జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ సమావేశం

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ మూడు మాసాలకు ఒక సారి నిర్వహించే గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కౌన్సిల్ సమావేశం ఈ నెల 7న నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి సెక్రెటరీ, అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేయర్ సుధారాణి ఆదేశాల మేరకు ఉదయం 11.30 గంటలకు వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. నగరంలో జరిగే అభివృద్ధి పనుల ఎజెండా అంశాలపై ప్రతిపాదనలు, ఆమోదం జరుగుతుందని 66 డివిజన్‌ల కార్పొరేటర్లు, మంత్రి, ఎమ్మెల్యేలు, ఎక్స్ అఫిషియో మెంబర్లు ఎజెండా అంశాలతో హాజరు కావాలని కోరారు.

మంత్రి సురేఖ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

రాష్ట్ర ఎన్నికల అధికారికి నన్నపునేని ఫిర్యాదు



రాష్ట్ర ఎన్నికల ఉప ప్రధాన అధికారికి ఫిర్యాదు ఇస్తున్న నరేందర్

మట్టెవాడ జూలై 1, (ఆంధ్రజ్యోతి): గత శాసనసభ ఎన్నికల్లో రూ.70 కోట్లు ఖర్చు చేశామని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు చేసిన వ్యాఖ్యలపై వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ఎన్నికల ఉప ప్రధాన అధికారి డి. హరిసింగ్ కు ఫిర్యాదు చేశారు. వరంగల్ తూర్పు శాసన సభ్యురాలు కొండా సురేఖ సభత్వాన్ని రద్దు చేసి అనర్హులిగా ప్రకటించాలని అందులో పేర్కొన్నారు. ఈసందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ భర్త 2023 శాసనసభ ఎన్నికల్లో రూ. 70 కోట్లు ఖర్చు చేశామని చెప్పినందున విచారణ చేపట్టి తక్షణమే కొండా సురేఖ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ లీగల్ కన్వీనర్ భరత్‌కుమార్, రాకేశ్ పాల్గొన్నారు.

మహిళను వివస్త్ర చేసిన నిందితుల రిమాండ్

రెండు కార్లు, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసిన పోలీసులు

ధర్మసాగర్ , జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో మహిళను వివస్త్రను చేసి చిత్రహింసలకు గురిచేసిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు సీఐ ప్రవీణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. బాధిత మహిళ భర్త చిక్కుడు నాగరాజు ఫిర్యాదు మేరకు 12 మంది నిందితులపై, సహకరించిన మరో 11 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి రెండు కార్లు, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు తాటికాయల గ్రామానికి చెందిన చిక్కుడు గంగ, ఉస్తెమ్ రమేష్, యాకయ్య, స్వామి, వేణు, దేవమ్మ, రజిత, శ్రావణి, సంతోష, స్వరూప, తిరుపతి, రెడ్డబోయిన పార్వతమ్మ, దాడికి సహకరించిన వారు బొల్ల రాజు, చిక్కుడు దేవేందర్, ప్రభాకర్, దూబల రాజయ్య, మామిడాల వెంకటేశ్వర్లు, పెసరు రాములు, చిక్కుడు సాంబరాజు, రాజపోశాలు, ఉస్తెమ్ పోశాలు, పెసరు రమేష్, బత్తిని రాజేష్ తదితరులను రిమాండ్‌కు తరలించారు.

అంతర్జాతీయ సదస్సుకు కేయూ అధికారి సుజాత

కేయూ క్యాంపస్ జూలై 1, (ఆంధ్రజ్యోతి) :కేయూ కో ఎడ్యుకేషన్ కళాశాల లైబ్రరీ అధికారి డాక్టర్ సూరారపు సుజాత అంతర్జాతీయ సదస్సుకు ఎంపికయ్యారు. జూన్ 26 నుంచి 10 రోజుల పాటు శ్రీలంకలోని పెరదేనియా సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన అంతర్జాతీయ సదస్సుకు హాజరైయ్యారు. శ్రీలంక లైబ్రరీ అసోసియేషన్, యూనివర్సిటీ ఆఫ్ పెరదేనియా సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో లైబ్రరీస్ యజ్ పిల్లర్స్ ఆఫ్ సస్టైనబుల్ సోషియో-కల్చరల్ కాపిటల్ అనే అంశంపై జరిగిన సదస్సుకు డాక్టర్ సుజాత అధ్యక్షత వహించారు. అలాగే తోపుడుబండి అండ్ ఇట్స్ సర్వీస్ ఇన్ తెలంగాణ, ఇండియా అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంతర్జాతీయ సదస్సులో సుజాత సమర్పించిన పరిశోధన పత్రం అత్యుత్తమైనదిగా ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా సుజాతన వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు సోమవారం కేయూ అభినందనలు తెలిపారు.

ఇంటర్ విద్య.. వసతులు మిథ్య

జూనియర్ కళాశాలల్లో తిష్ఠ వేసిన సమస్యలు

ఒక్కో కళాశాలలో ఒక్కో సమస్య..

ప్రవేశాలు అంతంతమాత్రమే..

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉన్నాయి. వరంగల్ జిల్లాలోని దాదాపు అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల సమస్య వెంటాడుతోంటే, హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మౌలిక వసతుల కొరతతో తండ్లాడుతున్నాయి.

తిష్ఠ వేసిన సమస్యలు

వరంగల్‌లో 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలు ఉండగా, హనుమకొండలో 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అయితే ఇవన్నీ ఏదో ఒక సమస్యతో సతమతం అవుతూనే ఉన్నాయి. కొన్ని కళాశాలల భవనాలు శిథిలావస్థకు చేరగా, మరికొన్ని కళాశాలలకు సరిపడా తరగతులు లేవు. ఇంకొన్ని కళాశాలలకు భవనాలు లేక పాఠశాలల భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వరంగల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల సమస్యల తాండవిస్తుంటే హనుమకొండలోని కొన్ని కళాశాలల్లో ల్యాబ్‌లకు ప్రత్యేకంగా గదులు లేకపోవడంతో తరగతి గదులతోనే నెట్టుకొస్తున్నారు. రెండు జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లైబ్రరీల ఏర్పాటు సరిగా లేవు.

వరంగల్ జిల్లాలో ఇలా..

వరంగల్ జిల్లాలో మొత్తం 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా జిల్లా కేంద్రంలోని ఖిలావరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిస్థితి దయనీయంగా ఉంది. అక్కడున్న ప్రభుత్వ పాఠశాలలోని రెండు గదుల్లోనే జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నారు.



పరకాలలో నిర్మాణ దశలో ఉన్న కళాశాల భవనం

విద్యార్థులకు మౌలిక వసతులు ఇక్కడ మృగ్యంగానే ఉన్నాయి. రంగాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్‌లకు ప్రత్యేకమైన గదులు లేకపోవడంతో తరగతి గదులనే తాత్కాలిక ల్యాబ్‌లను వినియోగించుకుంటున్నారు. బాల, బాలికల మూత్రశాలలు, మరుగుదొడ్లు శిథిలావస్థలో ఉన్నాయి. డిగ్రీ కళాశాలకు ప్రత్యేక భవనం లేకపోవడంతో ఇక్కడ షిఫ్ట్ పద్ధతిలో ఉదయం పూట జూనియర్ కాలేజ్, మధ్యాహ్నం పూట డిగ్రీ కళాశాల తరగతులు నిర్వ హిస్తున్నారు.

కృష్ణకాలనీలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. సంగెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయి. కళాశాల ప్రాంగణంలో పాత భవనం శిథిలావస్థలో ప్రమాదరకరంగా ఉంది. కళాశాల ఆవరణలో గడ్డి, నీరు నిలిచి ఉండటంతో విషపురుగులు సంచరించే ప్రమాదం పొంచి ఉంది. నర్సంపేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేవు. బాలికల జూనియర్ కళాశాలలో భవనం ఉన్నప్పటికీ వర్షానికి కురుస్తుంది. వర్ధన్నపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. రాయ పర్తి, నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ మూత్రశాలలు, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయి. ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేదు.



నెక్కొండ కళాశాలలో నిరుపయోగంగా మారిన శిథిల మూత్రశాలలు, మరుగుదొడ్లు

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండలో మొత్తం 9 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని పింగిళి మహిళా జూనియర్ కళాశాల ఆవరణ చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. మూత్రశాలలు, మరుగుదొడ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోగా నూతన భవ నాలు నిర్మాణమవుతున్నాయి. హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఐపీఎస్ అధికారి రూపేష్ దత్తత తీసుకొని మౌలిక వస తులు ఏర్పాటు చేస్తున్నారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోగా కొత్తగా భవనాలు నిర్మాణం అవుతు న్నాయి. ధర్మసాగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ లేదు.

ప్రవేశాలు అంతంతే..

ప్రైవేటు జూనియర్ కళాశాలలు, అకాడమీలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ప్రైవేటు, కార్పొరేట్, అకాడమీల దెబ్బకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యార్థులు లేక కొట్టుమిట్టాడుతున్నాయి. అరకొర వసతులతో, అల్పసంఖ్యాక విద్యార్థులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్య మృగ్యంగానే మారుతోంది.

అంకితభావంతో విద్యాబోధన చేయాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్
- ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- కస్తూర్బా గురుకుల పాఠశాల్లో విద్యార్థులతో కలసి భోజనం

ఆత్మకూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్య బోధన చేయాలని ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు స్నేహశబరీష్ అన్నారు. ఆత్మకూరు మండలం అక్కంపేటలోని ప్రభుత్వ పాఠశాలలను, అంగన్‌వాడీ సెంటర్లను మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి విద్యార్థులను ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలను గూర్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠ్యపుస్తకాలను, యూనిఫామ్స్ ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని, వంటశాలను పరిశీలించారు. జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. జిల్లా పరిషత్ పాఠశాలకు సంబంధించిన భవనం గురించి ఆరా తీసిన కలెక్టరు ప్రాథమిక పాఠశాలకు ఆ పాఠశాల భవనాన్ని ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల సంఖ్య పెంచే పూర్తి బాధ్యత ఉపాధ్యాయులు తీసుకొని విద్యార్థుల సంఖ్యను పెంచాలని, తాను మళ్లీ వస్తానని కలెక్టర్ అన్నారు. స్థానికులు ఆయ కాలనీకి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టరుకు మొరపెట్టుకున్నారు. వెంటనే పంచాయతీ కార్యదర్శిని పిలిచి రోడ్డుకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి రికార్డులను తనిఖీలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్నభోజనం అందించాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల పట్ల శ్రద్ధను తీసుకోవాలన్నారు. కేస్ స్టడీని నమోదు చేయాలన్నారు.

అనంతరం మండలం తిరుమలగిరిలోని ఇందిరమ్మ గృహాలను పరిశీలించారు. లబ్ధిదారులు వేగవంతంగా నిర్మాణం చేసుకుంటే వెంటనే బిల్లులు చెల్లిస్తామని కలెక్టర్ అన్నారు. అలాగే కస్తూర్బా గురుకుల పాఠశాలను తనిఖీలు చేసి విద్యార్థులను విద్య బోధన గూర్చి అడిగి తెలుసుకున్నారు. వంటశాలను, స్టోర్‌రూంను పరిశీలించి ప్రిన్సిపాల్ వాసంతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ చేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో విజయ్‌కుమార్, ఏపీవో లలితాదేవితో పాటు పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బా గురుకుల పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహశబరీష్

ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అధికారులు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించినప్పుడే నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను పట్టుకోవడం సులువు అవుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. జూన్ నెలకు సంబంధించిన నెలవారీ నేరసమీక్షలో భాగంగా మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్ జోన్ అధికారులతో సీపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు అర్బన్, మునిసిపల్, గ్రామీణ స్థాయిలో ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలని, విలేజ్ పోలీస్ ఆఫీసర్ నిర్వహించే పెట్రోలింగ్ విధులపై స్టేషన్ అధికారులు ముందుగానే దిశా నిర్దేశం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై సంబంధిత ప్రభుత్వ అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతను స్టేషన్ అధికారులు పునరావాస కేంద్రాల్లో చేర్పి చికిత్స అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై తప్పనిసరిగా కేసులను నమోదు చేయాలని, ప్రధానంగా ప్రజావాణి నుంచి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, వరంగల్, జనగాం ఏఎస్పీలు శుభం ప్రకాశ్, చేతన్, అదనపు డీసీపీలు బోనాల కిషన్, రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్స్‌పెక్టర్స్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీపీ

విప్రచిత్త, మహా వజ్రేశ్వరిగా..

శాకంబరీ వేడుకల్లో భద్రకాళి అవతారాలు

వరంగల్ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళి దేవస్థానంలో కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు మంగళవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. వేడుకల్లో భాగంగా ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. ఇచ్ఛాశక్తి కాళీ క్రమాన్ని అనుసరించి అమ్మవారిని విప్రచిత్తగాను.. శోడషీ క్రమాన్ని అనుసరించి ఉత్సవమూర్తిని మహా వజ్రేశ్వరిగాను అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పాటు చేశారు. విప్రచిత్త అమ్మవారిని ఆరాధిస్తే తత్వ జ్ఞానంతో కూడిన అనుగ్రహం కలుగుతుందని, మహా వజ్రేశ్వరి మాతను ఆరాధిస్తే మనిషిలో వజ్ర సంకల్పం ఏర్పడుతుందని, తన పనిలో కృతకృత్యుడు అవుతాడని అర్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. కార్యక్రమంలో ఈవో శేషు భారతి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును సన్మానిస్తున్న డీసీసీ బ్యాంకు ఉద్యోగులు

మార్నేనికి బ్యాంకు ఉద్యోగుల కృతజ్ఞతలు

హనుమకొండ సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల వేతన సవరణ నేపథ్యంలో డీసీసీ బ్యాంక్, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుకు బ్యాంకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం నక్కలగుట్టలోని ప్రధాన కార్యాలయంలో ఆయనను కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మార్నేని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల సమస్యల పట్ల అవగాహన కలిగి పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ వేతన సవరణ చేపట్టడంపై ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఈవో వజీర్ సుల్తాన్, టీసీసీబీఈఏ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణ మోహన్, జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షురాలు రజిత, జీయంలు ఉషాశ్రీ, పద్మావతి, డీజీయం అశోక్, ఏజీయంలు స్రవంతి, మధు, రాజు, గంప స్రవంతి తదితర బ్యాంకు ఉద్యోగులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాలు

- తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు
- మహబూబాబాద్‌లో అత్యధికంగా 60 మిమీ వర్షం

హనుమకొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మంగళవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. పగలు వాతావరణం మేఘావృతమై ఉండి.. రాత్రంతా వర్షాలు కురుస్తున్నాయి. మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా 60 మిమీ వర్షపాతం నమోదైంది. కొత్తగూడ మినహా జిల్లాలోని అన్ని మండలాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బయ్యారం మండలంలో భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లాలో కూడా వర్షం విస్తృతంగానే పడింది. 42.8 మిమ వర్షపాతం నమోదైంది. రఘునాథపల్లి, చిల్పూరు మినహా జిల్లాలోని మిగతా అన్ని మండలాల్లో భారీగానే వర్షం కురిసింది. జనగామ మండలంలో అత్యధికంగా పడింది. వరంగల్ జిల్లాలో 23.5 మిమీ వర్షం కురిసింది.

వర్ధన్నపేట, రాయపర్తి, పర్వతగిరి, నెక్కొండ, చెన్నారావుపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. హనుమకొండ జిల్లాలో 28.9 మిమీ వర్షపాతం నమోదైంది. కమలాపూర్, ఐనవోలు, ఆత్మకూరు, మండలాల్లో వర్షం కురిసింది. ములుగు జిల్లా మల్లంపల్లిలో 18.8 మిమీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 15.2 మిమీ వర్షం కురిసింది సాయంత్రం 6 గంటల నుంచి వరంగల్ నగరంలో జోరుగా వర్షం పడడం మొదలైంది. లోతట్టు ప్రాంతాల జలమయ మయ్యాయి. ఉమ్మడి జిల్లాలో మరో నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళ, బుధవారాల్లో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. 3,4 తేదీల్లో వర్ష తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.



హనుమకొండ విద్యుత్‌భవన్ ఎదుట రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మద్యం మత్తులో యువకుల ఘర్షణ

కాజీపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట మంగళవారం మద్యం మత్తులో గంజాయి బ్యాచ్ గొడవపడ్డారు. రెండు గ్రూపులుగా విడిపోయి ఘర్షణకు పాల్పడ్డారు. రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ తతంగమంతా గంట సేపు జరిగింది. ఈ ఘటన జరుగుతున్న సమయంలో రైల్వే ప్రయాణికులు, బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికులు తీవ్ర భయభ్రాంతుకుల గురయ్యారు. గంట సేపు రైల్వేస్టేషన్ సమీపంలో హల్‌చల్ సృష్టించారు. తర్వాత తిరిగి రైల్వేస్టేషన్‌లోకి వెళ్లారు. గంజాయి సేవించే వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విశ్వకర్మల అభివృద్ధికి కృషి

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్

వరంగల్ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ జాతీయుల అభివృద్ధి కోసం పాటుపడుతానని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ అన్నారు. విశ్వకర్మల కుటీర పరిశ్రమలకు 10 హెచ్‌పీ మోటారు నుంచి 25 హెచ్‌పీ లోడ్ వరకు విద్యుత్ సబ్సిడీని ప్రభుత్వం పెంచినందుకు విశ్వకర్మ పరిషత్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. మంగళవారం కీర్తి గార్డెన్‌లో జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాష్ మాట్లాడుతూ.. అటవీ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి విశ్వకర్మలపై ఎలాంటి దాడులు జరుగకుండా ప్రభుత్వంతో మాట్లాడుతానని అన్నారు. విశ్వకర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు పున్నమాచారి మాట్లాడుతూ.. కుల వృత్తుల సమగ్ర సర్వే చేసి వృత్తిపై ఆధారపడిన వారికి రాయితీ కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శివపెల్లి రాజేశం, వీఆర్.విద్యార్థి, వేణుగోపాల్, బిట్ల చక్రపాణి, రామోజు జగన్నాథాచారి, శ్రీరాముల వేణుగోపాల్, దరువు అంజన్న, అబ్బోజు వీరాచారి, ఆకుతోట శ్రీనివాస్, మడుపోజు రాంమూర్తి, మడుపోజు జగదీశ్వర్, గురుమూర్తి, కాసోజు వెంకటాచారి పాల్గొన్నారు.



బండా ప్రకాష్‌ను సన్మానిస్తున్న విశ్వకర్మ సభ్యులు

వైద్యులే అసలైన యోధులు

శంభునిపేట (వరంగల్): వైద్యులే సమాజంలో అసలైన యోధులు అని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. యునైటెడ్ నేషన్స్ రీసోర్స్ సెంటర్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ ఆధ్వర్యంలో మంగళవాం శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రకాశ్ పాల్గొని మాట్లాడారు. కరోనా మహమ్మారి సమయంలో వైద్యులు ప్రదర్శించిన సేవాభావం యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు

ఈ వైద్య దినోత్సవం సందర్భంగా కార్డియాలజిస్ట్ డాక్టర్ రామక శ్రీనివాస్, ఎంజీఎం మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్, డాక్టర్ సాంబమూర్తి, చంద్రశేఖర్ ఆర్యా, డాక్టర్ కొణతం కృష్ణతో పాటు పలువురు వైద్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శారదాబాయి, రాజగోవింద్, మండల పరుశరాములు, రావుల బాలరాజు, వడ్నాల నరేందర్, డాక్టర్ అభిలాష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నారాయణపురంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న రైతులు

నారాయణపురంలో మళ్లీ రైతులు దీక్షలు

పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్

కేసముద్రం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలం నారాయణపురంలో ఎంజాయ్‌మెంట్ సర్వే ఆధారంగా పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలనే డిమాండ్‌తో ఆ గ్రామ రైతులు మంగళవారం రిలే నిరాహా దీక్షలు ప్రారంభించారు. గ్రామ బొడ్రాయి వద్ద టెంటు వేసి దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు బాధిత మాట్లాడుతూ తాము 60 ఏళ్లగా సాగు చేసుకుంటున్న భూములను 2017 భూ ప్రక్షాళనలో గ్రామంలోని 1,827 ఎకరాలను అటవీశాఖ భూములుగా పేర్కొంటూ పట్టాలన్నీ రద్దు చేసిందని తెలిపారు. అప్పటి నుంచి పలుమార్లు ఆందోళనల ఫలితంగా కొంతమందికి 1,398 ఎకరాలకు రైతు, తండ్రిపేరు 'అడవి'గా పేర్కొంటూ ధరణిలో నమోదు చేశారని తెలిపారు. ఆ తర్వాత సచివాలయం ముట్టడి చేయగా జీవో నెంబరు 94ను జారీ చేసి రైతు, తండ్రిపేరు 'అడవి'ని తొలగించారని చెప్పారు.

2022లో 145 మంది రైతుల దరఖాస్తులు మిస్సింగ్ సర్వే నెంబర్ విభాగంలో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ రైతులకు పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు జారీ చేయడం లేదని తెలిపారు. అలాగే వెయ్యి ఎకరాల్లో సుమారు 700 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు రావాల్సిఉందని తెలిపారు. ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో తమకు పట్టాలు రావడంలేదని ఆరోపించారు. ఇప్పటికే తాము ఏడేళ్లగా రైతుబంధు, రైతుభరోసా, రైతుబీమా, రుణమాఫీ పథకాల్లో కోట్ల రూపాయలను నష్టపోయామని తెలిపారు. ఇప్పటికైనా తమకు ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రకారం పట్టాదారు పాస్‌పుస్తకాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి, మాజీ సర్పంచ్ పి.లక్ష్మీపతి, నర్సింహారెడ్డి, అమరేందర్‌రెడ్డి, చుక్కారెడ్డి, వెంకట్‌రెడ్డి, భీమ, సురేందర్, దేవ, వీరన్న, శంకర్, హేమ్లా, రమేష్, సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోరింట పూసింది..



ఆషాడ మాసం గోరింటాకు ప్రత్యేకం

- చేతులకు, కాళ్లకు పెట్టుకుంటే చర్మ వ్యాధులు దూరం
- సౌభాగ్యానికి, శ్రేయస్సుకు సంకేతమని మహిళల నమ్మకం

వెంకటాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆధ్యాత్మికతతో పాటు ఆనందం పంచే మాసం ఆషాడం. ఈ మాసంలో లభించే గోరింటాకు అంటే మహిళలు ఎంతో మక్కువ చూపుతారు. గోరింటాకు పెట్టుకోవడం వెనుక పలు శాస్త్రీయ ప్రయోజనాలు కూడా ఉన్నాయి. వర్షకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మ వ్యాధుల నుంచి రక్షణ పొందొచ్చనే అభిప్రాయం ఉంది. గోరింటాకు మందారంలా పండితే మంచి భర్త దొరుకుతుతాడని, అదే వివాహితలైతే వారి కడుపు పండుతుందని, కాపురం చక్కగా ఉంటుందని పెద్దవాళ్లు అంటుంటారు.. ఈ నమ్మకాలు ఎలా వున్నా గోరింటాకును శుభానికి చిహ్నంగా భావిస్తారు. గోరింటాకుతో ఎర్రగా పండిన చేతులను భర్తకు చూపిస్తూ మహిళలు మురిసిపోతుంటారు. గ్రామాల్లో సాముహికంగా మహిళలు ఒకచోట చేరి గోరింటాకు సేకరిస్తారు. సంప్రదాయ పద్ధతిలో రోలులో గోరింటాకును నూరుతారు. అంతా ఒకచోట చేరి పాటలు పాడుతూ ఒకరికొకరు పెట్టుకుంటారు.

గోరింటాకుతో ప్రయోజనాలు ఇలా...

- చర్మ వ్యాధుల నుంచి రక్షణ
- ఒంట్లోని వేడిని తగ్గిస్తుంది.
- రోగ నిరోధకశక్తిని పెంచుతుంది.
- రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది.
- గోళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది.

గోరింటాకు దోషాలను నివారిస్తుంది..

గోరింటాకును శుభకార్యాలు, పండుగలప్పుడు పెట్టుకోవడం ఆనవాయితీ. కొన్ని సంప్రదాయాల ప్రకారం గోరింటాకు గర్భాశయ దోషాలను తొలగిస్తుందని, స్త్రీ ఆరోగ్యాన్ని కాపాడుతుందని నమ్ముతారు. ఆయుర్వేదంలో గోరింటాకు వేర్లు, బెరడు, ఆకులు, పూలు, విత్తనాలు అన్నీ ఔషధగుణాలు కలిగి ఉన్నాయని చెబుతారు. ఆషాడంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ద్వారా సౌభాగ్యాన్ని పొందినవారవుతారని అంటున్నారు.





గోరింటాకు సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది

ఆషాడంలో కొత్త పెళ్లి కూతుళ్లు తమ పుట్టింటికి చెరుకోవడం ఆనవాయితీ. ఆ సమయంలో తమ చేతులకు పండించుకునే గోరింటాకు వారికి తమ సౌభాగ్యాన్ని గుర్తు చేస్తుంది. పుట్టింట ఉన్న మనస్సు మెట్టినింట ఉన్న భర్త ఆరోగ్యాన్ని కాంక్షిస్తుంది. వేళ్లకు గోరింట పెట్టుకోవడం వల్ల కంటికి నదురుగానే కాకుండా గోళ్లు పెళుసుబారిపోకుండా, గోరుచుట్టు వ్యాధులు రాకుండా ఉంటాయి.

- లాటి విజయలక్ష్మి, వెంకటాపూర్



గోరింటాకు పెట్టుకోవడం మంచిది

గోరింటాకు పెట్టుకోవడంతో అంటు రోగాలు దరికి చేరవు. గోరింటాకు శరిరాన్ని చల్లబరుస్తుంది. జ్వరం, తలనొప్పి తగ్గిస్తుంది. రుతువు మారడంతో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి మేలు.

- డాక్టర్ రిషిత, వెంకటాపూర్ పీహెచ్‌సీ

టాబ్లెట్లను కరిగించి ఒంట్లోకి ఇంజక్షన్

- మత్తుకోసం యువకుల అడ్డదారులు
- ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్న వైనం

వరంగల్ క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : నొప్పి నివారణ టాబ్లెట్స్‌ను సిరంజీల ద్వారా ఒంట్లోకి ఎక్కించుకుని మత్తులో తేలుతున్నారు కొందరు యువకులు. వరంగల్‌లోని రంగశాయిపేటలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆపరేషన్, ఇతర సమయాల్లో నొప్పుల నయం కోసం వినియోగించే టైడల్ మందులను కొంత మంది యువత నీటిలో కరగదీసి సిరంజీలతో ఒంట్లోకి ఎక్కించుకొని మత్తులో తేలుతున్నారు. పక్కా సమాచారం మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ టీం మంగళవారం రంగశాయిపేటలోని ఆయుష్ ఫార్మసీలో స్థానిక డ్రగ్ అధికారి కిరణ్‌తో కలిసి సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా కొందరు యువకులను అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో రంగశాయిపేటలోని ఆయుష్ ఫార్మసీలో కొనుగోలు చేశామని చెప్పగా సదరు ఫార్మసీలో తనిఖీలు చేయగా ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా 24 గంటలో 40 టైడల్ టాబ్లెట్స్‌ను అధిక రేట్లకు విక్రయించినట్లుగా తేలింది. షాపు నిర్వాహకుడితో పాటు సీజ్ చేసిన టాబ్లెట్స్‌ను డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించినట్టు తెలిపారు. ఈ సోదాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం పోలీస్ అధికారులు ఆర్ఐ శివకేశవులు, ఆర్ఎస్సై మనోజ్, పూర్ణ, నాగరాజు పాల్గొన్నారు.



ప్లకార్డులతో అక్షర చిట్ ఫండ్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

'అక్షర' చిట్‌ఫండ్స్ నుంచి డబ్బులు ఇప్పించండి..

- ప్రధాన కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన
- పోలీసుల వైఖరిపై నిరసన

హనుమకొండ టౌన్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ బాలసముద్రంలోని అక్షర చిట్‌ఫండ్స్ యాజమాన్యం నుంచి డబ్బులు ఇప్పిస్తామని పోలీసులు మాట ఇచ్చి పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నక్కలగుట్టలోని చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న సుబేదారి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. గతంలో ఆందోళన చేపట్టిన సమయంలో పోలీసులు చిట్‌ఫండ్ యజమాని నుంచి డబ్బులు ఇప్పిస్తామని మాట ఇచ్చారని తెలిపారు. ఇచ్చినమాట ప్రకారం డబ్బులుఎందుకు ఇప్పించడం లేదని ఖమ్మంకు చెందిన పీవీ రామకృష్ణ, హైదరాబాద్‌కు చెందిన పెండ్యాల ప్రవీణ్‌కుమార్, ఎస్.వెంకటేశ్వర్లు నిలదీశారు. 2021నుంచి బాధితులకు చిట్‌ఫండ్ యాజమాన్యం డబ్బులు ఇవ్వడం లేదని, పలుమార్లు కార్యాలయాల చుట్టు తిరిగినా న్యాయం జరగడం లేదని తెలిపారు. గత ఏడాది నవంబరులో అప్పటి ఏసీపీ దేవేందర్‌రెడ్డి యాజమాన్యం నుంచి డబ్బులు ఇప్పిస్తామని, నెలరోజులకు సమయం ఇవ్వాలని కోరినట్లు బాధితులు తెలిపారు. ఇప్పటివరకు డబ్బులు ఇప్పించలేదని, పైగా పోలీసులు చిట్‌ఫండ్ యజమానికి వంతపడుతున్నారనే అనుమానం కలుగుతున్నదని బాధితులు ఆరోపించారు. ఈ సందరంగా కొంతమంది బాధితులు కార్యాలయ షెట్టర్‌లను ధ్వంసం చేసే ప్రయత్నం చేయగా సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. కొద్దిసేపు పోలీసులకు బాధితులకుమధ్య తోపులాట జరిగింది. మూడుగంటల పాటు ఆందోళన చేసిన అనంతరం ఏసీపీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఫిర్యాదు చేశారు.

డుమ్మా ఉద్యోగుల ఆటలు సాగవు..

- జీడబ్ల్యూఎంసీలో హాజరు విధానంలో మార్పులు
- మరో వారం రోజుల్లో ఫేస్ ఐడీతో కొత్త సాఫ్ట్‌వేర్
- లోపాలకు చెక్ పెట్టేందుకు కొత్త కమిషనర్ చర్యలు



గ్రేటర్ కార్యాలయంలో పని చేయని బయోమెట్రిక్ మిషన్

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చహత్ బాజ్‌పాయ్ కొద్ది రోజుల్లోనే ప్రక్షాళన ప్రారంభించారు. గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో చాలా మంది సిబ్బంది ఉదయం, సాయంత్రం కార్యాలయాలకు వచ్చి బయోమెట్రిక్ హాజరు వేసి విధులకు డుమ్మా కొట్టి వ్యక్తిగత పనులపై దృష్టి సారిస్తున్నట్టు గుర్తించి బయోమెట్రిక్ హాజరు నిలిపి వేశారు. దీంతో మంగ ళవారం ఉదయం నుంచి గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంతో పాటు కాజీపేట, నక్కలగుట్ట, కాశిబుగ్గ, పబ్లిక్‌గార్డెన్ ప్రాంతాలతో పాటు ఫీల్డ్‌లో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్ల వద్ద ఉన్న బయోమెట్రిక్ మిషన్‌లు పని చేయలేదు. దీంతో కార్యాలయానికి వచ్చిన సిబ్బంది ఒక్క సారిగా అవాక్కై సంబం ధిత అధికారి వద్ద మ్యాన్‌వల్ హాజరు వేసుకున్నట్టు తెలిపారు. బయోమెట్రిక్ మిషన్ ద్వారా లోపాలు జరుగుతున్నాయని కమిషనర్ గుర్తించి కొత్త పద్ధ తికి శ్రీకారం చుట్టినట్టు సిబ్బంది తెలుసుకుని రిలాక్స్ అయ్యారు.

కొత్త సాఫ్ట్‌వేర్.. కొత్త మిషన్లు..

నగర పాలక సంస్థలో ప్రభుత్వ, ప్రైవేటు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నట్టు హాజరు ధృవపరిచే మిషన్లు 9 సంవత్సరాల క్రి తం హైదరాబాద్‌లో ఓ సంస్థ నుంచి 120 మిషన్లు కొనుగోలు చేశారు. ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ అప్పటి నుంచి ఇప్పటి వరకు కాంట్రాక్ట్ తీసుకుని బయోమెట్రిక్ మిషన్ల పనితీరు. మరమ్మతులు చేస్తున్నాడు. ఇటీవల అతడి కాంట్రాక్టు ముగియడం కొత్త కమిషనర్ రావడం అడ్డదారి ఉద్యోగుల అస్థిత్వానికి అడ్డంకిగా మారింది. రెండు రోజుల క్రితం కొత్త సాఫ్ట్‌వేర్‌తో కూడిన కొత్త మిషన్లు కొనుగోలు చేయాలని కమిషనర్ ఐటీ సెక్షన్ అధికారులను ఆదేశిం చడంతో మంగళవారం నుంచి బయోమెట్రిక్ హాజరు నిలిపి వేసినట్టు తెలిపారు. దీంతో సర్వర్ డౌన్ అని వచ్చిందని తెలిపారు. కాగా, మరో వారం రోజుల పాటు మ్యాన్యూవల్ హాజరు తీసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. కాగా, కొత్తమిషన్‌లు వారంలో కొనుగోలు చేసి ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ఔట్‌సోర్సింట్ సిబ్బంది, కార్మికుల గుర్తింపును ముఖం, ఐరిస్‌తో ఫీడ్ చేసి హాజరు నిర్వహణ జరుగుతుందని ఐటీ అధికారులు వెల్లడించారు. వారం రోజుల పాటు మ్యాన్‌వల్ హాజరు తీసుకోవడం జరుగుతుందన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టించొద్దు..

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అనురాధ

నెక్కొండ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అనురాధ తెలిపారు. మంగళవారం నెక్కొండలోని ఎరువుల విక్రయ షాపులను తనిఖీ చేశారు. అనంతరం సొసైటీ గోదాముల వద్ద రైతులతో మాట్లాడారు. జిల్లాలో యూరియా కొరత లేదని చెప్పారు. రైతులు పంటల దశను అనుసరించి అవసరమైన యూరియా మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుతం ఖరీఫ్‌కు సంబంధించి వరి, పత్తి, మొక్కజొన్న సాగుకు సరిపడా యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని వివరించారు. అధిక యూరియా వాడడం వల్ల ఆర్థికంగా నష్టం జరగడమే కాకుండా పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరిగి దిగుబడులు తగ్గుతాయన్నారు. నానో యూరియా, నానో డీఏపీల వాడకంతో ఆశించిన దిగుబడి పొందవచ్చన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందులను విక్రయించి తప్పకుండా బిల్లులను ఇవ్వాలని షాపుల యజమానులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో నాగరాజు, సొసైటీ సీఈవో మోడం సురేష్, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఏవో అనురాధ

బెల్టుతో ఉరేసి.. కత్తితో పొడిచి..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్ రెడ్డి

- బంగారం కోసమే నవీన్‌కుమార్ హత్య
- నిందితుడు ప్రవీణ్ సహా సహకరించిన మహిళ అరెస్టు

కాజీపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కాజీపేటలో ఇటీవల వడ్డీ వ్యాపారి నవీన్‌కుమార్ హత్య జరిగిన విషయం తెలిసిందే. నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేసి మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. నవీన్ కుమార్ హత్య బంగారం కోసమే జరిగిందని పోలీసులు నిర్ధారించారు. వడ్డీ డబ్బుల ఇవ్వాలని నవీన్ చేసిన ఒత్తిడి ఓ వైపైతే.. అతడి ఒంటిపై ఉన్న లక్షల్లో ఉన్న బంగారు ఆభరణాల దోచుకోవాలనే ఆలోచనతోనే హత్యకు పన్నాగం పన్ని నిందితులు బంగారంతో పరారీ అయ్యారని కాజీపేట ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

నేర చరిత్ర.. సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశ, ఉద్యోగం కోల్పోవడం, ఓ మహిళతో అక్రమ సంబంధం ఉన్న గడ్డం ప్రవీణ్ కుమార్.. ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ప్రవీణ్ కుమార్.. గుండ రజనితో కలిసి శుక్రవారం వరంగల్ గిర్మాజిపేటకు చెందిన గడ్డం నవీన్‌కుమార్‌కు ఫోన్ చేసి, తాము తీసుకున్న అప్పు తిరిగి ఇస్తామని నమ్మబలికి కాజీపేట రైల్వే క్వార్టర్స్‌కు పిలిపించారు. ఫుల్లుగా మద్యం తాగించాక నవీన్ మీద ప్రవీణ్ కుమార్ కూర్చొని బెల్టుతో ఉరివేశాడు. ఈ క్రమంలో నవీన్ కుమార్ కాళ్లను రజనీ చున్నీతో కట్టేసింది. ఇంట్లో ఉన్న కత్తితో నవీన్‌పై దాడిచేసి హత్య చేశారు. నవీన్ మృతిచెందాక అతడిపై ఉన్న బంగారం ప్రవీణ్ తీసి రజనికి ఇచ్చి ఆలేరుకు పంపించాడు. మృతుడి భార్య త్రిపురాది మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో మంగళవారం కడిపికొండ ఆర్వోబీ వద్ద నిందితుడు పోలీసులు తనిఖీల్లో పట్టుబడ్డాడు. రజనిని భువనగిరి జిల్లా ఆలేరు మండలం మర్రిగూడెం వద్ద పట్టుకున్నామని ఆమె వద్ద మృతుడి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు గడ్డం ప్రవీణ్ కుమార్, గుండ రజనిలపై పలు కేసులు ఉన్నాయి. నకిలీ నోట్ల చలామణితో సంబంధం ఉందన్న నేరంతో ప్రవీణ్‌కుమార్‌పై పాలకుర్తి, సుబేదారి పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయని చెప్పారు. వీరిద్దరు ఆరు కేసుల్లో నిందితులు అని చెప్పారు. హత్య కేసులో బంగారం, ప్రవీణ్‌కుమార్ బైక్, నవీన్‌కుమార్ బైక్‌ను, హత్య చేసిన కత్తిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈసమావేశంలో ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, ఎస్సై వి.నవీన్‌కుమార్ ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొడుకు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్ర గాయాలు



వినోద(ఫైల్)

సంగెం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వలేదనే కోపంతో తల్లి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో తీవ్ర గాయాలతో ఎంజీఎంలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి ముత్తినేని వినోద(60) మృతి చెందింది. ఎస్సై నరేష్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన ముత్తినేని సాంబయ్య- వినోద దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. టెక్స్‌టైల్స్ పార్కు నిర్మాణంలో సాంబయ్యకు చెందిన వ్యవసాయ భూమి ఉంది. ప్రభుత్వం ఆ భూమికి డబ్బులు అందించింది. అందులో నుంచి మరో చోట భూమిని కొనుగోలు చేశారు. మిగిలిన డబ్బు రూ.5 లక్షలను మండల కేంద్రంలోని బ్యాంకులో ఉంచారు. ఆ డబ్బును విడిపించి ఇవ్వాలని తల్లి వినోద, తండ్రి సాంబయ్యను కుమారుడు సతీష్ ఒత్తిడి చేశాడు. వారు ఒప్పుకోకపోవడంతో కుంటపల్లిలో ఇంట్లో నిద్రిస్తున్న తల్లిపై సతీష్ పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తీవ్ర గాయాలైన తల్లి వినోదను 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. వినోద మృత దేహానికి మంగళవారం ఎస్సై పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అధికార హస్తం.. అసంతృప్తే సమస్తం!

(3వ పేజీ తరువాయి)



కూడా పార్టీలో నెలకొన్న విభేదాలకు అద్దం పట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ద్వితీయ శ్రేణినేతల్లో అసంతృప్తి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం గడిచింది. పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి, పార్టీని కాపాడుకునేందుకు ఆస్తులు అమ్ముకున్న నేతలు ఉన్నారు. అధికారంలోకి వస్తే ఏదైనా పదవి రాకపోతుందా అనే ఆశతో గత అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా పని చేశారు. తీరా కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ద్వితీయ శ్రేణి నేతల ఆశలు గల్లంతవుతున్నాయి. ఇప్పటి వరకు ప్రకటించిన రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదువుల్లో బడా నేతలకే అవకాశం దక్కింది. ఇంకా అనేకమందికి నామినేటెడ్‌పై అధిష్టానం హామీ ఇచ్చింది. వీటితో పాటు ఇప్పటికీ కొన్ని జిల్లాల్లో గ్రంథాలయ ఛైర్మన్ పదవులను కూడా ప్రకటించలేదు. ప్రధానంగా వరంగల్ జిల్లాలో నామినేటెడ్ పదవులపై నేతల మధ్య విభేదాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ద్వితీయశ్రేణి నేతలు వాపోతున్నారు. గత జనవరిలో వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పాలక మండలిని ప్రకటించారు. కానీ, నేతల మధ్య విభేదాలతో ప్రమాణస్వీకారం కూడా చేయకుండానే రద్దు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. వీటిలో చాలా వరకు పాలక మండళ్లు లేవు. వ్యవసాయ మార్కెట్‌లకు కూడా ఇదే పరిస్థితి. జిల్లా స్థాయి నామినేటెడ్ భర్తీతో పాటు రాష్ట్ర స్థాయిలో వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, డైరెక్టర్ల పోస్టులు దక్కుతాయనే ఆశతో అనేకమంది ద్వితీయ శ్రేణి నేతలు నిరీక్షిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య విభేదాలతో ఏడాదిన్నర కాలం గడిచి పోయిందని, తమ పదవుల మాటేమిటనే ఆవేదన వ్యక్తం అవుతోంది. అధిష్టానం వద్దకు తమ పదవుల ఫైల్ కాకుండా ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకునే ఫైల్ పట్టుకుని తిరుగుతున్నారని, దీంతో తమకు పదవులు ఎప్పుడనే ఆవేదనలో క్యాడర్ ఉంది.

పదవులు లేవాయే.. పంచాయతీ ఎట్లా..?

నామినేటెడ్ పదవుల మాట దేవుడెరుగు.. కనీసం పార్టీ పదవులైనా వస్తాయని ఎదురుచూస్తున్న నేతలకు నిరాశే మిగులుతోంది. ఇప్పటికే పొరుగు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ కార్యవర్గాల ఏర్పాటు ప్రక్రియనే మరిచిపోయారని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. మండల కార్యవర్గాలు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలతో పాటు అనుబంధ సంఘాల కమిటీలను నియమించాల్సి ఉంది. ఇవి భర్తీ చేస్తే అనేక మందికి పదవులు లభిస్తాయని ఆశపడుతున్నారు. జిల్లా కార్యవర్గాలు కూడా ఏర్పాటు చేయాల్సి ఉందని, అయితే ఎవరు వీటిపై ఫోకస్ చేయడం లేదని ద్వితీయ శ్రేణి నేతలు వాపోతున్నారు. ఇప్పటికే అనేక మంది నేతలు జిల్లా కాంగ్రెస్ పదవులపై నజర్ వేశారు. మే చివరి నాటికే కమిటీలు పూర్తి చేయాలని నిర్ణయించినప్పటికీ, ఆ దిశగా అడుగులు పడడం లేదని వాపోతున్నారు. హనుమకొండ, మహబూబాబాద్, వరంగల్, జనగామ డీసీసీ పదవులకు భారీ డిమాండ్ ఉంది. కాగా, సెప్టెంబరు 30వ తేదీలోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈలోగా పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులను భర్తీ చేయకుంటే గ్రామాల్లోకి ఎలా వెళ్లాలని నేతలు ఆవేదన చెందుతున్నారు. మీకే పదవులు లేవు.. మమ్ముల్ని మీరెలా గెలిపిస్తారని ఆశావహుల నుంచి ప్రశ్నలు ఎదుర్కొనాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు

హసన్‌పర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో వాసవీ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సముద్రాల శంకర్‌తో పాటు స్థానిక ఆర్ఎంపీ వైద్యులు గౌరిశెట్టి సత్యనారాయణ, దివి అజిత్‌కుమార్, శేఖర్, రమణాచారిలను సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి వాసవీ క్లబ్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, కార్యదర్శి చిదర పురవర్దన్, కోశాధికారి నాగమల్ల మాధవశంకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ అప్పని శంకర్, మాజీ అధ్యక్షుడు వెలగందుల భీష్మనాథం, మంచెన శ్యాంసుందర్, అనుగం సతీష్, నాగమల్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు



ప్రెస్ క్లబ్‌లో రాంప్రసాద్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న యూనియన్ నేతలు, జర్నలిస్టులు

గుండెపోటుతో వీడియో జర్నలిస్టు మృతి

వడ్డెపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ వీడియో జర్నలిస్టు హరిబి రాంప్రసాద్ గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. రాంప్రసాద్ భౌతికకాయాన్ని హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌కు మంగళవారం తరలించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, టీయూడబ్ల్యూజే (హెచ్- 143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్‌తోపాటు జర్నలిస్టులు రాంప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ప్రెస్‌క్లబ్ పక్షాన రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

రాజనీతి శాస్త్రంలో రాజేందర్‌కు డాక్టరేట్



జట్టి రాజేందర్

హసన్‌పర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జట్టి రాజేందర్‌కు కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం డాక్టరేట్ పట్టా పొందారు. దూర విద్యా కేంద్రం మాజీ సంచాలకులు ఆచార్య చింతకాయల దినేష్‌కుమార్ పర్యవేక్షణలో పొలిటికల్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ట్రైబల్ ఉమెన్: ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టూ పంచాయతీ రాజ్ ఇనిస్టిట్యూషన్ ఇన్ తెలంగాణ అనే అంశంపై రాజేందర్ సమర్పించిన సిద్దాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్యకట్ల రాజేందర్ తెలిపారు.

శ్రీవైష్ణవ విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

వడ్డెపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని వైష్ణవ భవనం నందు శ్రీవైష్ణవ విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆర్థిక కార్యదర్శి డింగరి శ్రీకాంత్ తెలిపారు. 2025 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 540 మార్కులు, ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం 900 మార్కులపైన ఉత్తీర్ణులైన వైష్ణవ విద్యార్థిని, విద్యార్థులు ఈ నెల 10లోపు వరంగల్ శివనగర్‌లోని కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన రంగాచార్యులను సెల్ నంబర్ : 8790773636, ఆర్థిక కార్యదర్శి డిగరి శ్రీకాంత్‌ను సెల్ నంబర్: 9030146069లో సంప్రదించాలని కోరారు.అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు మార్కుల మెమొ, ఆధార్‌కార్డు, పాస్‌ఫోర్ట్ జైజు ఫొటోతో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న హస్తకళా మేళా



ఎగ్జిబిషన్‌లోని వివిధ హస్తకళా వస్తువులను తిలకిస్తున్న మహిళలు

వడ్డెపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండిక్రాఫ్ట్ షాపింగ్ ఎక్స్‌పో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హస్తకళా మేళా వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ సయ్యద్ ఖైజర్ మాట్లాడుతూ దేశంలోనే పేరెన్నిక నాణ్యతగల బెంగాల్ కాటన్ చీరలు, బాంధిని సారీస్, డ్రెస్ మెటీరియల్, జైపూర్ బెడ్ షీట్స్, బాగల్‌పూరి సిల్క్స్, యూపీ బెడ్‌షీట్స్, ఖాదీ షర్ట్స్, డోర్ కర్టెన్స్, నైటీస్, రెడీమెడ్ ఫ్యాన్సీటాప్స్, కాటన్ ఖాదీ టాప్స్, హ్యాండ్‌మేడ్ కార్పెట్స్‌తో పాటు జైపూర్ స్టోన్ జువెల్లరీ, 1 గ్రాం గోల్డ్ జువెల్లరీ, ఇమిటేషన్ జువెల్లరీ, షారన్‌పూర్ ఉడెన్ ఫర్నీచర్, కొండపల్లి బొమ్మలు తదితర వస్తువులు తమ ఎగ్జిబిషన్‌లో సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ ఎగ్జిబిషన్ ప్రతీ రోజు ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ఉంటుందని తెలిపారు. ట్రైసిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ములుగు డీఈవోగా చంద్రకళ



ములుగు టౌన్, జులై 1 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ములుగు జిల్లా అధికారి (డీఈవో)గా దురిశెట్టి చంద్రకళను నియమించారు. ఈమేరకు కలెక్టర్ దివాకర మంగళవారం ఉత్తుర్వులు జారీ చేశారు. గతంలో డీఈవోగా పనిచేసిన పాణిని గత నెల 16న ఏసీబీ అధికారులు కస్టడీలో తీసుకున్న నేపథ్యంలో హనుమకొండ డీఈవో డి.వాసంతికి బాధ్యతలు అప్పగించారు. ఆమె విధుల్లో చేరకపోవడంతో ఇంటర్ మీడియట్ విద్యా జిల్లా అధికారిగా పనిచేస్తున్న దురుశెట్టి చంద్రకళకు డీఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

డాక్టర్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ సభ్యులకు సన్మానం

హనుమకొండ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యుల, చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో డాక్టర్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ సభ్యులను హనుమకొండ రోటరీ క్లబ్ మెంబర్స్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ. వైద్యుల సేవలు మరువలేనివని అన్నారు. వ్యాపార రంగంలో సీ ఏల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శరత్‌బాబు, రోటరీ క్లబ్ కార్యదర్శి గంగోజుల నరేష్, కోశాధికారి రాజ్‌కుమార్, అసిస్టెంట్ గవర్నర్ నందసాని నరేష్, ప్రెసిడెంట్ ఎలక్ట్ వంగా రాజిరెడ్డి పాల్గొన్నారు.



బాలసముద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో డాక్టర్స్, చార్టర్డ్ అకౌంటెంట్స్ సభ్యులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ మెంబర్స్

డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు చేపట్టండి

వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం వరంగల్ నగరంలోని పోతన జంక్షన్, బీటుబజార్‌లో వరంగల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పోతన జంక్షన్ ప్రాంతంలోని 12మోరీల ప్రాంతంలో జంక్షన్‌ను విస్తరించాలని అన్నారు. బీటు బజార్‌లో కల్వర్టు పనులు పూర్తి చేసి 12 మోరీల వరకు డ్రైన్ నిర్మించాలన్నారు. డ్రైన్‌ల ఔట్‌ఫ్లో బయటకు వెళ్లే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నేపధ్యంలో డ్రైన్‌లను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయాలని శానిటేషన్ అధికారులకు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంచార్జీ సీపీ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలు శ్రీనివాస్, రవికుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, టీపీఎస్‌లు ఇర్షాద్, అనీల్, డీఈ రాజ్‌కుమార్, ఏఈ రాగి శ్రీకాంత్ పాల్గొన్నారు.



12 మోరీల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న మేయర్, కమిషనర్

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కాజీపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తల్లి మరణం తట్టుకోక జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట రైల్వే హెడ్‌కానిస్టేబు ల్ రమణారెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వేలేరు మండలం మల్లికుదురు గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ రంగు రాహుల్ (20) మంగళవారం కాజీపేట సమీపంలోని అయోధ్యపురం రైల్వే ట్రాక్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి వివాహం కాలేదు.. మృతుడి తల్లి గత మూడేళ్ల క్రితం మృతి చెందడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువుల చెప్పినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి చెల్లి, తండ్రి ఉన్నాడు.

సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు పోటీ పడాలి

నూతన లయన్స్ గవర్నర్ డాక్టర్ ఆర్య పిలుపు



మాట్లాడుతున్న లయన్స్ గవర్నర్ డాక్టర్ ఆర్య

హనుమకొండ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని అవసరార్థులను ఆదుకునేందుకు లయన్స్ సేవా సంస్థ ఇతర స్వచ్ఛంద సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తోందని 320 ఎఫ్ జిల్లా నూతన గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య అన్నారు. హనుమకొండ శాయంపేటలోని లయన్స్ భవన్‌లో సోమవారం రాత్రి నేత్రపర్వంగా థౌజండ్ పిల్లర్స్ క్లబ్ 27వ ఇన్‌స్టాలేషన్ వేడుకలు జరిగాయి. క్లబ్ అధ్యక్షుడు చొప్పరి సోమయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రస్తుతం 25-26 లయనిస్టిక్ సంవత్సరానికి క్లబ్ అధ్యక్షుడిగా, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరికిపండ్ల వేణు, ప్రధాన కార్యదర్శిగా మైదం రాజ్‌గోపాల్, కోశాధికారిగా సామల అన్వేష్, ఇతర కార్యవర్గంచే మల్టీపుల్ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్‌రావు ప్రమాణం చేయించారు. సందర్భంగా గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 80 క్లబ్‌ల నూతన సారథులంతా నూతన ఉత్సాహంతో సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు పోటీ పడాలని సూచించారు. పూర్వ గవర్నర్ కుందురు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన లయనిస్టిక్ సంవత్సరంలో కోట్లాది రూపాయల వ్యయంచే హనుమకొండలో నిరుపేదల సహాయార్థం లయన్స్ చారిటబుల్ ఆస్పత్రిని ప్రారంభించుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. క్లబ్‌లో నూతనంగా చేరిన సభ్యులతో పీడీజీ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. ఇన్‌స్టాలేషన్ చైర్మన్‌గా వైవీ.వామన్‌రావు, కో చైర్మన్‌లుగా తాళ్లపల్లి సురేశ్, జే.అంజిరెడ్డి, సంజీవయ్యలు వ్యవహరించిన ఈ కార్యక్రమంలో థౌజండ్ పిల్లర్స్ క్లబ్ నుంచి వీడీజీ 1గా ఎన్నికైన నరహరి సుధాకర్‌రెడ్డి, అనిత దంపతులను ఘనంగా సత్కరించారు. ఎస్‌వీడీజీ పుట్టా హరికిషన్‌రెడ్డి, పీడీజీలు ముచ్చ రాజిరెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, కన్నా పరశురాములు, డీసీఎస్ హబీబ్, సిహెచ్.రఘునాథరెడ్డి, జే.రాజిరెడ్డి, పొన్నాల సంయుక్త, ఉషామార్త, కటంగూరి రామ్‌గోపాల్‌రెడ్డిలతోపాటు ప్రొఫెసర్ దయాకర్‌రావు, గుజ్జారి రమేశ్, పాము శ్రీనివాస్, దడిగెల రమేశ్, చంద్రశేఖర్, డాక్టర్ శివుడు పాల్గొన్నారు. పెండెం వేణుమాధవ్, తిరునగరి నరేందర్‌లు మాస్టర్ ఆఫ్ సెర్మనీగా వ్యవహరించారు.

ఆపదలో ఉన్న మహిళల కోసమే సఖి సెంటర్

హసన్‌పర్తి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళలకు చేయూతనివ్వడం కోసమే సఖి సెంటర్ నిర్వాహకులు పనిచేస్తారని వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల సమావేశ మందిరంలో మంగళవారం సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, సఖీ కేస్ వర్కర్ భారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181, చైల్డ్‌లైన్ 1098 సేవల పోస్టర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీ ఆవిష్కరించి మాట్లాడారు.

మహిళలు సమస్యలున్నప్పుడు ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్లను సద్వినియోగం చేసుకొని తక్షణ సహాయంతో పాటు రక్షణ లభిస్తుందన్నారు. టోల్ ఫ్రీ నెంబర్‌లే కాకుండా 0870 2452112, 73829 83088 నెంబర్‌లకు కాల్ చేయడం ద్వారా బాధిత మహిళలకు సహాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవి విరమణ చేసిన ఎక్సైజ్ ఎస్సై క్రిష్ణమూర్తికి సత్కారం



ఎస్సై క్రిష్ణమూర్తి సత్కారంలో సీఐ దుర్గాభవాని, ఎస్సై, సిబ్బంది

వరంగల్ క్రైం, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ సోమవారం పదవి విరమణ చేసిన బి. క్రిష్ణమూర్తిని సీఐ దుర్గాభవాని, సిబ్బంది పోలీస్‌స్టేషన్ ఆవరణంలో శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. నాలుగు దశాబ్దాలుగా అంకితభావంతో పని చేసిన క్రిష్ణమూర్తి సేవలను సీఐ దుర్గాభవాని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటచందు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఏ పని చేయకుండా బాధ్యతారహితంగా తిరుగుతున్న భర్తను మందలించినందుకు హత్యకు పాల్పడిన నిందితుడికి యావజ్జీవ కారాగారా శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి డాక్టర్ కె. పట్టాభిరామారావు మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అమ్మవారిపేట గ్రామానికి చెందిన మైదం కొమురయ్యకు తన భార్య మైదం సంతోషితో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. వీరికి కుమారుడు రాజేష్ ఉన్నాడు. నిందితుడు కొమురయ్య ఏ పనిచేయకుండా సంపాదన లేకుండా తిరుగుతుండడంతోభార్య సంతోషిమందలించింది. దాన్ని దృష్టిలో పెట్టుకొని ఆమెతో గొడవ పడుతూ తరుచూ కొడుతుండేవాడు. ఈ క్రమంలో 2024 డిసెంబరు 19న ఉదయం 8 గంటలకు నిందితుడు కొమురయ్య భార్య సంతోషితో గొడవపడి కొట్టి చంపుతానని బెదిరించి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు కోడలు రాణి అమ్మవారిపేటలోని ఇంటికి వచ్చేసరికి సంతోషి మెడ చుట్టూ తాడుతో భర్త గట్టిగా చుట్టి ఉరేశాడు. కోడలు వచ్చి సంఘటనను చూసి గట్టిగా అరవడంతో అక్కడి నుంచి ఉరిపెట్టిన తాడు పట్టుకొని నిందితుడు కొమురయ్య పరారయ్యాడు. ఈ విషయాన్ని కోడలు రాణి తన భర్త మైదం రాజేష్‌కు ఫోన్ ద్వారా తెలపడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తల్లి సంతోషి చావుకు కారణమైన తండ్రి కొమురయ్యపై చట్ట రీత్యా చర్య తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో నిందితుడిపై హత్యానేరం నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువైనందున నిందితుడు కొమురయ్యకు జీవిత ఖైదు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ వి.రాజేష్ సాక్షులను ప్రవేశపెట్టగా దర్యాప్తు అధికారిగా సీఐ కరుణాకర్ వ్యవహరించారు. కేసు విచారణలో ఏఎస్సై పరమేశ్వరి, హెడ్ కానిస్టేబుళ్లు కుమారస్వామి, సదానందం సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. రాము కేసు వాదించారు.

పోచమ్మకుంట హెల్త్‌సెంటర్‌లో ఆరోగ్య సర్వే



వివరాలు తెలుసుకుంటున్న ఎఫ్‌డీఆర్ సభ్యులు

రాంనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పనితీరు గమనించేందుకు లోక్ సత్తా (ఉద్యమ సంస్థ), ఫౌండేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్) ఆధ్వర్యంలో మంగళవారం పోచమ్మకుంట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సర్వే చేసినట్లు లోక్ సత్తా (ఉద్యమ సంస్థ) ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారి రాంమోహన్ తెలిపారు. ఈ సర్వేలో లోపాలను గమనించి బాగా పనిచేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రుల గురించి ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఆస్పత్రుల పనితీరుపై ప్రభుత్వానికి ఓ నివేదికను సైతం అందించడం జరుగుతుందన్నారు.ఈ సర్వేలో జ్వాల అవినీతి వ్యతిరేఖ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్, ఎఫ్‌డీఆర్ సభ్యులు సుమేధ, లిఖిత, ఉదయ్, కుమార్, మహేందర్ పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వో అప్పయ్యను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ పాలకవర్గం

రెడ్‌క్రాస్‌లో జాతీయ వైద్యుల దినోత్సవం

హనుమకొండ కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం డీఎంహెచ్‌వో అప్పయ్య, డాక్టర్ ఎం శేషుమాధవ్, రెడ్‌క్రాస్ వైద్యులు డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, డాక్టర్ మహ్మద్ తహర్ మసూద్, లయన్స్‌క్లబ్ కంటి దవాఖానా డాక్టర్ భరద్వాజ్, డాక్టర్ కంటెం లక్ష్మీనారాయణలను మెమొంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి

వరంగల్ మెడికల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీన జరిగే సమ్మె నోటీసులు కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డికి మంగళవారం అందజేశారు. కేఎంసీ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో రైతాంగం, కార్మిక వర్గం, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని రాగుల రమేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు ధర్మ, ప్రధాన కార్యదర్శి కనకం రవీందర్, సంతోష్, బాలరాజు, నవీన్, గీత, ప్రణయ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హనుమకొండ కార్యాలయంలో నోడల్ జీఎంలు, సీఈలతో సీఎండీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ 16 సర్కిళ్ల పరిధిలో వ్యవసాయ కనెక్షన్‌లు పెరుగుతున్నాయని వాటికి తగ్గట్లుగా రిలీజ్ వేగవంతం చేయాలన్నారు. విద్యుత్ బిల్లులు కనెక్షన్లు 100 శాతం జరిగేలా నోడల్ జీఎంలు బకాయిలపై దృష్టిసారించి ఆయా సర్కిళ్ల పరిధిలో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో ఎక్కడ అంతరాయాలు ఏర్పడినా వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరిగేలా మ్యాన్‌పవర్, మెటీరియల్ సిద్ధం చేసుకోవాలని సూచించారు. వచ్చే మూడు నెలలు ప్రమాద భరితంగా ఉండి విద్యుత్ ప్రమాదాలు జరిగే ఆవకాశం ఉన్నందున లూజ్‌లైన్‌లు, వంగిన పోల్స్, తుప్పు పట్టిన పోల్స్, తక్కువ ఎత్తులో ఉన్న డీటీఆర్ ప్లింత్‌లు , లైన్ క్రాసింగ్, డబుల్ ఫీడింగ్ వచ్చే వాటిని గుర్తించి మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మోహన్‌రావు, మధుసూదన్, ప్రభాకర్, తిరుపతిరెడ్డి, సీఈలు, తదితరులు పాల్గొన్నారు.

అశోక కాలనీ ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మించొద్దు

కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మండల కృష్ణారెడ్డి

వడ్డెపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ అశోక కాలనీ ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మించవద్దని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మండల కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బూర రాంచందర్ డిమాండ్ చేశారు. అశోక కాలనీలో ఓ ఇంటి వద్ద సెల్ టవర్ నిర్మాణం పనులు చేపడుతుండగా కాలనీవాసులు అడ్డుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మించడం వల్ల రేడియేషన్ విడుదల చేస్తుందని తద్వారా మహిళలు, చిన్న పిల్లలు రేడియేషన్ గాఢతకు గురై అనారోగ్యం పాలవుతారని అన్నారు. జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ రోజారెడ్డి సెల్ టవర్ నిర్మాణపు పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో అశోక కాలనీ అభివృద్ధి కమిటీ కోశాధికారి సీహెచ్. సతేంద్రరెడ్డి, ప్రతినిధులు కొలను వెంకటరామిరెడ్డి, బొద్దిరెడ్డి భగవాన్‌రెడ్డి, మల్లేశం, తాటిపాముల శ్రీనివాసరావు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి సరోత్తంరెడ్డి, మనోహరస్వామి, వీరస్వామి, బుర్ర రవీందర్, కుమారస్వామి, కొమురారెడ్డి, జైపాల్‌రెడ్డి, బాల్నే రామయ్య, నర్సింహారెడ్డి, బొల్లు దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు

ఇంటి పనీ 'వర్కవుట్' అవుతుంది

మనం ఇంట్లో రకరకాల పనులు చేస్తూ ఉంటాం. ప్రతి పనికీ కొన్ని క్యాలరీలు ఖర్చవుతూ ఉంటాయి. రోజూ శ్రద్ధగా ఇంటి పనులు చేస్తూ సులువుగా బరువు తగ్గవచ్చు అంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

- పనులన్నింటిలోకి సులువైనది ఇల్లు ఊడవడం. కొద్దిగా వంగి మెల్లగా నడుస్తూ చీపురుతో ఇల్లు ఊడవడం అలాగే తడిగుడ్డతో ఇల్లు, ఫర్నిచర్ తుడవడం వల్ల తెలియకుండానే శారీరక శ్రమ చేసినట్లవుతుంది. తేలికపాటి వ్యాయామం చేసిన ఫలితం దక్కుతుంది.
- నిలబడి వంట చేయడం, కూరగాయలు తరగడం, వంట సామాగ్రి కోసం అటూ ఇటూ తిరగడం వల్ల కూడా అధికంగానే క్యాలరీలు ఖర్చవుతాయి. వంట పాత్రలను రుద్ది కడిగినా శరీరం శ్రమ పడుతుంది. ఈ పనులన్నీ బరువు తగ్గడానికి తోడ్పడతాయి.
- ఇంట్లో పంపు కింద బకెట్లో నీళ్లు పట్టి బట్టలు నానబెట్టి ఉతికితే శరీరానికి వ్యాయామం చేసినట్లే అవుతుంది. నేలమీద పీటపై కూర్చుని వంగి బట్టలకు సబ్బురాసి బ్రష్‌తో రుద్దుతూ ఉతకడం వల్ల వెన్నెముక, నడుము భాగాలకు శ్రమ కలుగుతుంది. బట్టలను నీళ్లలో ముంచి తీయడం, వాటినుంచి నీళ్లను పిండడం, నిటారుగా నిలబడి బట్టలు ఆరేయడం వల్ల అధికంగా క్యాలరీలు ఖర్చవుతాయి.



- నిలబడి దుస్తులు ఇస్త్రీ చేయడం కూడా మంచి వర్కౌటే. దీనివల్ల కళ్లు, చేతులు, మెడ భాగాలకు పని పెరిగి శక్తి వినియోగమవుతుంది.
- తోటపని చేయడం వల్ల కూడా క్యాలరీలు ఖర్చవుతాయి.

శిరోజాల కోసం తులసి

తులసి ఆకులతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిసిందే. ఈ తులసి ఆకులు శిరోజాలకూ పోషణనిస్తాయి. ఆ వివరాలివీ..

- తులసి ఆకులను ఎండబెట్టి పొడి చేయాలి. కొబ్బరి నూనెలో రెండు స్పూన్లు ఈ పొడిని వేసి సన్నని మంట మీద పెట్టాలి. నూనె వేడయ్యాక కొన్ని మెంతులు వేసి మరికొంతసేపు వేడి చేయాలి. చల్లారాక ఆ నూనెను మాడుకు పట్టించాలి. రెండు గంటల తరువాత తలస్నానం చేయాలి. దీనివల్ల చుండ్రు, తలలో ఉండే చిన్న కురుపులు, దురద వంటి సమస్యలు దూరమవుతాయి.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతులను రాత్రంతా నానబెట్టాలి. ఉదయం తులసి ఆకులు, టేబుల్ స్పూన్ పెరుగు వేసి ఆ మెంతులను మెత్తని పేస్టులా రుబ్బి తలకు మాస్క్ వేయాలి. అరగంట తరువాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేస్తే కుదుళ్లు బలంగా మారుతాయి.
- కొన్ని తులసి ఆకులను రుబ్బి, అందులో కలబంద గుజ్జును కలిసి మాడుకు, జుట్టుకు పట్టించి అరగంట తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. దీని వలన చుండ్రు తగ్గడంతో పాటు కేశాలు మృదువుగా మారుతాయి.



- కొన్ని తులసి ఆకులు, కొన్ని వేప ఆకులు తీసుకుని మెత్తగా రుబ్బాలి. ఆ పేస్టులో ఒక స్పూన్ నిమ్మరసం కలిసి తలకు బాగా పట్టించి అయిదు నిమిషాలు మర్దన చేయాలి. పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే మాడుకు అంటి ఉన్న బ్యాక్టీరియా తొలగిపోయి దురద వంటి సమస్యలు తగ్గుతాయి.

న్యూస్‌మేకర్







ఇటీవల 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ... భద్రాద్రి మిల్లెట్ బిస్కెట్ల గురించి ప్రస్తావించారు. ప్రశంసల వర్షం కురిపించారు. దీంతో వీటి గురించి చర్చ మొదలైంది. భద్రాచలానికి చెందిన నలుగురు గిరిజన మహిళలు కలిసి ఈ బిస్కెట్లు తయారు చేస్తున్నారు. తమ ఉత్పత్తులకు ఇంతటి ఖ్యాతి లభిస్తుందని అస్సలు ఊహించలేదని... ప్రధాని అభినందనలు ఎనలేని ప్రోత్సాహాన్ని ఇచ్చాయని ఆ బృంద సభ్యులైన **ఊకె వెంకటలక్ష్మి, తాటి లలిత** సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రయాణం ఎక్కడ... ఎలా మొదలైందనే విశేషాలను వారు 'నవ్య'తో పంచుకున్నారు.

మిల్లెట్ మిరాకిల్స్

"ఆరేళ్ల నుంచి మేం మిల్లెట్ బిస్కెట్లను తయారు చేస్తున్నాం. రుచితోపాటు ఆరోగ్యకరమైనవి కావడంతో వీటికి క్రమంగా డిమాండ్ పెరిగింది. ఒకసారి తిన్న వారు బంధుమిత్రుల కోసం తీసుకువెళుతుంటారు. అలా విదేశాలకు కూడా వెళ్లాయి మా బిస్కెట్లు. అక్కడివారు మమ్మల్ని సంప్రతించి బిస్కెట్లు పంపమని అడగడం మాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది. ఈ మధ్య భద్రాచలం ఐటీడీఏను సందర్శించిన 'ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (ట్రైఫెడ్) అధికారులు... మేము తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్లను రుచి చూశారు. అద్భుతంగా ఉన్నాయంటూ అభినందించారు. ఈ ఏడాది మార్చి మొదటి వారంలో రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మా స్టాల్‌ను ఏర్పాటు చేశాం. అక్కడకు వచ్చినవారందరికీ బిస్కెట్లు బాగా నచ్చాయి. అలా మా మిల్లెట్ బిస్కెట్ల తయారీ అంశం ప్రధాని నరేంద్ర మోది దృష్టికి వెళ్లింది.

కరక్కాయ టీ పొడి...

రాగి, జొన్న బిస్కెట్ ప్యాకెట్లను ఒక్కోటి రూ.130కి సామలు, కొర్రలు బిస్కెట్ ప్యాకెట్లను ఒక్కోటి రూ.150కి విక్రయిస్తున్నాం. ఈ మధ్యే కరక్కాయ టీ పౌడర్ తయారీ ప్రారంభించాం. దీన్ని రూ.200లకు విక్రయిస్తున్నాం. పెద్ద పెద్ద మాల్స్‌లో సైతం 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లు' అందుబాటులో ఉండాలనేది మా లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అహర్నిశలూ శ్రమిస్తున్నాం. ప్రస్తుతం మా బృందంలో నలుగురం ఉన్నాం. మరో పదిమందికైనా ఉపాధి కల్పించే స్థాయికి మా వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలని కోరుకొంటున్నాం.

అలా మొదలైంది...

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపుతున్నారు... రాగి జావ, జొన్న రొట్టెలు, కొర్రల అన్నం లాంటివి తింటున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ మిల్లెట్స్ అంటే ఆసక్తి పెరిగింది. వీటితో చిరుతిళ్లు తయారుచేసి అమ్మితే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. మొదట రాగులు, జొన్నలతో బిస్కెట్లు తయారు చేశాం. అనుకోని ఇబ్బందులు ఎన్నో ఎదురయ్యాయి. రూ.15 వేల వరకూ నష్టం వచ్చింది. అయినా మా ప్రయత్నాన్ని ఆపలేదు. ఉన్నతాధికారుల ప్రోత్సాహం, సహకారంతో రోజుకు మూడు కేజీల బిస్కెట్లను సిద్ధం చేసేవాళ్లం. ప్రస్తుతం జొన్నలు, రాగులు, సామలు, కొర్రలతో 20 కేజీల వరకు తయారు చేసి అమ్ముతున్నాం. ఇందు కోసం అవసరమయ్యే మిల్లెట్స్, ఇతర ముడి పదార్థాలను ఏపీలోని అల్లూరి జిల్లా చింతూరు మండలం తులసిపాక గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్నాం. అధికారులు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నారు. భద్రాచలం రామాలయం, ఐటీడీఏ గిరిజన మ్యూజియం, కొత్తగూడెం, ఖమ్మం కలెక్టరేట్లతో పాటు హైదరాబాద్‌లోని శిల్పారామం తదితర చోట్ల బిస్కెట్లు విక్రయిస్తున్నాం. భద్రాచలంలో స్థానికంగా రెండు కౌంటర్లను స్వయంగా, మరికొన్నింటిని ఇతరుల సహకారంతో నిర్వహిస్తున్నాం.

శానిటరీ నేప్‌కిన్స్‌తో...

వాస్తవానికి మేము తయారు చేసే బిస్కెట్లు ప్రధాని ప్రశంసించే స్థాయికి వెళతాయని అస్సలు ఊహించలేదు. నిజంగా ఇది మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్రశంసతో మా బాధ్యత పెరిగింది. ఈ విజయం మాకు అంత సులువుగా లభించలేదు. ఎన్నో ఇబ్బందులు, కష్టాలు, సవాళ్లు ఎదుర్కొని ఈ స్థాయికి చేరాం. 2019లో 'శ్రీరామా జాయింట్ లయబిలిటీ గ్రూప్'ను ఏర్పాటు చేసుకున్నాం. మొదట 'గిరి శానిటరీ నేప్‌కిన్స్' తయారీ ప్రారంభించాం. ఇవి పాత మోడల్‌లో ఉన్నాయని ఎవరూ కొనడానికి ఆసక్తి చూపలేదు. దీంతో 2020 మార్చిలో... ఐటీడీఏ అధికారుల సహకారంతో కొత్త మిషన్‌ను కొనుగోలు చేశాం. యూనిట్ కాస్ట్ రూ.13.45 లక్షలు కాగా ఇందులో రూ.8 లక్షలు ఐటీడీఏ సబ్సిడీ ఇచ్చింది. బ్యాంకు రుణం కింద రూ.4.35 లక్షలు మంజూరు కాగా మా వాటా కింద రూ.లక్ష చెల్లించాం.


అందరి సహకారంతో...

అయితే ఊహించని రీతిలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందడం, లాక్‌డౌన్ కారణంగా నేప్‌కిన్స్ తయారీ చేపట్టలేకపోయాం. ఆ సమయంలో అధికారుల సహకారంతోనే మాస్కులు తయారు చేశాం. తరవాత నెల రోజులు కష్టపడి 40 వేల నేప్‌కిన్స్ తయారు చేసి జీసీసీకి అప్పగించాం. తరవాత మా అందరికీ ఖాళీ సమయం ఉంటుండటంతో మిల్లెట్ బిస్కట్లను తయారు చేయాలనుకున్నాం. ఈ విషయాన్ని అప్పటి ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించి మాకు హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించారు. నాటి నుంచి మా మిల్లెట్ బిస్కెట్ల తయారీ కొనసాగుతూనే ఉంది.

• శ్రీపాద శ్రీధర్, భద్రాచలం

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ప్రపంచానికి బహుమతిగా 'రామాయణ'



రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం శరవేగంతో తయారవుతోంది. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ ఇతిహాసాన్ని ప్రముఖ సంస్థలు ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. 'రామాయణ.. ద ఇంట్రడక్షన్' పేరుతో ఈ సినిమా గ్లింప్స్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ 'మేం చరిత్రను తిరిగి చెప్పడం లేదు.. మన వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శిస్తున్న కళాకారులు, సాంకేతిక నిపుణులందరినీ ఒక చోట చేర్చి ప్రామాణికంగా 'రామాయణ' చిత్రాన్ని తీస్తున్నాం. ఈ సినిమా ప్రపంచానికి మేం ఇచ్చే బహుమతి అవుతుంది' అన్నారు. ప్రామాణికంగా, భక్తిశ్రద్ధలతో 'రామాయణ' చిత్రాన్ని రూపొందిస్తున్నామని, ఐమాక్స్ సహా ప్రపంచంలోని అన్ని పాపులర్ ఫార్మెట్స్‌లో విడుదల చేస్తామని దర్శకుడు నితీశ్ తివారి చెప్పారు. ఈ సినిమాలో కన్నడ హీరో యశ్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తున్నారు.

అందుకే ఆలస్యం!



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ మల్లిడి తెరకెక్కిస్తోన్న సోషియో ఫ్యాంటసీ 'విశ్వంభర' ఎప్పుడెప్పుడు వస్తుందా అని అభిమానులు ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. ఈ సంక్రాంతికే రావాల్సిన ఈ సినిమా విడుదల తేదీపై ఇప్పటికీ స్పష్టత లేదు. దీంతో ఈ సినిమా ఎప్పుడొస్తుందనేది ఓ ప్రశ్నగా మారింది. ఈ నేపథ్యంలో ఆంగ్ల మీడియాతో మాట్లాడిన దర్శకుడు వశిష్ఠ, సినిమా గురించి అప్‌డేట్ ఇచ్చారు. "విశ్వంభర' ఒక్క పాట మినహా షూటింగ్ అంతా పూర్తైంది. సినిమా ఒక విజువల్ వండర్‌లా ఉంటుంది. ఆ అనుభూతినిచ్చేందుకే వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. వాటి నాణ్యత విషయంలో అస్సలు రాజీపడడం లేదు. అందుకే ఆలస్యం అవుతోంది. ఈ పనులు ఓ కొలిక్కి వచ్చాకే విడుదల తేదీపై స్పష్టతనిస్తాం. సినిమాలో అత్యధికంగా 4676 వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉన్నాయి. అవి ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లే విధంగా ఉంటాయి. ప్రపంచస్థాయి క్వాలిటీని అందివ్వడానికి టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తున్నాయి. చిరంజీవి ఇప్పటివరకూ చేసిన పోస్ట్ ప్రొడక్షన్ పనుల అవుట్‌పుట్ చూసి థ్రిల్లయ్యారు" అని అన్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తున్నారు.

తమ్ముడు ప్రేక్షకులను మెప్పిస్తాడు

- నితిన్



'నా గత చిత్రాలు ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగించలేదు. కానీ 'తమ్ముడు' సినిమా మిమ్మల్ని నిరాశ పరచదు. దర్శకుడు వేణు శ్రీరామ్ ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రంగా తీర్చిదిద్దారు. ఇక నుంచి మంచి కథలతో మీ ముందుకు వస్తాను' అని హీరో నితిన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'తమ్ముడు' చిత్రం ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. నితిన్ మాట్లాడుతూ '80 రోజులు అడవుల్లోనే ఉండి ఎన్నో ఇబ్బందులకు ఓర్చుకొని 'తమ్ముడు' షూటింగ్ పూర్తి చేశాం' అని అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'చిత్రబృందం కష్టం వల్లే 'తమ్ముడు' సినిమా అవుట్‌పుట్ బాగా వచ్చింది. దర్శకుడు శ్రీరామ్ వేణు తన విజన్‌ను అద్భుతంగా తెరపైకి తెచ్చారు. ఈ సినిమా సక్సెస్ క్రెడిట్ పూర్తిగా ఆయనకే దక్కుతుంది. నితిన్‌కు ఇది కమ్‌బ్యాక్ మూవీ అవుతుంది. రామ్‌చరణ్‌తో ఓ సూపర్ హిట్ మూవీ చేయబోతున్నాం. త్వరలో వివరాలు ప్రకటిస్తాం' అని చెప్పారు. శిరీష్ మాట్లాడుతూ "తమ్ముడు'తో నితిన్‌కు హిట్ ఇస్తామని నిర్మాతగా మాట ఇస్తున్నాను' అని అన్నారు. శ్రీరామ్ వేణు మాట్లాడుతూ 'థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం 'తమ్ముడు' సినిమాను డిజైన్ చేశాను. కుటుంబ అనుబంధాలతో పాటు వాణిజ్య హంగులు కలబోసిన చిత్రమిది' అని చెప్పారు. 'ఇందులో కొత్త తరహా పాత్ర చేశాను' అని లయ తెలిపారు. 'ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం, పాత్రల తాలూకు భావోద్వేగాలకు ప్రేక్షకులు అనుభూతి చెందుతారు' అని సప్తమి గౌడ చెప్పారు. థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాల్సిన చిత్రమిదని వర్ష బొల్లమ్మ అన్నారు.



నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు సోదరుడు శిరీష్ రెడ్డి మెగా అభిమానులకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. 'ఇటీవల నేను ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు అపార్థాలకు దారి తీశాయి. దాని వల్ల కొందరు మెగా అభిమానులు బాధపడినట్లు తెలిసింది. 'గేమ్ ఛేంజర్' సినిమా కోసం మాకు హీరో రామ్‌చరణ్ తన పూర్తి సమయం, సహకారం అందించారు. మెగాస్టార్ చిరంజీవి కుటుంబానికి మాకు ఎన్నో ఏళ్ల నుంచి సాన్నిహిత్యం ఉంది. మేము చిరంజీవి, రామ్ చరణ్, ఇతర మెగా హీరోల ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా మాట్లాడం.. ఒకవేళ నా మాటలు ఎవరి మనోభావాలనైనా ఇబ్బంది పెట్టే విధంగా ఉంటే క్షమించండి..'అని ఆ ప్రకటనలో శిరీష్ రెడ్డి పేర్కొన్నారు.

వివాదం... క్షమాపణలు



అసలేం జరిగింది?


దిల్ రాజు నిర్మాణంలో శిరీష్ సహ నిర్మాతగా వ్యవహరించిన 'తమ్ముడు' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా శిరీష్ రెడ్డి ఓ వీడియో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'గేమ్ ఛేంజర్ సినిమా డిజాస్టర్ అయి మేము ఆర్థికంగా చాలా నష్టపోయాం. మేము ఇబ్బంది పడుతున్నప్పుడు హీరో రామ్‌చరణ్ గానీ, దర్శకుడు శంకర్ గానీ కనీసం ఫోన్ కూడా చేయలేదు' అని చెప్పడం వివాదాస్పదమైంది. ఆ ఇంటర్వ్యూ చూసిన మెగా అభిమానులు తీవ్ర స్థాయిలో స్పందించారు. 'ఆర్ఆర్ఆర్ తర్వాత మీకు సినిమా చేసిన హీరో మీద ఇలా విషం చిమ్మడం కరెక్టేనా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి 'గేమ్‌ఛేంజర్' సినిమా గురించి మాట్లాడొద్దు అని హెచ్చరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో శిరీష్ రెడ్డి ఇలా అభిమానులకు క్షమాపణలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేయడంతో వివాదం సద్దుమణిగినట్లేనని భావిస్తున్నారు.

శ్రీహరి కుటుంబం నుంచి హీరోగా



ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖ నిరోషా ప్రధాన పాత్రలుగా తోట శ్రీకాంత్ కుమార్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'థాంక్యూ డియర్'. పప్పు బాలాజీ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శ్రీహరి కుటుంబం నుంచి వచ్చిన ధనుష్ రఘుముద్రి హీరోగా నటిస్తోన్న ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

నేటి తరానికి తగిన చిత్రం



అక్షయ్, మదన్ కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'బ్లాక్ నైట్'. సతీష్ కుమార్ దర్శకత్వంలో వై.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్, పాటలను చిత్ర పరిశ్రమ పెద్దలు లాంచ్ చేశారు. ఈ సందర్భంగా కేఎల్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'మరోసారి వింటేజ్ తరహా సినిమాలు ప్రేక్షకులను పలకరిస్తున్నాయి. నేటి తరానికి తగ్గట్లు మరోసారి అటువంటి సినిమాలను తీసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. కార్యక్రమంలో ప్రతాని రామకృష్ణ గౌడ్, దర్శకుడు సతీష్ కుమార్, నిర్మాత వెంకటేశ్వర రావు మాట్లాడారు.

రైలు సేవలన్నీ ఒకే చోట



» సరికొత్తగా 'రైల్ వన్' యాప్

» రిజర్వేషన్, ప్లాట్‌ఫాం టికెట్లు సహా అన్ని సేవలు అందులోనే

న్యూఢిల్లీ, జూలై 1: రైల్వే సేవలను ప్రయాణికులు మరింత సులభంగా పొందేందుకు వీలుగా ఆ శాఖ సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. రైల్ వన్' పేరిట రూపొందించిన ఈ యాప్ ద్వారా అన్ని సేవలను ఒకే చోట పొందేందుకు వీలుకలుగుతుంది. టికెట్ల బుకింగ్, రిజర్వేషన్, టికెట్ల రద్దు, ప్లాట్‌ఫాం టికెట్లు, భోజనం సహా ఫిర్యాదులు, సమస్యలు వంటి అన్ని రకాల సేవలు ఈ యాప్‌లో ఒకే చోట అందుబాటులో ఉంటాయి. పీఎన్ఆర్ విచారణ, జర్నీ ప్లానింగ్ వంటివి కూడా ఈ యాప్‌లో ఉంటాయి. ఆండ్రాయిడ్ ఫోన్లు వినియోగించేవారు ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్(సీఆర్ఐఎస్) 40వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. రైల్ వన్ యాప్ వన్ స్టాప్ సొల్యూషన్‌గా ప్రయాణికులకు ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు. ఈ యాప్ ద్వారా టికెట్ రిజర్వేషన్, అన్ రిజర్వ్‌డ్ వివరాలు, ప్లాట్‌ఫాం టికెట్ల కొనుగోలు, పీఎన్ఆర్ ఎంక్వయిరీ, జర్నీ ప్లానింగ్, రైల్వే స్టేషన్లలో బోగీల పొజిషన్, రైలు ప్రయాణ స్థితి, రైలు సహాయ సేవలు, ప్రయాణ సమయంలో మీల్స్ బుకింగ్‌వంటి పలు సేవలను ఒకే వేదిక ద్వారా పొందవచ్చన్నారు. గతంలో పలు సేవలకు వేర్వేరు యాప్‌లు ఉండేవని.. దీంతో వినియోగదారులు అనేక పాస్‌వర్డ్స్, లాగిన్‌లను వినియోగించాల్సి వచ్చేదని, కానీ.. రైల్ వన్‌లో ఒకే లాగిన్, ఒకే పాస్‌వర్డ్‌తో అన్ని సేవలను సులభంగా పొందవచ్చని మంత్రి వైష్ణవ్ వివరించారు. ఈ యాప్‌కు రైల్వే ఈ-వ్యాలెట్‌ను కూడా జోడించినట్టు తెలిపారు. లాగిన్ అయ్యేందుకు బయోమెట్రిక్ సహా 'ఎంపిన్' సౌలభ్యం ఉందన్నారు. 'సూపర్ యాప్'గా ఇది రైలు ప్రయాణికులకు మెరుగైన సేవలను అందిస్తుందని తెలిపారు.

50 కోట్ల చక్కెర డ్రైనేజీ పాలు



» చక్కెర మిల్లు పక్కన ఉన్న డ్రైనేజీ కబ్జా

» భారీ వర్షాలతో ఆ మిల్లులోకి వరద నీళ్లు

న్యూఢిల్లీ, జూలై 1: ఆసియా ఖండంలోనే అతిపెద్ద చక్కెర మిల్లు.. దాని పక్కనే మున్సిపల్ డ్రైనేజీ కాలువ. కాలువ పక్కన స్థలం ఆక్రమణకు పాల్పడటంతో అర్ధరాత్రి కురిసిన వర్షంతో డ్రైనేజీ ఉప్పొంగి.. వరద పోటెత్తడంతో పక్కనే ఉన్న మిల్లు ఆవరణలోని గోదాంలో నిల్వ ఉంచిన పంచదార కరిగిపోయిన ఘటన హరియాణాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. దీంతో రూ.50 నుంచి రూ.60 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు చెప్పారు. మిల్లు ఆవరణలోని గోదాంలో నిల్వ ఉంచిన చక్కెరలో 40 శాతం నష్టపోయినట్లేనన్నారు. యమునా నగర్‌లోని సరస్వతి షుగర్ మిల్లులో సుమారు రూ.97 కోట్ల విలువైన 2.20 లక్షల క్వింటాళ్ల చక్కెర నిల్వలున్నాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత కురిసిన భారీ వర్షంతో.. గోదాంలోకి వరద నీరు పోటెత్తిందని షుగర్ మిల్లు జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా చెప్పారు. ఇలా జరగడం ఇదే తొలిసారని, పూర్తిగా మిల్లు, గోదాం పరిశీలించిన తర్వాతే ఎంత నష్టం వాటిల్లిందన్న సంగతి తెలుస్తుందన్నారు.

లోకం తీరు



నివాసం ఉన్నచోటే ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

» స్పష్టం చేసిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, జూలై 1: ప్రజలు తాము ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్(సీఈసీ) జ్ఞానేష్ కుమార్ మంగళవారం స్పష్టం చేశారు. తమకు సొంత ఇల్లు వేరే చోట ఉందని అక్కడ ఓటరుగా నమోదు చేసుకోకూడదన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాలను ప్రత్యేకంగా ముమ్మర తనిఖీ చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈమేరకు తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రజలు తాము ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారో అక్కడ మాత్రమే ఓటుహక్కు పొందాలని తనను కలిసిన బూత్ స్థాయి అధికారులకు సీఈసీ వివరించారు. ఢిల్లీలో నివాసం ఉంటూ పట్నాలో ఇల్లు ఉందని అక్కడ ఓటుహక్కు పొందలేరని పేర్కొన్నారు. ప్రజలు తాము వలస వెళ్లిన చోట ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, కాని పాత నియోజకవర్గంలో ఓటరు కార్డును ఉంచుకోవడం శిక్షార్హమైన నేరమని ఈసీ అధికారులు తెలిపారు.

సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు

న్యూఢిల్లీ, జూలై 1: సుప్రీంకోర్టు ఉద్యోగాల భర్తీ, పదోన్నతుల్లో తొలిసారిగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల విధానం అమలు చేస్తూ కాంపిటెంట్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానం జూన్ 23 నుంచి అమల్లోకి వచ్చినట్టు జూన్ 24న జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. అభ్యంతరాలు ఉంటే రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) దృష్టికి తీసుకురావాలని ఉద్యోగులను కోరింది. ఉద్యోగాల్లో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 7.5% రిజర్వేషన్లు అమలవుతాయి. రిజిస్ట్రార్, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, జూనియర్ కోర్టు అసిస్టెంట్, ఛాంబర్ అటెండెంట్ల పోస్టులకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

హసన్‌లో హడలెత్తిస్తున్న గుండెపోటు

40 రోజుల్లో 24 మంది మృతి.. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హసన్ జిల్లాలో గుండెపోటు మరణాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గడిచిన 40 రోజుల వ్యవధిలో జిల్లాలో 24 మంది గుండెపోటుతో మృతిచెందారు. తాజాగా మంగళవారం సంజయ్(27) అనే యువకుడు గుండెపోటుతో చనిపోయాడు. హొళెనరసీపుర తాలూకా సోమనహళ్లికి చెందిన సంజయ్, తన మిత్రులతో కలసి పార్టీకి వెళ్లిన సమయంలో సోమవారం సాయంత్రం బీపీ ఎక్కువైంది. ఛాతీలో నొప్పి రావడంతో మిత్రులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అంతలోనే సంజయ్ గుండెపోటుతో మృతి చెందాడు. బీపీ ఎక్కువ కావడమే గుండెపోటుకు కారణమని జయదేవ ఆసుపత్రి మాజీ డైరెక్టర్, ఎంపీ మంజునాథ్ తెలిపారు. మధుమేహం, ఆహారశైలి కూడా దీనికి కారణం కావచ్చునని, ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సమీప ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా, జిల్లాలో వరుసగా గుండెపోటుతో మృతి చెందుతుండడంతో సీఎం సిద్దరామయ్య స్పందించారు. కారణాలను తెలుసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్‌ను ఆదేశించారు. ఆయన నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, పదిరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

మూర్తిదో మాట... ఇన్ఫోసిస్‌ది మరో బాట!

» 70 గంటలు పని చేయాలన్న నారాయణమూర్తి

» ఉద్యోగులు ఓవర్ టైం చేయొద్దంటున్న ఇన్ఫోసిస్

బెంగళూరు, జూలై 1: ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటలు పని చేయాలన్న ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆయన సంస్థ వ్యవహరిస్తోంది. తమ సంస్థలో ఉద్యోగులెవరూ ఓవర్ టైం చేయొద్దని సూచిస్తోంది. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడంతో పాటు వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ ఉద్యోగులకు ఈ-మెయిల్ పంపుతోంది. వారానికి 5 రోజులు చొప్పున రోజుకు సగటున 9.15 గంటలు మాత్రమే పని చేయాలని అందులో స్పష్టం చేసింది. ఓవర్ టైం చేయడం వల్ల ఆరోగ్య పరంగా ఎదురయ్యే ఇబ్బందులపై అందులో ఆందోళన వ్యక్తం చేసింది. పని మధ్యలో క్రమం తప్పకుండా విరామం తీసుకోవాలని, పని ఒత్తిళ్లు, ఇతరత్రా ఇబ్బందులుంటే వారి మేనేజర్‌ను సంప్రదించాలని సూచించింది. అత్యవసరమైతే తప్ప పని గంటల అనంతరం ఉద్యోగానికి సంబంధించిన విధులు నిర్వహించొద్దని పేర్కొంది. నిర్దేశించిన సమయానికి మించి అదనంగా విధులు నిర్వర్తించే ఉద్యోగులకు హెచ్ఆర్ విభాగం నుంచి ఈ మెయిల్‌ను పంపిస్తున్నారు.

కర్ణాటకలో నాయకత్వ మార్పుపై చర్చలు లేవు

» కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో నాయకత్వ మార్పుపై ఎటువంటి చర్చలు లేవని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా అన్నారు. రెండురోజులుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో వేర్వేరుగా సుర్జేవాలా భేటీ అవుతున్నారు. నాయకత్వ మార్పుకే ఈ ప్రక్రియ సాగుతోందనే ప్రచారంపై సుర్జేవాలా మంగళవారం మీడియా సమావేశంలో స్పష్టత ఇచ్చారు. కొంత మంది ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య విభేదాలు తలెత్తాయని, దీనికి కారణాలు తెలుసుకునేందుకే వచ్చానని పేర్కొన్నారు. శాసనసభ్యుల అభిప్రాయ సేకరణ అనేది లేదని కొట్టిపారేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలపై ప్రజల అభిప్రాయం ఎలా ఉందని నియోజకవర్గాలవారీగా తెలుసుకుంటున్నామని, నియోజకవర్గాల్లో సమస్యలు, ఇచ్చిన హామీలలో పెండింగ్ ఉన్నాయా అనే అంశాల గురించి విచారిస్తున్నామని వివరించారు. 5 గ్యారెంటీలు ఎప్పుడూ రద్దు చేయబోమని తేల్చి చెప్పారు.

తొక్కిసలాట ఘటనలో ఐపీఎస్ సస్పెన్షన్ రద్దు

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట ఘటనలో ఐపీఎస్ అధికారి వికాస్ కుమార్‌పై కర్ణాటక ప్రభుత్వం వేసిన సస్పెన్షన్ వేటును సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) రద్దు చేసింది. జూన్ 4న ఆర్సీబీ విజయోత్సవాల సమయంలో చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ దయానంద్‌తోపాటు పలువురు ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, తనను సస్పెండ్ చేయడంపై బెంగళూరు పశ్చిమ అదనపు పోలీస్ కమిషనర్ వికాస్‌కుమార్ క్యాట్‌ను ఆశ్రయించారు. క్యాట్ తీర్పుపై సీఎం సిద్దరామయ్య స్పందించారు. ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని, తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

వాతావరణం అనుకూలించక హైదరాబాద్ విమానం గన్నవరంలో ల్యాండింగ్

విజయవాడ, జూలై 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సిన ఇండిగో విమానం వాతావరణం అనుకూలించక విజయవాడ(గన్నవరం) విమానాశ్రయంలో దిగింది. ఈ విమానం 214 మంది ప్రయాణికులతో బెంగళూరు నుంచి మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు బయలుదేరగా అక్కడ వాతావరణం అనుకూలించలేదు. దీంతో రాత్రి 9.20 గంటలకు విజయవాడలో దిగింది. ముగ్గురు ప్రయాణికులు విజయవాడలో దిగిపోగా, మిగిలినవారితో రాత్రి 9.50 గంటలకు విమానం తిరిగి హైదరాబాద్‌కు పయనమైంది. ఇదిలా ఉండగా, ఎయిర్ ఇండియాకు చెందిన మరో విమానం ఘోర ప్రమాదం నుంచి తప్పింది, ఆ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అహ్మదాబాద్ విమాన ప్రమాదం జరిగిన 38 గంటలలోపే ఆ ఘటన జరిగింది. ఢిల్లీ, వియన్నా మధ్య ప్రయాణిస్తున్న బోయింగ్ 777 విమానం గాల్లోకి ఎగిరిన తర్వాత కొద్దిసేపటికి ఉన్నట్టుండి 900 అడుగులు కిందకి జారిపోయింది. అప్రమత్తమైన సిబ్బంది విమానాన్ని అదుపులోనికి తీసుకొచ్చి మరో పెద్ద ప్రమాదాన్ని నివారించారు. దీనిపై డీజీసీఏ విచారణకు ఆదేశించింది.

థాయ్‌లాండ్ ప్రధానిపై సస్పెన్షన్ వేటు



బ్యాంకాక్, జూలై 1: ఫోన్‌కాల్ లీకైన వ్యవహారంలో థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రాపై సస్పెన్షన్ వేటు పడింది. షినవత్రాను విధుల నుంచి బహిష్కరిస్తూ.. ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దేశ భద్రతకు సంబంధించిన విషయాలను పొరుగుదేశం కాంబోడియా మాజీ ప్రధాని హున్‌సేన్‌తో ఆమె చర్చించడంపై దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. వీరి సంభాషణ లీక్ కావడంతో.. ఆమె రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని, నైతిక ప్రమాణాలు పాటించలేదని ఆరోపిస్తూ పదవి నుంచి తొలగించాలని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. 7-2 మెజార్టీతో ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ తీర్పునిచ్చింది. రాజ్యాంగ తీర్పును సవాల్ చేస్తూ మరో 15 రోజుల్లోగా షినవత్రా తన వాదనలను వినిపించుకోవాల్సి ఉంటుంది.

ఉపాధికి లక్ష కోట్ల ఊతం

రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈఎల్ఐ పథకానికి కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా

» పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించే ఆర్డీఐ పథకానికీ ఓకే

న్యూఢిల్లీ, జూలై 1: వచ్చే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పనకు ఉపకరించే ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి(ఈఎల్ఐ).. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతోపాటు.. 'ఖేలో భారత్ నీతి' పేరిట రూపొందించిన జాతీయ క్రీడా విధానానికి, వ్యూహాత్మక, నూతన రంగాల్లో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రోత్సహించే 'రిసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్(ఆర్డీఐ) పథకానికి పచ్చజెండా ఊపింది. వీటిలో ఈఎల్ఐ పథకానికి కేంద్రం రూ.99,446 కోట్లు కేటాయించింది. వచ్చే రెండేళ్లలో ఈ పథకం ద్వారా లబ్ధి పొందేవారిలో 1.92 కోట్ల మంది మొదటిసారి ఉద్యోగం చేసేవారే ఉంటారని అంచనా. అన్ని రంగాల్లో ఉద్యోగాల సృష్టి, యువతలో నైపుణ్యాల కల్పన, సామాజిక భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తయారీ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. కాగా, ఈ పథకం కింద.. మొదటిసారి ఉద్యోగం చేసేవారు (ఈపీఎఫ్‌లో నమోదైనవారు) రూ.15 వేల గరిష్ఠ పరిమితితో ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని రెండు విడతలుగా (ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకు తొలి విడత, 12నెలల సర్వీస్, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న తర్వాత రెండో విడత మొత్తాన్ని) పొందుతారు. ఆధార్‌తో అనుసంధానమైన చెల్లింపుల విధానం ద్వారా వారికి ఈ మొత్తాన్ని అందజేస్తారు. రూ.లక్ష దాకా జీతం అందుకునే ఉద్యోగులు ఈ ప్రోత్సాహకాన్ని అందుకోవడానికి అర్హులు. ఉద్యోగుల్లో పొదుపు చేసే అలవాటును ప్రోత్సహించేందుకుగాను.. ఈ ప్రోత్సాహకాల్లో కొంత భాగాన్ని నిర్ణీత కాలావధికి డిపాజిట్ చేస్తారు. ఆ కాలపరిమితి పూర్తయ్యాక ఉద్యోగి ఆ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఇక, యాజమాన్యాలకు విషయానికి వస్తే.. ఈ ప్రోత్సాహకాలను అందుకోవడానికి.. 50 మందిలోపు ఉద్యోగులు ఉండి, ఈపీఎఫ్‌వోలో నమోదు చేసుకున్న సంస్థలు ఏడాదికి అదనంగా ఇద్దరు ఉద్యోగులను.. 50 మంది కన్నా ఎక్కువ ఉద్యోగులు ఉండే కంపెనీలు ఏడాదికి అదనంగా ఐదుగురు ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుంది. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 నడుమ అలా అదనపు ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు (రెండేళ్లపాటు) ఈ ప్రోత్సాహకాలు అందుతాయి. కనీసం ఆరు నెలలపాటు ఉద్యోగులను కొనసాగించే యాజమాన్యాలకు.. ప్రతి అదనపు ఉద్యోగికీ ఇచ్చే జీతం ఆధారంగా నెలకు గరిష్ఠంగా రూ.3 వేల చొప్పున రెండేళ్లపాటు ఇస్తారు. ఉద్యోగి వేతనం రూ.10వేల లోపుంటే నెలకు రూ.1000 చొప్పున, జీతం రూ.10వేల నుంచి 20 వేల లోపు ఉంటే నెలకు రూ.2000 చొప్పున, ఉద్యోగి జీతం రూ.20 వేల నుంచి రూ.లక్షలోపు ఉంటే నెలకు రూ.3000 చొప్పున ఈ ప్రోత్సాహకం ఇస్తారు. తయారీరంగంలో అయితే ఈ ప్రోత్సాహకాలను నాలుగేళ్లపాటు ఇస్తారు. ఇక.. నూతన రంగాల్లో పరిశోధనలు, నవకల్పనలకు ఊతమిచ్చేందుకుగాను రూపొందించిన 'రిసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ (ఆర్డీఐ)' పథకాన్ని రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌తో అమలు చేయనున్నారు. పరిశోధనలు, ఆవిష్కరణల్లో ప్రైవేటు రంగం పెట్టుబడులను ప్రోత్సహించడానికి తక్కువ/సున్నా వడ్డీ రేట్లతో దీర్ఘకాల వ్యవధిలో ఫైనాన్సింగ్ అందించడమే ఈ పథకం లక్ష్యం.



కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

వాణిజ్య ఎల్పీజీ ధర రూ.58.5 తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 1: వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19 కేజీల గ్యాస్ బండ ధరను తగ్గిస్తూ ఆయిల్ కంపెనీలు నిర్ణయించాయి. తగ్గింపు ధరలు జూలై 1 నుంచే అమలులోకి వచ్చినట్లు ప్రకటించాయి. ఒక్కో సిలెండరుపై రూ.58.50 తగ్గింది. వాణిజ్య సిలెండర్.. 19 కేజీల బండ ధరను రూ.1,665గా కంపెనీలు నిర్ణయించాయి. తాజాగా వాణిజ్య సిలెండర్ ధర విజయవాడలో రూ.1,818.5 కాగా... హైదరాబాద్‌లో రూ.1,886.5గా ఉంది. కాగా, ఢిల్లీలో జీవిత కాలం ముగిసిన పెట్రోలు, డీజిల్ వాహనాలకు 'ఇంధనం లేదు' అంటూ పెట్రోలు బంకుల్లో బోర్డులను ఏర్పాటు చేశారు.

వాయుసేన రన్‌వేనే అమ్మేశారు!


పంజాబ్‌లోని హల్వారా ఎయిర్‌ఫోర్స్‌లోని 15 ఎకరాలను విక్రయించిన తల్లి, కుమారుడు

న్యూఢిల్లీ, జూలై 1: ఓ సినిమాలో రవీంద్ర భారతి, చార్మినార్ తనదేనని చెబుతూ అమ్మకానికి పెట్టి అమాయకుల నుంచి అందినకాడికి వసూలు చేసుకుంటాడో మోసగాడు! పంజాబ్‌లో అచ్చంగా ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. ఓ మహిళ, ఆమె కుమారుడు కలిసి వాయుసేనకు చెందిన ఓ రన్‌వే స్థలాన్ని తెగనమ్మేశారు! కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ తల్లీకొడుకులు ఈ అక్రమానికి పాల్పడటం పంజాబ్‌లో తీవ్ర సంచలనమైంది. నిందితులు పంజాబ్‌లోని దుమినివాలా గ్రామానికి చెందిన ఉషా అన్సాల్, ఆమె కుమారుడు నవీన్ చంద్! పాక్ సరిహద్దులోని ఫట్టువాలా గ్రామ శివారులో గల రక్షణ శాఖ పరిధిలోని 982 ఎకరాల్లో విస్తరించి ఉన్న 'హల్వారా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్'లోని రన్‌వే స్థలం ఇది! మన మిలటరీకి అత్యంత వ్యూహాత్మక ప్రాంతంగా దీన్ని చెబుతారు. 1939-45 మధ్య రెండో ప్రపంచ యుద్ధంలో ఈ రన్‌వేను బ్రిటిషర్లు ఉపయోగించుకున్నారు. పైగా పొరుగు దేశాలతో 1962, 1965, 1971 జరిగిన యుద్ధాల్లో ఈ రన్‌వేను భారత వాయుసేన అత్యవసర ల్యాండింగ్ కోసం, రక్షణ పరమైన కార్యకలాపాల కోసం ఉపయోగించుకుంది. 1997లో ఉష, నవీన్ కలిసి తప్పుడు పత్రాలు సృష్టించి 15 ఎకరాల మేర విస్తరించి ఉన్న ఈ రన్‌వేను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. అప్పట్లోనే నిషాన్ సింగ్ అనే మాజీ రెవెన్యూ ఉద్యోగి ఫిర్యాదు చేయడంతో ఈ భూ కుంభకోణం వెలుగులోకొచ్చింది. అయితే 2021 వరకు అధికారులు ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఈ భూకుంభకోణంపై మూడేళ్ల క్రితం హల్వారా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారులు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మళ్లీ నిషాన్ సింగే, ఈ భూకుంభకోణంపై పంజాబ్, హరియాణా కోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు.. నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక అందజేయాలంటూ పంజాబ్ విజిలెన్స్ బ్యూరో చీఫ్‌ను ఆదేశించింది. అయితే ఈ ఏడాది మే నెలలోనే ఎయిర్‌ఫోర్స్ భూమిని తిరిగి రక్షణ శాఖకు స్వాధీన పరిచారు.

ప్రాణాలు తీస్తున్న ఒంటరితనం

» కుంగుబాటుకు, ఆత్మహత్య తలంపునకు కారణమవుతున్న ఏకాకి జీవనం

» ప్రతి గంటకూ దాదాపు 100 మంది మృతి



న్యూఢిల్లీ, జూలై 1: చుట్టూ అయినవాళ్లున్నా.. ఏదైనా కష్టం వచ్చినప్పుడు చెప్పుకోవడానికి 'తన' అనుకునేవారు ఒక్కరూ కనిపించని దురదృష్టవంతులు కొందరు! పట్టించుకునేవాళ్లు ఎందరున్నా.. తమను తాము ఒంటరిగా భావించుకునేవారు మరి కొందరు!! పైకి చూడ్డానికి ఇది చాలా చిన్న సమస్యగానే కనిపించవచ్చుగానీ.. ప్రపంచవ్యాప్తంగా ఇది ఒక పెద్ద సమస్యగా మారుతోంది. ఒంటరితనం కుంగుబాటుకు.. ఆపై ఆత్మహత్య ఆలోచనలకు దారితీస్తోంది. ఇలా ఏటా ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది మరణిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన 'కమిషన్ ఆన్ సోషల్ కనెక్షన్' తన తాజా అంతర్జాతీయ నివేదికలో పేర్కొన్న గణాంకాలే ఇందుకు నిదర్శనం. ఆ నివేదిక ప్రకారం..

● ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారు. ఇదే కారణంతో ప్రతి గంటకు దాదాపు 100 మరణాలు.. ఏడాదికి 8.71లక్షల మరణాలు నమోదవుతున్నాయి.

● ఒంటరితనానికి వయసుతో సంబంధం లేదు. దీంతో బాధపడుతున్నవారిలో అన్ని వయసుల వారూ ఉన్నారు. కాకపోతే.. పిల్లలు, వృద్ధులతో పోలిస్తే యువతలో ఈ సంఖ్య ఎక్కువ. వృద్ధుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు, కిశోర ప్రాయంలో ఉన్నవారిలో ప్రతి నలుగురిలో ఒకరు ఒంటరులే.

● ఏకాకి జీవితంతో విసిగిపోతున్నవారి సంఖ్య.. దిగువ, మధ్య ఆదాయ దేశాల్లో ఎక్కువగా ఉంది. అధికాదాయ దేశాల్లో ఒంటరితనం బాధితుల సంఖ్య 11 శాతంగా ఉంటే.. అల్పాదాయ దేశాల్లో ఆ సంఖ్య 24 శాతంగా ఉంది.

● 13 నుంచి 29 ఏళ్లవారిలో ఒంటరితనంతో బాధపడుతున్నవారి సంఖ్య 17 నుంచి 21 శాతంగా ఉంది. టీనేజర్లలో ఈ సమస్య చాలా ఎక్కువ.

విరుగుడు ఏంటి?

ఆరోగ్యం సరిగ్గా లేకపోవడం, ఆదాయం తక్కువగా రావడం, సరైన చదువు లేకపోవడం, ఏకాకి జీవితం.. ఇలా ఒంటరితనానికి పలు కారణాలు ఉంటాయని నివేదిక తెలిపింది. దీనికి విరుగుడు సామాజిక సంబంధాలను పెంచుకోవడమేనని సూచించింది. ఇతరులతో కలవడానికి అసంఖ్యాకమైన అవకాశాలున్న ఈ రోజుల్లో చాలా మంది తమను తాము ఒంటరివ్యక్తులుగా భావించుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ వ్యాఖ్యానించారు. డబ్ల్యూహెచ్‌వో కమిషన్ ఆన్ సోషల్ కనెక్షన్ సహాధ్యక్షుడు డాక్టర్ వివేక్ మూర్తి కూడా.. ఒంటరితనం అనేది ఈ తరం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా అభివర్ణించారు. 'డిజిటల్‌గా అనుసంధానమైన ఈ ప్రపంచంలో.. చాలామంది యువతీయువకులు తమను తాము ఒంటరి వ్యక్తులుగా భావించుకుంటున్నారు. పెరుగుతున్న టెక్నాలజీని మన బలంగా మార్చుకోవాలి తప్ప బలహీనతగా కాదు. అందుకే.. ప్రభుత్వ విధానాలన్నింటిలోనూ సామాజిక అనుసంధానాన్ని తప్పనిసరి చేయాలి' అని వివరించారు.

ఎగిరే రోబో!



» ఇటలీ శాస్త్రవేత్తల తయారీ

» ఐరన్ కబ్-3గా నామకరణం

పారిస్, జూలై 1: ఒకప్పుడు సినిమాలకు, సైన్స్ నవలలకు మాత్రమే పరిమితమైన రోబోలు.. ఇప్పుడు దైనందిన జీవితంలోకి వచ్చేస్తున్నాయి. వాటిని మరింత అభివృద్ధి పరుస్తూ.. ప్రపంచంలోనే తొలిసారిగా ఎగిరే హ్యూమనాయిడ్ రోబోను తయారు చేశారు ఇటలీ శాస్త్రవేత్తలు. ఇటాలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఈ పరిశోధకులు ఐరన్ కబ్-3 పేరుతో ఈ కొత్త తరహా రోబోను రూపొందించారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలో ఈ రోబో భూమి మీది నుంచి 50 సెంటీమీటర్ల ఎత్తుకు ఎగిరి అక్కడే కొద్దిసేపు స్థిరంగా ఉంది. 70 కిలోల బరువు ఉండే ఐరన్ కబ్ ముఖం ఒక చిన్నపిల్లాడిలా ఉంటుంది. అందుకే ఆ పేరు. గాలిలో ఎగరటం కోసం రోబోకు నాలుగు జెట్ ఇంజిన్లు అమర్చారు. రెండు ఇంజిన్లు చేతుల కింద ఉంటే.. మరో రెండు రోబో వెనుక భాగంలో ఉన్న జెట్‌ప్యాక్‌లో ఉంటాయి. ఈ ఇంజిన్ల నుంచి వెలువడే బలమైన ఉద్గారాలే రోబోను పైకి లేపుతాయి. ఉద్గారాల వేడిని తట్టుకోవటానికి వీలుగా ఐరన్ కబ్‌కు టైటానియం 'వెన్నెముక'ను అమర్చారు. రోబోకు తాను ఎక్కడ ఉన్నాననేది తెలియటం కోసం దాంట్లో సెన్సర్లను ఏర్పాటు చేశారు. ఇక రోబో కాళ్లు, చేతులు కదల్చటానికి వీలుగా పరిశోధకులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఆ రోబో తయారీకి రెండేళ్ల సమయం పట్టింది. ఐరన్ కబ్-3ని మరింత అభివృద్ధిపరిచే దిశగా ఇటలీ శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల వేళ సహాయ చర్యల్లో వీటిని ఉపయోగించవచ్చని భావిస్తున్నారు.

మస్క్‌ను అమెరికా నుంచి పంపించేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)



ఉండవు, శాటిలైట్లు ఉండవు, ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తి ఉండదు. ఎలాన్ మస్క్ తన దుకాణం మూసుకుని సొంత ప్రాంతం దక్షిణాఫ్రికాకు తిరిగి వెళ్లిపోవాల్సిందే. అమెరికాకు ఎంతో సంపద మిగులుతుంది" అని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో పోస్టు పెట్టారు. ప్రభుత్వ ఖర్చులను నియంత్రించే 'డోగె' విభాగం ఎలాన్ మస్క్‌కు అందుతున్న సబ్సిడీల వ్యవహారంపై దృష్టిసారించాలని సూచించారు. 'ట్రంప్‌ను దేశం నుంచి వెళ్లగొట్టే ఆలోచన ఏదైనా ఉందా?' అని మీడియా ప్రశ్నించగా.. 'ఇప్పటికైతే తెలియదు. కానీ ఈ అంశంపై మేం దృష్టిపెట్టాల్సి ఉంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. నిజానికి అమెరికా ప్రభుత్వ ఖర్చులను, సబ్సిడీలను తగ్గించేందుకు ఉద్దేశించిన 'బిగ్ బ్యూటీఫుల్ బిల్లు'ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఎలాన్ మస్క్.. దానికి మద్దతిచ్చే ప్రజాప్రతినిధుల పదవులు ఊడగొడతానని ఇంతకుముందే హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ఎలాన్ మస్క్ కంపెనీలు టెస్లా, స్పేస్ ఎక్స్‌లకు అందే సబ్సిడీల అంశాన్ని ట్రంప్ లేవనెత్తారు. దీనిపై ఎలాన్ మస్క్ గట్టిగానే సమాధానమిచ్చారు. "నేను సూటిగా చెబుతున్నాను. వెంటనే సబ్సిడీలన్నింటికీ కోత పెట్టేసుకోండి" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. తాను కొత్త పార్టీ పెట్టబోతున్నానని మరోసారి ప్రకటించారు. "ఇప్పుడు మన దేశం ఏక పార్టీ పాలన ఉంది. అదో పందుల పార్టీ. ఇప్పుడు దేశంలో ప్రజా సంక్షేమాన్ని నిజంగా పట్టించుకునే కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన సమయం ఆసన్నమైంది" అని మస్క్ పేర్కొన్నారు.

ట్రంప్ 'బ్యూటీఫుల్ బిల్లు'కు సెనెట్ ఆమోదం

వాషింగ్టన్, జూలై 1: అమెరికాలో ప్రభుత్వ వ్యయంలో కోత, వివిధ పన్నుల్లో భారీ స్థాయిలో మార్పులు తలపెడుతూ ట్రంప్ యంత్రాంగం రూపొందించిన 'వన్ బిగ్ బ్యూటీఫుల్ బిల్ యాక్ట్'ను అక్కడి చట్టసభ సెనేట్ మంగళవారం ఆమోదించింది. నాటకీయ పరిణామాల మధ్య ఈ బిల్లుకు ఆమోదం లభించింది. తొలుత సెనేట్‌లో దీనికి అనుకూలంగా, వ్యతిరేకంగా 50 చొప్పున ఓట్లు రావడంతో ఉత్కంఠ నెలకొంది. చివరికి ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఓటుతో ఆమోదం లభించడం గమనార్హం. నిజానికి ఈ బిల్లును అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) ఇప్పటికే ఆమోదించింది. కానీ బిల్లులో సెనేట్ సభ్యులు మార్పులు చేసిన నేపథ్యంలో మళ్లీ ప్రతినిధుల సభ ఆమోదించాల్సి ఉంటుంది. ప్రతినిధుల సభ ఆమోదిస్తే.. అధ్యక్షుడి సంతకంతో చట్టం అమల్లోకి వస్తుందని తెలిపాయి. 940 పేజీలతో కూడిన 'బిగ్ బ్యూటీఫుల్ బిల్ చట్టం'లో ట్రంప్ యంత్రాంగం.. ఆహార సబ్సిడీలకు కోత, గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహకాల రద్దు, వలసదారులను స్వదేశాలకు తిప్పిపంపేందుకు కఠిన చర్యలు, విద్యా రుణాల సాయంలో కోతలు, రక్షణ రంగ వ్యయం భారీగా పెంపు, ఆరోగ్య రంగానికి సబ్సిడీల కోత, 'ట్రంప్ సేవింగ్స్' ఖాతాలు, దిగుమతులపై ఆంక్షలు వంటి ఎన్నో అంశాలు ఉన్నాయి. ఈ చట్టం అమల్లోకి వస్తే.. లక్షలాది మంది అమెరికన్లపై ప్రభావం పడుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

కూరగాయల సాగు విస్తీర్ణం పెరగాలి

» అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన



హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నాయని, తెలంగాణకు అవసరమైన కూరగాయలను రాష్ట్రంలోనే పండించే విధంగా రైతులను ప్రోత్సహించాలని సంబధిత అధికారులకు వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కూరగాయల సాగు ప్రణాళిక సిద్ధం చేసి, డిప్యూటీ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారులకు జిల్లాలు కేటాయించి, కలెక్టర్లు, అధికారులతో సమన్వయం చేసుకొని, కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలైన రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, సిద్దిపేట, సంగారెడ్డి, మేడ్చల్‌లలో పెదఎత్తున కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి పామాయిల్ సాగు లక్ష్యాన్ని పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్‌భాషా ఈ సమీక్షలో పాల్గొన్నారు.

వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలిస్తాం

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలిస్తామని, అందులోని ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై సచివాలయంలో మంగళవారం సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించామో లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 8,27,230 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటివరకు 7,98,528 దరఖాస్తులు అంటే 96.53 శాతం భూభారతి పోర్టల్‌లో నమోదు చేసినట్లు అధికారులు వివరించారు.

అధికారులు ఉత్సాహంగా పనిచేయాలి

» ఆర్ అండ్ బీ శాఖపై సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖలో ఎప్పుడూ లేనివిధంగా పదోన్నతులు, బదిలీలను చేసుకున్నామని.. అధికారులు, ఇంజనీర్లు ఉత్సాహంగా పనిచేయాలని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బీ కేంద్ర కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. హ్యామ్ రోడ్లు పది ప్యాకేజీలకు సంబంధించిన పనులను ప్రారంభించేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఈఎన్సీ జయభారతిని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ అండ్ బీ శాఖకు నిధుల విడుదలపై సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఆర్వోబీలు, మెడికల్ కాలేజీలు, టిమ్స్ ఆస్పత్రులు, కలెక్టరేట్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.

విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు



హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లోని విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారుల (డీఎం అండ్ హెచ్‌వో)తో కలెక్టర్లు సమన్వయం చేసుకుని విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్ కార్డులను రూపొందించాలని డిప్యూటీ సీఎం చెప్పారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల పర్యటన, సమీక్షపై పకడ్బందీ క్యాలెండర్‌ను తయారు చేయాలని చెప్పారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లపై నివేదికను రూపొందించాలన్నారు. గురుకుల విద్యాలయాల భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, విద్యుత్తు అవసరాలను తీర్చేందుకు అవసరమైన ప్రణాళికను తయారు చేయాలన్నారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్సీ గురుకుల విద్యాలయాల కార్యదర్శి అలుగు వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూళ్లకు గొప్ప పేరు తేవాలి

» విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి: వాకిటి శ్రీహరి

శామీర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లకు గొప్ప పేరు వచ్చేలా కోచ్‌లు, ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. విద్యార్థులను ప్రపంచస్థాయిలో అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలన్నారు. మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంటలోని రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్‌ను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్) చైర్మన్ శివసేనారెడ్డి, శాట్ ఎండీ, వీసీలతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం మంత్రి, చైర్మన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలను చేశారు. మధ్యాహ్నం క్రీడాకారులతో కలిసి భోజనంచేశారు. అంతకు ముందు స్కూల్‌లోని కిచెన్‌ను మంత్రి పరిశీలించారు. కుళ్లిపోయిన కూరగాయలు, పురుగులు కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ కాంట్రాక్టర్‌ను వెంటనే తొలగించాలని, అతన్ని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు.

4న కాంగ్రెస్ సమ్మేళనానికి ఖర్గే రాక

» విజయవంతానికి అంతా సమష్టిగా కృషి చేయాలి

» పార్టీ నేతలతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్



రంగారెడ్డి అర్బన్/హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుల సమ్మేళనం నిర్వహించనున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సమ్మేళనానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతారని చెప్పారు. మంగళవారం గాంధీ భవన్‌లో చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని, ఖర్గే సందేశాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పార్టీలో భేదాభిప్రాయాలు ఏమైనా ఉంటే పక్కనపెట్టి సభను విజయవంతం చేయాలన్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు. కాగా, ఈ సమ్మేళనం ఏర్పాట్లపై మంగళవారం సీఎం రేవంత్ ప్రజాభవన్‌లో మంత్రులు, మహేష్ గౌడ్‌తో సమీక్ష నిర్వహించారు.

సీఎం నిర్ణయం భేష్: మల్లు రవి

తల్లిదండ్రులను సరిగా చూడని ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లో కోత పెట్టి.. ఆ మొత్తాన్ని నేరుగా తల్లిదండ్రులకు పంపాలని సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. ప్రజాపాలనకు ఇదే నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.1500 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1,500 కోట్ల అప్పు తీసుకుంది. ఆర్‌బీఐ మంగళవారం నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 24 ఏళ్ల కాల పరిమితి, 7.14 శాతం వార్షిక వడ్డీతో రూ.800 కోట్లు, 30 ఏళ్ల కాల పరిమితి, 7.14 శాతం వార్షిక వడ్డీతో రూ.700 కోట్ల చొప్పున ఈ రుణాన్ని తీసుకుంది.

గోదావరి - బనకచర్ల: రాచపుండు రాజేసింది కేసీఆరే

(మొదటి పేజీ తరువాయి)

ఇలాగే కొనసాగితే ఇద్దరి జుట్లు పట్టుకొని ఆడించవచ్చనేదే కేంద్ర ప్రభుత్వ విధానమని అన్నారు. నీటి కేటాయింపులు, హక్కులు కాపాడుకోవడానికి కేంద్రంపై నిరంతరం ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉందన్నారు.



ప్రజా భవన్‌లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, వేదికపై మంత్రులు

11 ఏళ్లుగా బీజేపీ నిర్లక్ష్యం..

"నీటి కేటాయింపులపై 11 ఏళ్లుగా బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నేడు పరోక్షంగా బీఆర్‌ఎస్‌ను బతికించడానికి ప్రయత్నిస్తోంది. దీని వెనుక ప్రధాన పాత్ర కిషన్‌రెడ్డిదే. ఆయన మాట్లాడే ప్రతి మాట కేటీఆర్ ఇంటినుంచి వచ్చే ప్రెస్‌నోట్‌తోనే మాట్లాడతారు. దీనిపై అధికారికంగా ఆరోపణలు చేస్తున్నా. సీఎంగా మీ(కిషన్‌రెడ్డి) ఇంటికొచ్చి కలిశాను. మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా కలిశారు. కలిసినప్పుడు కాగితాలు తీసుకొని.. మేం లేనప్పుడు కేంద్రమంత్రులను కిషన్‌రెడ్డి కలిసి వస్తారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రిని కలవడానికి మేము వెళుతున్నామని చెబితే.. ఢిల్లీలో సమావేశం ఉందని ముందే వెళ్లి ఆ మంత్రిని కలిశారు" అని సీఎం రేవంత్ ఆరోపించారు. కిషన్‌రెడ్డి రహస్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. తాము మెట్రో కోసం వెళ్లినప్పుడు కూడా ముందే వెళ్లి కేంద్ర మంత్రిని కలిశారని, కిషన్‌రెడ్డి తీరు అనుమానం కలిగిస్తోందని అన్నారు. ప్రజలు బీజేపీకి 8 మంది ఎంపీలను ఇచ్చింది రాష్ట్ర హక్కులను కాలరాయడానికి కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. సాంకేతిక వివరాలు, న్యాయపరమైన అంశాలు, రాజకీయ పరమైన విధానంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై, కిషన్‌రెడ్డి వ్యవహార శైలిపై కాంగ్రెస్ నేతలు గ్రామగ్రామాన మాట్లాడాలన్నారు.

కృష్ణా, గోదావరి జలాలు తాకట్టు..

ప్రత్యేక రాష్ట్రంలో పదేళ్లలో ప్రాజెక్టులు కట్టకుండా కృష్ణా, గోదావరి జలాలను తాకట్టు పెట్టారని సీఎం రేవంత్ ఆరోపించారు. "3 వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయంటూ రాచపుండు పెట్టిందే కేసీఆర్. మనం మెదలకుండా ఉంటే.. నిజం గడప దాటేలోపు అబద్ధం ఊరంతా తిరిగి వస్తుంది. ఈ అబద్ధాలను ఎండగట్టాలి. చంద్రశేఖర్‌రావు, హరీశ్‌రావుతోపాటు ఆ కుటుంబమంతా అబద్ధాలనే నమ్ముకున్నారు. అబద్ధాలు చెప్పి బతకడం నేర్చుకున్నారు. ఇన్ని ఆరోపణలు చేస్తున్నారు కదా.. దీనిపై ప్రత్యేక శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేద్దాం. ఒకరోజు కృష్ణా, ఒక రోజు గోదావరి జలాలపై చర్చకు రండి. మీరు ప్రత్యేక సమావేశాల కోసం స్పీకర్‌కు లేఖరాస్తే.. మేము కూడా లేఖ రాస్తాం. గత పదేళ్లలో ఒక్కో జీవో, పేపర్ చదివి వినిపిద్దాం" అని సీఎం అన్నారు. గోదావరి-బనచకర్లకు పర్యావరణ అనుమతిని తిరస్కరించడం కామాయే తప్ప.. ఫుల్‌స్టాప్ కాదని చెప్పారు. "వాళ్లు లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేసి, మళ్లీ పర్యావరణ మంత్రిత్వశాఖకు ఇస్తారు. ఎందుకంటే మోదీ మనుగడ చంద్రబాబు మీద ఉంది. చంద్రబాబు మనుగడ గోదావరి బనకచర్లపై ఉంది. ఇదంతా నదుల అనుసంధానం లెక్కనే. ఇందులో రాజకీయ అనుసంధానం ఉంది" అని రేవంత్ వివరించారు. తెలంగాణలో కడుతున్న ప్రాజెక్టులకు కూడా కేటాయించిన నీటిని పక్కాగా రాసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఇది ఒక్కరోజులో తేలే అంశం కాదని, దీనిని లేవనెత్తాలని, తెలంగాణకు కేసీఆర్ ఏ విధంగా ద్రోహం చేశారో చెప్పాలని అన్నారు. "మన ఉద్దేశాలు, మన ఆలోచనలు కేసీఆర్‌ను తప్పుబట్టాలని కాదు. కేసీఆర్ శాశ్వతం కాదు.. ఆయన సృష్టించిన సమస్యలు కూడా శాశ్వతం కాదు. ప్రాజెక్టులకు నీటి కేటాయింపులే శాశ్వతం. మన హక్కులే శాశ్వతం. కేసీఆర్‌తో పంచాయితీ పెట్టుకునే కంటే.. మన హక్కుల కోసం పోరాడటమే లక్ష్యం కావాలి" అని దిశానిర్దేశం చేశారు.

నికర జలాల ప్రాజెక్టులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?

ఎగువనఉన్న తెలంగాణ వదిలితేనే నీళ్ల వస్తాయని ఏపీ అంటోందని, అలాంటప్పుడు ఎగువ ప్రాంతంలో నికర జలాలపై ప్రాజెక్టులను కడుతుంటే కింద ఉన్న వారు ఎందుకు అభ్యంతరాలు చెబుతున్నారని రేవంత్ ప్రశ్నించారు. "మీరు బ్లాంకెట్‌గా 45 టీఎంసీలు మాకు ఇవ్వాల్సిందే. మైనర్ ఇరిగేషన్‌లో 90 టీఎంసీలకుగాను 45 టీఎంసీలను పొదుపు చేసి, ఆ నీటిని పాలమూరుకు కేటాయించుకున్నాం. దీనికి మీరు అంగీకరించి నిరభ్యంతర పత్రం ఇస్తే పాలమూరు-రంగారెడ్డికి అనుమతులు తెచ్చుకొని లోన్లు తెచ్చుకొని ప్రాజెక్టులు కట్టుకుంటాం. నికర జలాల కేటాయింపులతో ఉన్న ప్రాజెక్టులకు అభ్యంతరం తెలుపుతూ.. మూడో పంటకు నీళ్లివ్వడానికి వరద జలాలను తీసుకెళ్లడానికి తాపయత్రం పడుతున్నారు. మాకు ఒక్క పంటకు కూడా నీళ్లు లేవు. మాకు తాగునీటికీ సమస్యలున్నాయి. మీరు ముందుకొచ్చి సహకరించాలి కదా! ఈ సమస్య చర్చల ద్వారానే పరిష్కారమవుతుంది" అని సీఎం రేవంత్ అన్నారు.

కిషన్‌రెడ్డిది దింపుడు కల్లం ఆశ..

నీటి కేటాయింపుల బాధ్యతను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు తీసుకోరని సీఎం ప్రశ్నించారు. "సీఆర్ పాటిల్‌కు ఉన్న హోదానే కిషన్‌రెడ్డికి ఉంది. నీటి కేటాయింపులపై మాట్లాడాలని అధికారులను కిషన్‌రెడ్డి దగ్గరికి పంపించాం. ఏపీకి చెందిన కేంద్రమంత్రులు ప్రతి మంత్రి దగ్గరకి పోతున్నరు. తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డికి ఎందుకు పట్టింపులేదు? ఈ వివాదాన్ని పెంచి పోషిస్తే.. మళ్లీ బీఆర్‌ఎస్ బతుకుతుందని, అప్పుడు రాజకీయంగా తమకు ప్రయోజనం ఉంటుందని, తద్వారా కాంగ్రెస్‌ను మార్జినలైజ్ చేయవచ్చనేది వీరి (బీజేపీ) విధానం. రాజకీయ మనుగడ కోసమే వారి తాపత్రయం. అంతరించిపోతున్న బీఆర్‌ఎస్‌ను పునరుజ్జీవింపజేయడానికి జరుగుతున్న ప్రయత్నం ఇది. దింపుడు కల్లం ఆశతో నదీ జలాలను అడ్డంపెట్టుకొని.. దీన్ని వివాదంగా చేసి, మన మీద బురద జల్లి, దోషులుగా నిలబెట్టి రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నరు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించాలి" అని సీఎం సూచించారు.

రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు.. ప్రధాని వద్దకు తీసుకెళ్లాలి

"బీజేపీ నూతన అధ్యక్షుడు రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతూనే గోదావరి నది జలాల సమస్యను ప్రధానమంత్రి దగ్గరికి తీసుకెళ్లాలని కోరుతున్నా. దీన్ని మొట్టమొదటి కార్యాచరణగా పెట్టుకోండి" అని రేవంత్ అన్నారు. కాగా, కృష్ణా, గోదావరిపై గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన నిర్లక్ష్యం, వైఫల్యం, అసమర్థత, కక్కుర్తి వల్లే ఈ సమస్యలు వచ్చాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బనకచర్లతో గోదావరి నదిపై తెలంగాణ హక్కులు కోల్పోతామనేది ప్రధాన అభ్యంతరమని, దీనికి వ్యతిరేకంగా గోదావరి బోర్డు నుంచి కేంద్ర జలశక్తి శాఖకు ఫిర్యాదులు చేశామని తెలిపారు. బీఆర్‌ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఒక్క చుక్క నీటిపై కూడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నవారు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సీఎంగా ఉనప్పుడే గోదావరి జలాలను రాయలసీమకు తరలించాలనే నిర్ణయం చంద్రబాబు తీసుకున్నారని తెలిపారు. గోదావరి, కృష్ణా జలాలను పెన్నాకు తరలించడానికి 2019 జూన్ 28న, ఆగస్టు 2న, సెప్టెంబరు 23న వరుసగా జగన్‌తో సమావేశాలు జరిగాయని, చర్చలే కాకుండా ఆ దిశలో చాలా ముందుకెళ్లారని మంత్రి ఉత్తమ్ వివరించారు. బేసిన్లు లేవు.. బేషజాలు లేవు అనేది నీటి వాటాపై పోరాటాల మూల సూత్రాలకు వ్యతిరేకమన్నారు. నీటి విషయంలో కేసీఆర్, జగన్‌ల సమావేశం మోసం చేయడానికే జరిగిందని ఆరోపించారు. గోదావరి-బనకచర్లకు పర్యావరణ అనుమతి రాకుండా తాము అడ్డుకున్నామని తెలిపారు. కాగా, గోదావరి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్య ప్రసాద్ ఇవ్వగా.. కృష్ణాపై డీఈఈ వెంకట నారాయణ వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రతిపాదనతోనే గోదావరి-బనకచర్ల

2016 సెప్టెంబరు 21న ఉమాభారతి నేతృత్వంలో జరిగిన భేటీ కేసీఆర్ చేసిన ప్రతిపాదనల ఫలితంగా.. ఆ సమావేశపు పేజీలను చంద్రబాబు దుమ్ము దులిపి గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రతిపాదించారని సీఎం రేవంత్ అన్నారు. ఆ సమావేశపు మినిట్స్ 8 పేజీలు ఉంటే.. అందులో 6వ పేజీ, రెండో పేరాలో కేసీఆర్ అన్నమాటలను రేవంత్ ఉటంకించారు. 'కృష్ణా బేసిన్‌కు 1000 టీఎంసీలు కావాలి. గోదావరిలో 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయి. వాటిని వాడుకోవడానికి ప్రాజెక్టులు చేపట్టాలి' అని కేసీఆర్ ప్రతిపాదించిన విషయాన్ని రేవంత్ గుర్తు చేశారు. "కేసీఆర్‌కు ఏ దేవుడు చెప్పిండో.. ఏటా 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని, లేని ఏకు పెట్టి, రాచపుండు పెట్టారు. ఆ రాచపుండుతోనే రాయలసీమకు గోదావరి జలాలను తరలించే ప్రాజెక్టుకు డీపీఆర్ సిద్ధం చేయాలని చంద్రబాబునాయుడు వ్యాప్కోస్‌కు 2016లో బాధ్యతలు అప్పగించారు. చంద్రబాబు అధికారంలో ఉన్న తొలిదశలోనే 2016-2019 దాకా కేసీఆర్ వ్యతిరేకించలేదు. 2019లో జగన్ రాగానే. మంచి భోజనం పెట్టి, పవర్ పాయింట్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి వారికి గోదావరి జలాలను తరలించడం నేర్పారు" అని రేవంత్ వివరించారు. తొమ్మిదిన్నరేళ్లు నీటిపారుదల శాఖలు నిర్వహించిన హరీశ్‌రావు, కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకు గుదిబండగా మారాయని ఆరోపించారు. "811 టీఎంసీల కేటాయింపులు ఉమ్మడి ఏపీకి ఉన్నాయి. వీటిని ఏ విధంగా వాడుకోవాలనే దానిపై 2015లో చర్చ జరిగితే.. 512 టీఎంసీలు ఏపీకి, 299 టీఎంసీలు తెలంగాణకు చాలునంటూ సంతకాలు చేశారు. ఇది తెలంగాణ రైతాంగం పాలిట మరణశాసనంగా మారింది. కృష్ణాలో పరివాహక ప్రాంతం 68 శాతం తెలంగాణలో ఉంది. 32 శాతం ఏపీలో ఉంది. దీని ప్రకారమే కేటాయింపులు జరగాలి. 555 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా ట్రైబ్యునల్‌ను కోరుతున్నాం" అని అన్నారు.

రాగి సంకటి, రొయ్యల పులుసుకే గోదావరి జలాలు ఇచ్చారు..

కృష్ణా, గోదావరి ప్రాజెక్టులన్నింటి నీటి కేటాయింపులు, వివాదాలు పరిష్కారమైతేనే మిగులు జలాల లెక్క తేలుతుందని రేవంత్ స్పష్టం చేశారు. "సముద్రంలోకి వెళుతున్న నీటిని తాము తీసుకెళుతున్నామని, చంద్రశేఖరరావు 2014-2023 దాకా తమకు సహకారం అందించారని, రాగి సంకటి, రొయ్యల పులుసుకే నీళ్ల తీసుకోవడానికి వీలు కల్పించారని వారు (ఏపీ) చెబుతున్నారు. ఇప్పుడు ఉత్తమ్, రేవంత్‌రెడ్డి ఎందుకు అడ్డం పడుతున్నారనేది వారి బాధ. మాకు రాగి సంకటితో పనిలేదు. తెలంగాణ హక్కులతోనే సంబంధం ఉంది. వ్యక్తులు ఎవరికైనా పరిచయం ఉన్నంత మాత్రాన రాష్ట్రాల హక్కులు తాకట్టుపెడతామా? ఎక్కడ కొట్లాడాలో అక్కడ కొట్లాడుతాం" అని సీఎం చెప్పారు. బీఆర్‌ఎస్ ధన దాహం తీర్చుకోవడానికి ప్రాజెక్టుల పేరు, ఊరు, అంచనాలు కూడా మార్చిందని ఆరోపించారు. "2007-08లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టారు. 160 టీఎంసీల నీటిని తరలించి, 16 లక్షల ఎకరాలకు నీళ్లివ్వడానికి ఈ ప్రాజెక్టును చేపట్టి 2014 నాటికే రూ.10 వేల కోట్ల పనులు పూర్తి చేశారు. కానీ, తెలంగాణ వచ్చిన తర్వాత ప్రాజెక్టుల రీ ఇంజనీరింగ్ పేరిట గ్రావిటీతో నీళ్లిచ్చే ప్రాజెక్టులను మార్చేశారు. రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రీ ఇంజనీరింగ్ పేరుతో కాళేశ్వరంగా మార్చి రూ.1.50 లక్షల కోట్లకు చేర్చారు. తుమ్మిడిహెట్టి వద్ద కట్టాల్సిన ప్రాజెక్టు మేడిగడ్డకు చేరింది. ప్రాజెక్టు పరిపూర్ణం కావాలంటే ఇంకా రూ.50 వేల కోట్ల పనులు చేయాల్సి ఉంది. రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టి 50 వేల ఎకరాలకు కూడా నీళ్లివ్వలేదు" అని ముఖ్యమంత్రి అన్నారు.

రేవంత్‌రెడ్డీ.. చెరువుల్లో కట్టిన మీ నేతల ఇళ్లు కనబడటం లేదా?

» తెలంగాణలో అప్రకటిత ఎమర్జెన్సీ

రాహుల్ గాంధీకి కనబడటం లేదా?: కేటీఆర్

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): "చెరువుల పరిసరాల్లో ఇళ్లు కట్టారంటూ పేదల ఇళ్లు కూలుస్తున్న నీకు.. అదే చెరువుల్లో మీ పార్టీ నేతలు అక్రమంగా కట్టిన భవంతులు కనబడటం లేదా.. మిస్టర్ రేవంత్‌రెడ్డి.." అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. "కొడంగల్‌లో రెడ్డికుంటని పూడ్చేసి.. నువ్ మహల్ కట్టొచ్చు.. మీ అన్న తిరుపతిరెడ్డికి దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు ఉండొచ్చు.. మీ రెవెన్యూ మంత్రి హిమాయత్ సాగర్‌లో ప్యాలెస్‌లు కట్టొచ్చు.. మీ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి చెరువు నడుమ గెస్ట్‌హౌస్, బఫర్ జోన్‌లో కేవీపీలాంటి పెద్దలు గెస్ట్ హౌసులు కట్టుకుంటే కనబడటం లేదా? పెద్ద బిల్డర్లు మీకు లంచం ఇచ్చి మూసి నదిలోనే అపార్ట్‌మెంట్లు కట్టుకుంటే.. అవి మీకు కనబడవు.. తమ ఇళ్లు కూల్చొద్దని, హైకోర్టు స్టే ఆర్డర్ ఉందని నిరుపేదలు నెత్తినోరు మొత్తుకున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కనికరం చూపకపోవడం దుర్మార్గం" అని కేటీఆర్ మండిపడ్డారు. రాజ్యాంగం చేతిలో పట్టుకొని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే రాహుల్‌గాంధీకి తెలంగాణలో అమలవుతున్న అప్రకటిత ఎమర్జెన్సీ కనబడటం లేదా? అని ప్రశ్నించారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తామని, కాంగ్రెస్ హామీల అమలుకు నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజలను అయోమయంలో పడేసేందుకు కేసీఆర్‌ను తిట్టాలి.. చంద్రబాబును కాపాడాలి.. ఇదే సీఎం రేవంత్‌రెడ్డి వ్యూహమని మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు బనకచర్ల ప్రతిపాదనే లేదని, కేంద్రం బనకచర్లకు పర్యావరణ అనుమతులు నిరాకరించడం బీఆర్‌ఎస్ సాధించిన విజయమని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో బనకచర్ల ఊసేలేదు

» అవగాహన లేని సీఎం ఉండటం తెలంగాణ దౌర్భాగ్యం

» కాంగ్రెస్‌ను మేమే నిద్రలేపాం : మాజీ మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదిన్నరేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రస్తావనేరాని బనకచర్ల ప్రాజెక్టు, ఇప్పుడు ఎవరి అండ చూసుకుని ముందుకు వచ్చిందో తెలంగాణ ప్రజలకు తెలియదా? అని మాజీ మంత్రి హరీశ్‌రావు నిలదీశారు. తమ హయాంలోనే ప్రాజెక్టుకు సహకరించామంటూ సీఎం చెబుతున్నవన్నీ అబద్ధాలేనని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమైతే.. కాంగ్రెస్‌ను నిద్రలేపింది తామేనని, బీఆర్‌ఎస్ చేసిన పోరాటం వల్లే బనకచర్లకు పర్యావరణ అనుమతులు లభించలేదని మంగళవారం ఎక్స్‌వేదికగా ఆయన తెలిపారు. రాష్ట్ర సాగు నీటి ప్రయోజనాల దృష్ట్యా.. అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేయాలని సీఎం ఎందుకు డిమాండ్ చేయడంలేదని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు పట్ల రేవంత్‌రెడ్డి చూపుతున్న గురు భక్తికి ఇది నిదర్శనం కాదా?.. దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాగు నీటి వనరులు, నదీజలాల వాటాపై కనీస అవగాహన లేని వారు ముఖ్యమంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజల దౌర్భాగ్యమని పేర్కొన్నారు. అందాల పోటీల కోసం తరచూ రివ్యూలుపెట్టిన సీఎం యూరియా సరఫరాపై ఒక్కసారి సమీక్షించినా.. ఇప్పుడు యూరియా కొరత వచ్చేది కాదన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఆధారంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని మూడు బడ్జెట్ ప్రసంగాల్లోనూ (ఓటాన్ అకౌంట్‌తో సహా) చెప్పారని.. కానీ రూపాయి కూడా విదల్చలేదని చెప్పారు. 'పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చడం దుర్మార్గమని, రేవంత్‌రెడ్డి సాగిస్తున్న ఈ అరాచకాన్ని ఆపలేరా? మీనాక్షీ నటరాజన్' అంటూ.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు ప్రశ్నించారు. కోర్టు స్టే ఉన్నా.. ఇళ్ల కూల్చివేతకు పాల్పడటం న్యాయవ్యవస్థను అవమానించడమేనన్నారు. ఉత్తరప్రదేశ్ తరహా 'బుల్డోజర్‌పాలన'ను తెలంగాణలో నడపొద్దని రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. తెలంగాణ సీఎంను రాజ్యాంగ విలువలకు, కాంగ్రెస్ చెబుతున్న సిద్ధాంతాలకు లోబడి నడుచుకునేలా ఆదేశించాలని మీనాక్షిని ఆయన కోరారు.



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం

» పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం

అమీర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బల్కంపేటలో కొలువై ఉన్న ఎల్లమ్మ అమ్మవారి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు మంగళ వాయిద్యాల నడుమ పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 11.51 గంటలకు ఉత్తర నక్షత్రయుక్త అభిజిత్‌లగ్న సుముహూర్తాన వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణం వైభవంగా జరిగింది. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దానం నాగేందర్, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి తదితర ప్రముఖులతోపాటు పెద్దసంఖ్యలో భక్తులు ఈ వేడుకలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టుల మృతి

చర్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఒడిసాలోని కందమాల్ జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి రెండు తుపాకులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. సుకలాడ అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్టు సమాచారం అందడంతో బలగాలు అడవుల్లో గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మావోయిస్టులు, బలగాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అనంతరం ఘటనా స్థలంలో గాలించగా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు లభించినట్టు పోలీసులు తెలిపారు. మృతులను మంకు, చందన్‌గా గుర్తించగా.. వీరిద్దరూ మావోయిస్టు పార్టీలో కేకేబీఎన్ డివిజన్ కమిటీ సభ్యులని తెలిపారు.

దేవాదాయ శాఖలో సొమ్మొకరిది... సోకొకరిది!

» అధికారుల విలాసాలకు ఏసీలు, కూలర్ల కొనుగోళ్లకు ప్రతిపాదనలు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో అధికారుల తీరు ఇష్టారాజ్యంగా మారింది. తాజాగా అధికారులు తీసుకున్న మరో నిర్ణయం వివాదాస్పదంగా మారింది. అర్చక, ఉద్యోగులు, వారి కుటుంబం సంక్షేమానికి మాత్రమే ఉపయోగించాల్సిన వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు నిధుల్ని ప్రధాన కార్యాలయంలో ఏసీలు, కూలర్లు కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇది తగదని కొందరు అధికారులు వారించడంతో విషయం తాత్కాలికంగా వాయిదా పడింది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ వాటాగా వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డుకు రూ. 69 కోట్ల నిధులు జమయ్యాయి. ఈ మొత్తానికి బ్యాంకు వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ. 240 కోట్లు వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డు ఖాతాలో ఉన్నాయి. దేవాదాయ శాఖ నూతన డైరెక్టర్ వచ్చిన తర్వాత 28 మంది ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కొద్ది రోజుల క్రితం రూ.33 లక్షల ఆర్థిక సహాయం మంత్రి చేతుల మీదుగా అందించారు. నిబంధనల ప్రకారం ట్రస్ట్ బోర్డు నిధులు ఉద్యోగుల సంక్షేమం కోసం, పదవీ విరమణ అనంతరం వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు మాత్రమే ఉపయోగిస్తారు.

టీజీఎస్‌డీఎంఏ పునర్వ్యవస్థీకరణ

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ(టీజీఎస్‌డీఎంఏ)ను పునర్‌వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. 2015లో తొలిసారి ఏర్పడిన టీజీఎస్‌డీఎంఏను పునర్ వ్యవస్థీకరిస్తున్నట్లు విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చైర్మన్‌గా, 10 మంది సభ్యులతో టీజీఎస్‌డీఎంఏ పని చేస్తుంది. రెవెన్యూ, హోం, ఆర్థిక, ఆర్‌అండ్‌బీ, వైద్య, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా, విపత్తుల నిర్వహణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రాధికార సంస్థ సీఈవోగా, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు.


పేలుడు దాటికి కుప్పకూలిన పరిశ్రమలోని భవనాలు, శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం


ఫ్యాక్టరీ ఎదుట మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు

మాంసపు ముద్దలు

బూడిద కుప్పలు

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రానికి మరో 16 మృతదేహాలను వెలికితీశారు. మరోవైపు.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారిలో ఐదుగురు చనిపోయినట్లు తెలిసింది. తీవ్రగాయాలతో ఆస్పత్రుల్లో ఉన్న 30 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా.. మరో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ఇక.. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడున్నవారిలో 14 మంది ఆచూకీ మంగళవారం సాయంత్రం వరకూ తెలియరాలేదు. వారిలో ఐదుగురి మృతదేహాలను అర్ధరాత్రి సమయానికి గుర్తించినట్లు సమాచారం. మిగిలిన 9 మంది ఆచూకీ ఇంకా తెలియకపోవడం.. ఆస్పత్రుల్లో ఉన్న పలువురి పరిస్థితి విషమంగా ఉండడంతో.. మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా.. పరిశ్రమలో పేలుడు తీవ్రతకు కూలిన మూడంతస్తుల భవనం శిథిలాలు తొలగించిన కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా.. ప్రమాదస్థలికి సమీపంలో ఎక్కడ చూసినా మాంసపు ముద్దలు.. బూడిదకుప్పలే కనిపిస్తున్నాయి. ఇప్పటిదాకా దొరికిన మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. వాటిలో ఇప్పటిదాకా 13 మృతదేహాలను గుర్తించగా.. మిగతా మృతదేహాలు ఎవరివో గుర్తించాల్సి ఉంది. గుర్తించలేనంతగా కాలిపోవడంతో ఏ మృతదేహం ఎవరిదో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో అన్ని మృతదేహాలకూ పోస్టుమార్టంతోపాటు డీఎన్ఏ పరీక్షలూ నిర్వహిస్తున్నారు. కాగా, పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీ గోడలు కూలి, మంటల్లో చిక్కుకొని కాలిన గాయాలతో చనిపోయినవారిని వారి కుటుంబసభ్యులు గుర్తించగలిగారు. కానీ.. ప్రమాద స్థలానికి సమీపంలో విధులు నిర్వర్తిస్తూ.. పేలుడు ధాటికి మాంసపు ముద్దలుగా మారిన వారిని మాత్రం గుర్తించలేని పరిస్థితి. వారిలో కొందరి మృతదేహాలు పూర్తిగా కాలి బూడిదకుప్పలుగా మారినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో.. ఫోరెన్సిక్ నిపుణులు మంగళవారం ఘటనాస్థలికి చేరుకుని దాదాపు 4 గంటలపాటు శ్రమించి.. పేలుడు జరిగిన ప్రదేశంలో ఉన్న ఎముకలు, దంతాలు, ఇతర నమూనాలు సేకరించారు. ఎముకలు, దంతాలతోపాటు బూడిదను కూడా కవర్లలో సేకరించినట్టుగా తెలుస్తున్నది.

గల్లంతైనవారు ఎక్కడ?

ప్రమాద సమయంలో పరిశ్రమలోని అన్ని విభాగాల్లో 143 మంది ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఇందులో 58 మంది సురక్షితంగా ఉన్నారని ప్రకటించారు. 46 మంది చనిపోతే 30 మంది ఆస్పత్రుల్లో ఉన్నారు. ఈ లెక్కన మరో 9 మంది ఆచూకీ తెలియాల్సి ఉంది. వారి మృతదేహాలు కూడా శిథిలాల కిందే ఉన్నాయా? అనే విషయంపై స్పష్టత రావడం లేదు. దీంతో.. గల్లంతైన తమవారి ఆచూకీ చెప్పాలంటూ వారి బంధువులు అధికారులను వేడుకుంటున్నారు. మృతదేహాల కోసం గాలింపు కొనసాగుతుండడంతో.. రెండు రోజులుగా పరిశ్రమ పరిసరాల్లోనే పడిగాపులు కాస్తున్నారు. కాగా.. ఈ ప్రమాదంలో మరణించినవారిలో ఇప్పటిదాకా 13 మందిని గుర్తించిన అధికారులు.. వారి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. దాంతోపాటు తక్షణ సాయంగా ఒక్కొక్క కుటుంబానికీ రూ.లక్ష చొప్పున.. రూ.13లక్షలను సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య అందజేశారు. క్షతగాత్రుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఇచ్చారు. వారు స్వస్థలాలకు వెళ్లడానికి అధికారులే అంబులెన్సులు ఏర్పాటు చేశారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న మృతుల కుటంబసభ్యులు

ప్రమాద స్థలంలో కాంట్రాక్టు కార్మికులు?

సోమవారమే విధుల్లోకి.. ఒక గదిలో వారి సెల్‌ఫోన్లు లభ్యం

నిజమైతే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

సంగారెడ్డి ప్రతినిధి, ఆంధ్రజ్యోతి, జూలై 1: సిగాచి రసాయన పరిశ్రమ ప్రమాదంలో మరో అంశం ఆలస్యంగా తెరమీదకు వచ్చింది. ప్రమాద సమయంలో రెగ్యులర్‌గా పనిచేసే సిబ్బంది, కార్మికుల లెక్క 143 మంది అని తేలింది. అయితే, సోమవారం ఫ్యాక్టరీలో అదనపు పని ఉన్నందున మరికొంత మంది కాంట్రాక్టు కార్మికులను సైతం విధులకు పిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. కాంట్రాక్టు లేబర్లు కావడంతో వీరికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయరని తెలిసింది. వీరి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను మాత్రం ఓ గదిలో భద్రపరిచారని సమాచారం. తాజాగా సెల్‌ఫోన్లు కూడా బయట పడడంతో ఇవి కాంట్రాక్టు కార్మికులకు చెందినవేనని చర్చ నడుస్తోంది. సంస్థ రెగ్యులర్ ఉద్యోగులు, కార్మికుల ఫోన్లు వారి వద్దనే ఉంటాయని, కాంట్రాక్టు లేబర్లవి మాత్రం పని వేళల్లో స్వాధీనం చేసుకుంటారని తెలుస్తోంది. అదనపు పనులు ఉన్న సమయంలో సాధారణంగా కాంట్రాక్టు కార్మికులను పిలుస్తారని చెబుతున్నారు. ఒకవేళ కాంట్రాక్టు కార్మికులు వచ్చి ఉంటే శిథిలాల కింద గల్లంతయ్యారా లేక బయటకు వెళ్లిపోయారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఉన్న సెల్ ఫోన్ల సంఖ్యను బట్టి ఎంత మంది వచ్చారు? సెల్‌ఫోన్లు కాంట్రాక్టు కార్మికులవేనా? అని అధికారులు ఆరా తీస్తున్నారు. సోమవారం పనులకు కాంట్రాక్టు కార్మికులు కనుక హాజరైతే మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

స్ప్రేయర్ డ్రయర్‌లో ఒత్తిడితోనే పేలుడు?

సిగాచీ పరిశ్రమలో పేలుడు సంభవించడానికి.. భద్రతా నిర్వహణ లోపాలే కారణమన్న అనుమానాలు బలపడుతున్నాయి. పరిశ్రమలోని స్ప్రేయర్ డ్రయర్‌లో అధిక ఉష్ణోగ్రతలను నియంత్రించే సేఫ్టీవాల్వ్, బ్లోయర్ హ్యాండ్లర్ అనే పరికరాలు పనిచేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. మైక్రోక్రిస్టల్ సెల్యులోజ్ డ్రయింగ్ యూనిట్ (ఎంసీసీ) డ్రయర్‌లో 700 నుంచి 800డిగ్రీల ఉష్ణోగ్రత వెలువడుతుందని.. ఆ అధిక ఉష్ణోగ్రతలను నియంత్రించే బ్లోయర్ హ్యాండ్లర్ పనిచేయకపోతే పేలుడు సంభవిస్తుందని రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో డ్రయర్ యూనిట్ వద్దే భారీగా ప్రాణనష్టం సంభవించగా.. పరిశ్రమలోని ఇతర రియాక్టర్లు చెక్కుచెదరలేదు.

అక్కడే ప్రేమించుకుని.. అక్కడే కన్నుమూసి..


నిఖిల్‌రెడ్డి, రమ్యశ్రీ పెళ్లి ఫొటో (ఫైల్)

రామచంద్రాపురం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి)/విజయవాడ (తిరువూరు, విస్సన్నపేట), ముద్దనూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ అదే కంపెనీలో పనిచేస్తున్నారు.. ఒకరికొకరు ఇష్టపడ్డారు.. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో ప్రేమపెళ్లి చేసుకున్నారు.. పెద్దలూ అంగీకరించి, ఘనంగా వివాహం చేసేందుకూ సిద్ధమయ్యారు. కానీ విధి వారిపై పగబట్టింది. సోమవారం సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరూ కన్నుమూశారు. ఏపీలోని కడప జిల్లా పెనికెలపాడు గ్రామానికి చెందిన రైతు ప్రసాద్‌రెడ్డి పెద్ద కుమారుడు నిఖిల్‌రెడ్డి (33), ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలం పుత్రాలకు శ్రీరమ్య (23) ఇద్దరూ సిగాచి పరిశ్రమలో పనిచేస్తూనే ప్రేమలో పడ్డారు. కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో తిరుపతిలో వివాహం చేసుకున్నారు. తర్వాత వారు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌రావును ఆశ్రయించగా.. ఇరువర్గాల పెద్దలతో మాట్లాడి నచ్చజెప్పారు. కొత్త వస్త్రాలు పెట్టి ఆశీర్వదించారు. ఆషాఢ మాసం వెళ్లిన తర్వాత ఘనంగా రిసెప్షన్ జరపాలని ఇరువురి కుటుంబాలు నిర్ణయించాయి. కానీ సుగాచి దుర్ఘటనలో ఇద్దరూ మృత్యువాతపడ్డారు. వారి ఆచూకీ కోసం ఎమ్మెల్యే శ్రీనివాసరావు స్వయంగా పరిశ్రమ వద్దకు వచ్చి వాకబు చేశారు. తమవారి మృతదేహాల కోసం ఇద్దరి కుటుంబ సభ్యులు కన్నీళ్లతో ఎదురుచూస్తున్నారు. నిజానికి రమ్యశ్రీ ఉదయం పది గంటలకు మొదలయ్యే షిఫ్టుకు వెళ్లాల్సి ఉందని, కానీ సోమవారం ఉదయం ఐదు గంటల షిఫ్టుకే హాజరైందని తోటి ఉద్యోగులు తెలిపారు. నిఖిల్ కూడా నైట్ షిఫ్టులోనే ఉన్నారని.. ప్రమాదంలో ఇద్దరూ కన్నుమూశారని ఆవేదన వ్యక్తం చేశారు.

మూడు రోజుల క్రితమే ఉద్యోగంలో చేరి..


జస్టిన్ ఫొటోతో తండ్రి రామ్‌దాస్

పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన జస్టిన్ మూడు రోజుల క్రితమే సిగాచి పరిశ్రమలో ఉద్యోగంలో చేరారు. మంచి ఉద్యోగం దొరికిందని ఆ యువకుడి కుటుంబం ఎంతో సంతోషపడింది. కానీ ఆ ఆనందం ఆవిరైపోయింది. సోమవారం ఉదయం పరిశ్రమలో విధులకు వచ్చిన జస్టిన్ ఆచూకీ ఇప్పటివరకు లభించలేదు. ఆయన తండ్రి రామ్‌దాస్ తన కుమారుడి ఫొటో పట్టుకుని ఆచూకీ కోసం కన్నీళ్లతో వేడుకుంటున్నారు. సమీప బంధువు సహకారంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.



మృతుల్లో మంచిర్యాల జిల్లావాసి

ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మరో వ్యక్తి కూడా!

దండేపల్లి జూలై 1 (ఆంధ్రజ్యోతి): సిగాచి రసాయన పరిశ్రమలో సోమవారం జరిగిన భారీ పేలుడులో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండల కేంద్రానికి చెందిన వజ్రకేసర నాగేశ్వర్‌రావు అలియాస్ రాజు(52) దుర్మరణం పాలయ్యారు. ఆయన పదేళ్లుగా సిగాచి ఫ్యాక్టరీలో కెమికల్ ల్యాబ్‌లో క్వాలిటి సెల్ విభాగంలో పని చేస్తున్నారు. అధికారులు ఆయన మృతదేహాన్ని మంగళవారం ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాగేశ్వర్‌రావుకు భార్య హేమలత, తల్లి, ఇద్దరు కొడుకులు ఉన్నారు. బుధవారం దండేపల్లిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా.. ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన హేమంత్‌సుందర్ (45) ఈ ప్రమాదంలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు.

ఎండీ ఎక్కడ?.. స్థానికుల ఆగ్రహం

ప్రొడక్షన్ ప్లాంట్‌పై అంతస్తులో క్యూసీ విభాగం.. మృతుల్లో ఎక్కువ మంది ఆ విభాగం వారే

పటాన్‌చెరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో ఇంత ఘోరం జరిగినా.. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చిదంబర నాథ్ రెండు రోజులుగా అక్కడికి రాకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయనపై ఇప్పటిదాకా కేసు నమోదు చేయకపోవడం ఏంటని మండిపడుతున్నారు. అయితే.. 75 సంవత్సరాలకు పైగా వయసున్న ఎండీ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని.. అందుకే ఆయన రాలేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. కాగా.. స్థానిక ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ సరిగ్గా తనిఖీలు చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదంటూ ఆయనపైన కూడా పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రొడక్షన్ ప్లాంట్ పై అంతస్తులో క్యూసీ (నాణ్యత తనిఖీ) విభాగాన్ని ఏర్పాటు చేయడాన్ని కూడా స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉదయం 9 గంటల జనరల్ షిఫ్టుకి వచ్చే సిబ్బందిలో ఎక్కువశాతం క్యూసీలో పనిచేసేవారే. వారికి ఉత్పత్తికి ఎలాంటి సంబంధమూ ఉండదు. కానీ.. ఈ ప్రమాదంలో ఎక్కువగా వారే చనిపోయారు. క్యూసీ సిబ్బంది అంతా బస్సు దిగి.. లోపలికి వెళ్లిన కొద్ది నిమిషాలకే ఈ భారీ పేలుడు చోటు చేసుకోవడంతో వారే ఎక్కువగా ప్రాణాలు కోల్పోయారు. ఇక.. ఈ పరిశ్రమలో ప్లాంట్ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్ అయిన ఇలంగోవన్ (తమిళనాడువాసి) కేన్సర్ బారిన పడటం మూణ్నెల్లుగా ఇంట్లోనే ఉంటున్నారు. రెండు రోజుల నుంచి మాత్రమే ఆయనకు విధులకు హాజరవుతున్నారు. అంతలోనే ఈ ప్రమాదం బారిన పడి ప్రాణాలు కోల్పోయారు.

మృతుల కుటుంబాలకు రూ.లక్ష అందజేత

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తక్షణ సహాయం కింద రూ.లక్షను మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అంత్యక్రియలు, ఇతర అత్యవసర ఖర్చుల నిమిత్తం 11 మంది మృతుల కుటుంబాలకు నగదు సహాయం అందించి మృతదేహాలను అంబులెన్సులలో స్వస్థలాలకు తరలించారు. ఇది తక్షణ సహాయం మాత్రమే అని ప్రతి ఒక్క కార్మిక కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ చెప్పారు. మిగతా మృతదేహాలను గుర్తించి స్వస్థలాలకు పంపేందుకు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది: దామోదర

మియాపూర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): పాశమైలారం సిగాచి పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో గాయపడిన కార్మికుల వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంగళవారం ఆయన మియాపూర్ మదీనగూడలోని ప్రణామ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 18 మంది క్షతగాత్రులను పరామర్శించారు. వారికి రూ.50 వేల చొప్పున సహాయం అందజేశారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న కార్మికులతో పాటు అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. కాగా, ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన హేమంత్‌సుందర్ (45) ఇక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.


మృతుల కుటుంబాలకు తక్షణసాయంగా రూ.లక్ష చెక్కును అందజేస్తున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

తమవాళ్లు బతికే ఉంటారని..



సంగారెడ్డి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి 48 గంటలు గడిచిపోయింది! పని చోటు నుంచి ఇంటికి రాని కార్మికుల విషయంలో వారి కుటుంబాల్లో ఇంకా ఆశలు.. తమవాళ్లు బతికే ఉన్నారని, గాయాలతోనైనా ఇంటికి వస్తారని! పరిశ్రమ వద్ద తమవాళ్ల కోసం వారంతా వెతుకుతున్నారు. తమవాళ్లు ఇంటికి రాలేదని, వారి ఫోన్లు పనిచేయడం లేదని రోదిస్తున్నారు. అధికారుల వద్ద.. సురక్షితంగా ఉన్న కార్మికుల జాబితాలో బాధిత కుటుంబాలకు చెందిన కార్మికుల పేర్లు లేనట్లుగా తెలుస్తోంది. మార్చురీలో ఉన్న మృతదేహాలను ఓసారి చూడాలని అధికారులు చెబుతున్నా బాధితులు జంకుతున్నారు. ఆవైపు వెళ్లేందుకు వారు ధైర్యం చేయడం లేదు. పరిశ్రమలో ఎవరూ లేరని.. ఇక్కడ వెతికి ప్రయోజనం లేదని అధికారులు, పోలీసులు నచ్చజెబుతున్నా వారు అక్కడి నుంచి కదలడం లేదు. తమవాళ్లకు ఏంకాలేదని, బతికి ఉంటారనే ధీమాతో ఉన్నారు. కాగా పేలుడు ఘటనలో ఇప్పటివరకు 41 మంది చనిపోగా ఇప్పటి దాకా 13 మృతదేహాలనే గుర్తించారు. వాటిని బంధువులకు అప్పగించి.. స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు చేశారు. మృతులంతా 30 ఏళ్లలోపువారే. దాదాపు అంతా బయటరాష్ట్రాలకు చెందినవారే. ఇక్కడ ఒంటరిగా ఉంటే పనిచేస్తున్న కార్మికులకు సంబంధించి బయట రాష్ట్రాల్లో ఉన్న కుటుంబసభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమవారి ఆచూకీ కోసం వారు ఫోన్లు చేస్తున్నారు. స్పందన రాకపోవడంతో కొందరు ఇప్పటికే బయలుదేరారు. మరోవైపు.. పటాన్‌చెరు ఏరియాలోని 3 ఆస్పత్రుల్లో మరో 30 మంది చికిత్స పొందుతున్నారు. కొందరు మార్చురీకి వెళ్లి పరిశీలించి.. మృతదేహాలు తమవారివి కావంటూ బయటకు వెళ్లిపోతున్నారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతా ఛిద్రమవడంతో డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

నా భర్తను చూపించండి..



ఒడిశాకు చెందిన గర్భిణి పూజ మూడేళ్ల బాబును ఎత్తుకుని తిరుగుతూ, తన భర్త పాషాన్ ఆచూకీ చెప్పాలని కనబడిన వారినల్లా వేడుకుంటుండటం అందరినీ కలచి వేసింది. సోమవారం ఉదయం నుంచీ ఆమె అలా కన్నీళ్లతో తిరుగుతూనే ఉంది. మంగళవారం ఘటనాస్థలానికి సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ వచ్చిన సమయంలో ఆమెతోపాటు బాధిత కుటుంబాలవారు తమ బాధ మొరపెట్టుకున్నారు.


డీఎన్ఏ పరీక్షల కోసం మృతదేహాల అవశేషాలను తీసుకువెళ్తున్న సిబ్బంది

సిగాచి ప్రమాదంపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ

» సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

హైదరాబాద్, పటాన్‌చెరు, గన్‌పార్క్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : పాశమైలారంలోని సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన ప్రమాదానికి సంబంధించి జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కేసు నమోదు చేసింది. న్యాయవాది ఇమ్మనేని రామారావు వేసిన పిటిషన్ ఆధారంగా కంపెనీ బాధ్యులపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ చేపట్టనుంది. సిగాచి యాజమాన్య ప్రతినిధులైన చిదంబరం షణ్ముఖనాథన్, గుంతక ధనలక్ష్మి, అమిత్ రాజ్ సిన్హా, శనివారపు సర్వేశ్వర్‌రెడ్డి, వివేక్‌కుమార్, ఓరుగంటి సుబ్బరామిరెడ్డి, రవీంద్ర ప్రసాద్ సిన్హా, బిందు వినోదాన్‌పై హత్యగా పరిగణింపబడని(కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కేసు నమోదు చేయాలని పిటిషనర్ కోరారు. కాగా ఈ ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. కేసును సుమోటోగా స్వీకరించింది. పారిశ్రామిక భద్రత చట్టం అమలుతో సహా లోపాలపై సమగ్ర విచారణ జరిపించి నివేదిక అందజేయాలని కోరుతూ అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్, కార్మిక శాఖ కమిషనర్, సంగారెడ్డి ఎస్పీలకు కమిషన్ నోటీసులు జారీ చేసింది.

కెమికల్ పరిశ్రమలో పేలిన బాయిలర్

» కార్మికుడికి తీవ్ర గాయాలు..50 మందికి తప్పిన ప్రమాదం

మేడ్చల్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పారిశ్రామిక వాడలోని కెమికల్ పరిశ్రమలో బాయిలర్ పేలి ఓ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. అక్కడే పనిచేస్తున్న మరో 50 మంది కార్మికులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పారిశ్రామిక వాడలోని ఆల్కోలైడ్స్ బయో యాక్టివ్స్ ఫార్మా పరిశ్రమలో మంగళవారం మధ్యాహ్నం బాయిలర్ ఒక్కసారిగా పేలింది. దీంతో అక్కడే ఉన్న కార్మికుడు గన్నారం శ్రీనివాస్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు, పరిశ్రమ యాజమాన్యం శ్రీనివాస్‌రెడ్డిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మరో 50 మంది కార్మికులు ఘటనా స్థలానికి కాస్త దూరంలో ఉండటంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు పరిశ్రమ వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు.

యంత్రంలో నలిగిన కార్మికుడి చెయ్యి..తొలగింపు

» జహీరాబాద్‌లోని ముంగి పరిశ్రమలో ఘటన

జహీరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని ముంగి పరిశ్రమలో ఓ కార్మికుడు సోమవారం ప్రమాదానికి గురయ్యాడు. కార్మికుడి చెయ్యి ప్రమాదవశాత్తు ఓ యంత్రంలో నలిగిపోగా, వైద్యులు ఆ చేతిలోని కొంత భాగాన్ని తొలగించారు. ముంగి పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడైన కర్ణాటకలోని రేకుల్గీ గ్రామానికి చెందిన గణేష్ ఈ ప్రమాదానికి గురయ్యాడు. ప్రెస్సింగ్ మిషన్ ఆపరేటరైన గణేశ్ ఎప్పట్లాగే సోమవారం ఉదయం పని చేస్తుండగా.. అతని కుడి చెయ్యి యంత్రంలో నలిగి నుజ్జు నుజ్జు అయింది. జహీరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గణేశ్‌కు చికిత్స జరిగింది. కాగా, కార్మికుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకోని ముంగి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ డిమాండ్ చేశారు.

'సిగాచి' ప్రమాదం కలచివేసింది: కవిత

పటాన్‌చెరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో గాయపడిన వారిని ఎమ్మెల్సీ కవిత మంగళవారం పరామర్శించారు. పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులతో మాట్లాడారు. డాక్టర్లను కలిసి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. దారుణమైన ప్రమాదంలో కార్మికులు, ఉద్యోగులు చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని కవిత అన్నారు. ప్రభుత్వం బాధితులకు సంపూర్ణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారికి మెరుగైన వైద్యం అందించి, కోలుకునే వరకు వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ తరహా ప్రమాదాలు జరగకుండా అధికారులు, ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదంలో చనిపోయిన వారికి కవిత ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

'సిగాచి' ప్రమాదం అత్యంత బాధాకరం

బాధితులను ఆదుకుంటాం: కిషన్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదంలో మృతి చెందటం అత్యంత బాధాకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతుల సంఖ్య ఎక్కువగా ఉండటం దురదృష్టకరమన్నారు. మంగళవారం ఆయన పాశమైలారంలో ప్రమాదం జరిగిన సిగాచి పరిశ్రమను సందర్శించారు. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడి.. వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రమాదంలో ఒడిసా, బిహార్, ఉత్తరప్రదేశ్, ఏపీ, తెలంగాణ వారు ఉన్నారని.. ఆయా రాష్ట్రాల్లో ఉన్న బీజేపీ నాయకత్వంతో మాట్లాడి వారందరినీ పార్టీ తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. పరిశ్రమలో తనిఖీలు లంచాల కోసం జరుగుతున్నాయా..? సేఫ్టీ అధికారులు ఎంతవరకు నిజాయితీగా పని చేస్తున్నారు..? అన్న అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోతానంటే కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహకరిస్తామని తెలిపారు. సిగాచి పరిశ్రమ బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అండగా ఉంటుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు భరోసా ఇచ్చారు.



సిగాచి పరిశ్రమ ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు రూ.కోటి

తీవ్ర గాయాలైన వారికి రూ.10 లక్షలు, గాయపడిన వారికి 5 లక్షల చొప్పున..

- » సిగాచి యాజమాన్యం చెల్లించేలా సీఎం సమక్షంలో రాతపూర్వక ఒప్పందం
- » పేలుడుపై ఉన్నతస్థాయి కమిటీ విచారణ
- » నివేదిక రాగానే కారణాలు వెల్లడిస్తాం
- » నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు
- » ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి





ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, దామోదర, బాధితుడిని పరామర్శిస్తున్న దృశ్యం

సంగారెడ్డి, రామచంద్రాపురం టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచి పరిశ్రమలో సంభవించిన పేలుడులో మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించనున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డవారికి రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడ్డవారికి రూ.5 లక్షల చొప్పున చెల్లించనున్నారు. మృతుల అంత్యక్రియల కోసం రూ.50 వేల చొప్పున ఇవ్వనున్నారు. ప్రమాదంలో మరణించిన, క్షతగాత్రుల కుటుంబాలకు పరిశ్రమ యాజమాన్యం పరిహారం చెల్లించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. ఈ మేరకు పరిహారం చెల్లింపు అంశంమీద సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో సిగాచి పరిశ్రమ యజమానులతో అధికారులు రాతపూర్వకంగా ఒప్పందం చేసుకున్నారు. మంగళవారం సీఎం రేవంత్ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు, రాజనర్సింహ, వివేక్‌తో కలిసి ఘటనా స్థలంలో సహాయక చర్యలను పరిశీలించారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలోనే మంత్రులు, డీజీపీ, కలెక్టర్, ఎస్పీ, హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఘటనకు సంబంధించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ యజమాని ఘటనా స్థలానికి రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే ఆయన స్వస్థలమైన గుజరాత్ రాష్ట్రానికి వెళ్లి నష్టపరిహారం గురించి మాట్లాడి రావాలని అధికారులకు సూచించారు. అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. మృతుల్లో తెలంగాణ, ఏపీ, బిహార్, ఒడిసా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు ఉన్నారని చెప్పారు. మృతులను గుర్తించి ప్రత్యేక అంబులెన్సుల్లో వారి స్వస్థలాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఇంకా కొంతమంది ఆచూకీ తెలియట్లేదని, వారి గురించి సహాయక బృందాలు అన్వేషిస్తున్నాయని చెప్పారు. ప్రమాదానికి కారణాలను గుర్తించేందుకు సీఎస్ రామకృష్ణారావు నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని నియమించామని, కమిటీ నివేదిక రాగానే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిర్లక్ష్యం వ్యవహరించినవారు ఎవరైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఇతర పరిశ్రమల్లో భద్రతా అంశాలపై దృష్టి పెడతామన్నారు. పరిశ్రమల నిర్వహణపై కొత్త విధానం తీసుకొస్తామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మార్గాలు అన్వేషిస్తామని ఆయన పేర్కొన్నారు.

మానవత్వంతో ఆదుకుంటాం

సీఎం రేవంత్ రెడ్డి మృతులు, క్షతగాత్రుల కుటుంబసభ్యుల వద్దకు వెళ్లి పరామర్శించారు. పలువురు సీఎంతో తమ కన్నీటిగాథలు చెప్పుకున్నారు. తన భర్త ఆచూకీ తెలియడం లేదని ఓ గర్భిణి విలపించింది. తమ కొడుకు ఎక్కడున్నాడో తెలియడం లేదంటూ తల్లిదండ్రులు రోదించారు. అధైర్యపడవద్దని, ప్రభుత్వం మానవత్వంతో అన్ని విధాలా ఆదుకుంటుందని సీఎం భరోసా ఇచ్చారు. పరిశ్రమ యాజమాన్యంతో నష్ట పరిహారం ఇప్పించడంతో పాటు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. మృతులు, క్షతగాత్రుల పిల్లలకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువు చెప్పిస్తామని, అండగా ఉంటామని చెప్పారు.

ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

పరిశ్రమలో తీవ్రగాయాలపాలై పటాన్‌చెరులోని ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను సీఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. వారు పలు విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యాన్ని అందించాలని మంత్రి దామోదరతోపాటు అధికారులను ఆదేశించారు.

అంగన్‌వాడీ కోడి గుడ్ల టెండర్ రద్దు

పరిపాలనా పరమైన కారణాల వల్లేనని ప్రకటన

విద్యా సంస్థలతో కలిపి టెండర్లకు వెళ్లే అవకాశం

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టు జోనల్ టెండర్ రద్దు చేశారు. నిబంధనల సడలింపు పేరుతో పలుమార్లు గడువు పెంచిన మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు చివరకు టెండర్‌ను ఆపేశారు. పరిపాలనా కారణాల వల్లే టెండర్ రద్దు చేశామని ప్రకటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల విద్యాసంస్థలు, రెసిడెన్షియల్, వసతి గృహాలతో పాటు మధ్యాహ్న భోజన పథకానికి అవసరమయ్యే గుడ్ల సరఫరాకు కలిపి డీసెంట్రలైజ్డ్ టెండర్లు నిర్వహించాలని ప్రభుత్వం పునరాలోచన చేస్తోంది. రాష్ట్రంలోని 35,781 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా దాదాపు 19.60 లక్షల మంది మహిళలు, చిన్నారులు లబ్ధిపొందుతున్నారు. వీరికి ఏడాదికి 36.96 కోట్ల గుడ్ల సరఫరాకు ఈ ఏడాది మార్చిలో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఏప్రిల్ 10లోపు బిడ్లు దాఖలు చేయాలని పేర్కొని.. నిబంధనల సడలింపు పేరుతో ఏప్రిల్ 15, ఆ తర్వాత మే 15, జూన్ 16వరకు గడువు పెంచి.. చివరకు జూన్ 30వరకు పొడిగించారు. సోమవారంతో బిడ్లు సమర్పించే గడువు ముగిసి.. మంగళవారం టెండర్ తెరవాల్సి ఉండగా.. ఈసారి ఏకంగా టెండర్ రద్దు చేశారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు గురుకుల, రెసిడెన్షియల్, వసతి గృహాలు, మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే కోడి గుడ్లను అందించడానికి ఈసారి డీసెంట్రలైజ్డ్ టెండర్లు పిలవాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వీటన్నింటికి ఏడాదికి దాదాపు 70-80 కోట్ల వరకు గుడ్లు అవసరమవుతాయి. అయితే, ఉమ్మడి జిల్లాల వారీగా గుడ్లు సరఫరా అయ్యేలా టెండర్లు నిర్వహించాలా..? లేక కొత్త జిల్లాల వారీగా టెండర్లు పిలవాలా..? అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. డీసెంట్రలైజ్డ్ టెండర్ ద్వారా కాంట్రాక్టు దక్కించుకున్న వారు ఆ జిల్లాకు అంగన్‌వాడీ, గురుకులాలు, రెసిడెన్షియల్, హాస్టళ్లు, మధ్యాహ్న భోజనానికి అవసరమయ్యే గుడ్లను అందించనున్నారు. ఇప్పటికే పాఠశాలలు పునః ప్రారంభమై 20 రోజులు గడిచినా.. గుడ్ల సరఫరా టెండర్ల విషయంలో ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు పాత కాంట్రాక్టర్ల ద్వారానే సరఫరా చేసేలా చర్యలు తీసుకున్నారు.

బీవీ పట్టాభిరామ్ ఇకలేరు!

గుండెపోటుతో మృతి.. ఇంద్రజాలికుడు, హిప్నాటిస్ట్, కౌన్సెలర్‌గా అంతర్జాతీయ గుర్తింపు

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలికుడు, అంతర్జాతీయంగా పేరు పొందిన హిప్నాటిస్టు, మానసిక వైద్యుడు, ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా సుపరిచితుడైన బీవీ పట్టాభిరామ్(75) కన్నుమూశారు. ఆయన పూర్తి పేరు భావరాజు వేంకట పట్టాభిరామ్. సోమవారం రాత్రి ఖైరతాబాద్‌లోని స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టాభిరామ్ భార్య జయ కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలు. వీరి కుమారుడు ప్రశాంత్ ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. పట్టాభిరామ్ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని శీల గ్రామం. 1950 ఫిబ్రవరి 12న భావరాజు సత్యనారాయణ, వెంకాయమ్మ దంపతులకు పట్టాభిరామ్ జన్మించారు. వీరికి మొత్తం 15 మంది సంతానం కాగా.. పట్టాభిరామ్ ఎనిమిదో వారు. తండ్రి సత్యనారాయణ ఇంజనీర్‌గా అందించిన సేవలకు గాను బ్రిటిష్ ప్రభుత్వం రావ్ సాహెబ్ బిరుదుతో సత్కరించింది. ఉద్యోగరీత్యా సత్యనారాయణకు బదిలీలు కావడంతో పట్టాభిరామ్ నెల్లూరు, హైదరాబాద్, కర్నూలు, కాకినాడ తదితర ప్రాంతాల్లో విద్యను అభ్యసించారు. పట్టాభిరామ్ చిన్నతనంలో చందమామ సంచికల్లో ఇంద్రజాలంపై పీసీ సర్కార్ రాసే కథనాలు చదివి స్ఫూర్తి పొందారు. అమీర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో ఒక రోజు కోఠి కబూతర్‌ఖానా దగ్గర సైఫుద్దీన్ అనే ఇంద్రజాలికుడి ప్రదర్శన చూసి, ఆ విద్యపై ఆసక్తి పెంచుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న రోజుల్లో ఎంబేర్ రావు దగ్గర ఇంద్రజాలం నేర్చుకున్నారు. డిగ్రీ అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీలో టైపిస్టుగా చేస్తూనే, ఇంద్రజాల ప్రదర్శనలు ప్రారంభించారు.ఎఫ్‌సీఐలో క్లర్కుగా కూడా పని చేశారు. 1984లో రవీంద్రభారతి నుంచి చార్మినార్‌కు అక్కడి నుంచి రవీంద్రభారతికి కళ్లకు గంతలు కట్టుకొని స్కూటరు నడిపి పట్టాభిరామ్ సంచలనం సృష్టించారు. ఇంద్రజాల విద్య ద్వారా బాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలను నిర్మూలించడానికి తెలుగునాట కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చారు. మ్యాజిక్ స్కూలు ద్వారా పిల్లలకు పట్టాభిరామ్ ఇంద్రజాల విద్యను నేర్పిస్తున్న సమయంలో రేడియో అన్నయ్య న్యాపతి రాఘవరావు సలహాతో హిప్నాటిజం తరగతులు ప్రారంభించారు. తద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ మనస్తత్వ నిపుణుడిగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. ఉస్మానియా వర్సిటీలో ఎంఏ సైకాలజీ చదివారు. 1992లో పీహెచ్‌డీ పూర్తిచేశారు. హిప్నాటిజంపై తొలి పీహెచ్‌డీ పట్టాభిరామ్‌దే కావడం విశేషం.



పట్టాభిరామ్ (ఫైల్)

నేడు అంత్యక్రియలు

పట్టాభిరామ్ కుమారుడు ప్రశాంత్ 15 రోజుల పాటు హైదరాబాద్‌లోనే ఉండి, సోమవారం తెల్లవారు జామునే అమెరికా తిరిగి వెళ్లారు. రాత్రికి తండ్రి మరణవార్త తెలియడంతో ఆయన తిరుగుప్రయాణమయ్యారు. పట్టాభిరామ్ భౌతిక కాయాన్ని బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు ఆయన స్వగృహంలో ఉంచుతారు. తర్వాత జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టాభిరామ్ మృతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పట్టాభిరామ్ మృతి పట్ల ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ సంతాపం ప్రకటించారు. ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టులు కె.రామచంద్రమూర్తి, వల్లీశ్వర్, ఎమెస్కో విజయకుమార్, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, విజయవాడ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు మనోహర్ నాయుడు తదితరులు పట్టాభిరామ్ సేవలను గుర్తుచేసుకున్నారు.

రచనలు సంచలనం..

తెలుగు పాఠక లోకంలో పట్టాభిరామ్ వ్యక్తిత్వ వికాస రచనలకు విశేష ఆదరణ ఉండేది. 'మైండ్ మ్యాజిక్'తో మొదలుపెట్టి 'మాస్టర్ మైండ్', 'జ్ఞాపకశక్తి- ఏకాగ్రత', 'మాటే మంత్రం', 'పాజిటివ్ థింకింగ్', 'జీనియస్ మీరు కూడా' వంటి 57కు పైగా పుస్తకాలు రాశారు. వాటన్నింటినీ ఎమెస్కో ప్రచురించింది. కొద్ది నెలల కిందట ఆయన ఆత్మకథ 'జీవితం ఒక ఉత్సవం- నా బతుకు కథ' విడుదలైంది. పత్రిక, టెలివిజన్, యూట్యూబ్ మాధ్యమాల ద్వారానేగాక కళాశాలలు, కార్పొరేట్, ప్రభుత్వరంగ కార్యాలయాల్లో కొన్ని వందల వ్యక్తిత్వ వికాస శిక్షణ తరగతులు నిర్వహించారు. పోలీసులు సైతం పట్టాభిరామ్ దగ్గర కౌన్సెలింగ్ కిటుకులు నేర్చుకొని నేరస్థులను పట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ తనకు గురువు అని పలు ఇంటర్వ్యూల్లో పట్టాభిరామ్ చెప్పారు. చిన్నవయసులో తలెత్తిన ప్రమాదం వల్ల పట్టాభిరామ్ కాలికి శస్త్రచికిత్స చేశారు. తన తండ్రి సత్యనారాయణ ఇచ్చిన స్థైర్యమే తనను ఈ స్థాయికి ఎదిగేలా చేసిందని పలు సందర్భాల్లో ఆయన తెలిపారు.

బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

మేడిగడ్డకు 12,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

భద్రాచలం వద్ద పెరిగిన నీటిమట్టం

జూరాలలో 7.590 టీఎంసీల నీటి నిల్వ

శ్రీశైలానికి 84,801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

సాగర్‌కు 58,750 క్యూసెక్కుల వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎగువన కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరుగుతోంది మరోవైపు, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను మంగళవారం అధికారులు ఎత్తి నీటిని విడుదల చేశారు. శ్రీరాంసాగర్ ప్రస్తుత మంగళవారం సాయంత్రానికి 1064.90 అడుగుల 15 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం మేడిగడ్డకు మంగళవారం 12,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, అంతే నీరు విడుదల చేస్తున్నారు. 2 రోజులుగా కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు 13.4 అడుగులకు చేరుకుంది.

జూరాలకు తగ్గిన వరద

జూరాలకు మంగళవారం తగ్గుముఖం పట్టింది. జూరాలలో 7.590 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, 87 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. 9 గేట్లను ఎత్తి 60,070 క్యూసెక్కులతోపాటు 92,285 క్యూసెక్కుల నీరు దిగువకు వదిలేశారు. మరోవైపు, శ్రీశైలం ప్రాజెక్టుకు 84,801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, 162.4372 టీఎంసీల నీరు ఉన్నది.



బాబ్లీ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

సాగర్ నీటిమట్టం 140.8451 టీఎంసీలు

నాగార్జున సాగర్ పూర్తి నీటిమట్టం 312.0450 టీఎంసీలకు, ప్రస్తుతం 140.8451 టీఎంసీలు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 58,750 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. జంట నగరాల తాగునీటి అవసరాలకు 900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్!

» త్వరలో సమీక్ష.. వెంటనే భర్తీకి వీలున్న ఖాళీల గుర్తింపు: భట్టి

హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్ రీ షెడ్యూల్‌పై అతి త్వరలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క... టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ కోదండరాం, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రియాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్‌కు తెలిపారు. వెంటనే భర్తీ చేయడానికి వీలున్న పోస్టులనూ ఈ సమావేశంలో గుర్తించనున్నట్లు భట్టి చెప్పారు. మంగళవారం కోదండరాం, రియాజ్, దయాకర్ ప్రజాభవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి, భట్టిలను కలిశారు. జాబ్ క్యాలెండర్‌ను రీషెడ్యూల్ చేసి ఉద్యోగాల భర్తీకి త్వరితగతిన నోటిఫికేషన్లు జారీ చేయాలని కోరారు. విద్యా వ్యవస్థలో తీసుకురావాల్సిన సంస్కరణలను కూడా వారి దృష్టికి తెచ్చారు. ఈ అంశాలపై సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించారు. ఎస్సీ వర్గీకరణ, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లులను అసెంబ్లీలో ఆమోదించే క్రమంలో నోటిఫికేషన్లు కాస్త ఆలస్యమయ్యాయని, అవి పూర్తయినందున నోటిఫికేషన్ల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగానే ఉందన్నారు. పోస్టుల భర్తీకి అనుమతి ఇవ్వాల్సింది ఆర్థిక శాఖ అని, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో మాట్లాడాలని సూచించారు. ఈ సందర్భంగా వారితో భట్టి మాట్లాడుతూ వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి అతి త్వరలోనే సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. జాబ్ క్యాలెండర్ రీషెడ్యూల్ పైనా కసరత్తు జరుగుతుందని హామీ ఇచ్చారు. కాగా, భట్టి సమీక్ష వారం రోజుల్లోపే ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఎన్‌హెచ్‌ఏఐ అధికారిపై దాడి హేయం

- » దేశవ్యాప్తంగా ఎన్‌హెచ్‌ఏఐ ఇంజినీర్ల నిరసన
- » బాధ్యులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోండి
- » హిమాచల్ సీఎంకు కేంద్ర మంత్రి గడ్కరీ సూచన

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) మేనేజర్ అచల్ జిందాల్‌పై జరిగిన దాడిని ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీర్లు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు దేశ రాజధాని ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీర్ల అసోసియేషన్ మంగళవారం నిరసన తెలిపింది. విధుల్లో ఉన్న అధికారిపై దాడి చేయడం హేయమైన చర్య అని ఎన్‌హెచ్‌ఏఐ తెలంగాణ రీజినల్ ఆఫీసర్ శివ శంకర్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. సిమ్లా జిల్లాలో విధుల్లో ఉన్న ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్ అచల్ జిందాల్‌పై ఆ రాష్ట్ర మంత్రి అనిరుధ్ సింగ్, అతని అనుచరులు దాడి చేసిన ఘటన దేశవ్యాప్తంగా వైరల్ అయింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సైతం ఎక్స్ వేదికగా స్పందించారు. "ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ, సిమ్లా) మేనేజర్‌పై హిమాచల్ పంచాయతీరాజ్ మంత్రి, అతని సహచరులు దాడికి పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇది ముమ్మాటికీ చట్టాన్ని అవమానపరచడమే. ఇటువంటి సంఘటనలను సంస్థాగత సమగ్రతను దెబ్బతీసే చర్యగా పరిగణించాలి. నేరస్థులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హిమాచల్ సీఎం సుఖు సుఖ్వీందర్‌ను కోరాను. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని చెప్పాను" అని పేర్కొన్నారు. ఈ విషయమై ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ సంతోష్ కుమార్‌యాదవ్ హిమాచల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు.

డీఎల్‌ఆర్‌ఎల్ డైరెక్టర్‌గా మురళి బాధ్యతలు



అల్వాల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రిసెర్చ్ ల్యాబొరేటరీ(డీఎల్ఆర్ఎల్) డైరెక్టర్‌గా ప్రముఖ శాస్త్రవేత్త మురళి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు శ్రీనివాస్‌రావు ఈ పదవిలో ఉన్నారు. జూన్ 30న(సోమవారం) ఆయన రిటైర్ అయ్యారు. ఆయన స్థానంలో మురళి నియమితులయ్యారు. మురళి 1988లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌లో పట్టభద్రుడయ్యారు, 1990లో కర్ణాటకలోని మైసూర్ విశ్వవిదాయలయం నుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో ఎంఎస్సీ పూర్తి చేశారు. 1991 మార్చి 20న డీఎల్ఆర్ఎల్‌లో శాస్త్రవేత్తగా బాధ్యతలు చేపట్టారు. ఎలక్ట్రానిక్ యుద్ధ శైలి, కౌంటర్ డ్రోన్ వ్యవస్థల డిజైనింగ్, అభివృద్ధిలో ఆయన కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆయన లేస్తలేడు.. నాలుగేళ్లైతే బాబూ లేవడు

వెంకయ్య, చంద్రబాబుపై బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్ సిటీ, పంజాగుట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): "ఆదిలాబాద్ గిరిజన తండాల్లో.. వరంగల్ లంబాడీ తండాల్లోనో ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడాలి. ప్రతీసారి తెలంగాణ ఆత్మగౌరవం అంటూ మాట్లాడవద్దు. తెలుగువాళ్లు ఒకటిగా ఉంటే భారతదేశంలో నెంబర్ వన్‌గా ఉంటాం. మాజీ సీఎం రాయలసీమను రత్నాలసీమ చేస్తామన్నారు. అట్లా ఉండాలి రాజకీయ నాయకులు. మళ్లీ ఆంధ్ర చానల్, చంద్రబాబు చానల్, వెంకయ్య చానల్ అంటున్నారు. వెంకయ్యనాయుడు ఇంట్లో నుంచి లేవకుండా అయ్యాడు. చంద్రబాబు కూడా ఇంకో నాలుగేళ్లు అయితే లేవడు. తెలంగాణ ఎప్పటికీ ఉంటది. నిత్యనూతనమై వెలుగుతది. ఇంకేం భయం లేదు. రాజకీయ నాయకుల వల్లే ప్రమాదమున్నది. విలేకర్లు స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవాలి" అని బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "మీడియాపై దాడి అనేది అమానుషం. నీకు నచ్చని వార్తలు ప్రసారమయితే దాడి చేయడం సరికాదు. బీఆర్ఎస్, బీజేపీ ఏ పార్టీ ఆఫీసుల మీద దాడి చేయొద్దు. కలాలను భయపెట్టుకుంటూ పోతే తర్వాత వార్తలు రాసేవారు ఉండరు. ప్రతీ పార్టీ ఓ చానల్ పెడుతుంది. ప్రతీ పార్టీ ఒక పత్రిక కొంటుంది. ఎప్పుడైతే ఈ దరిద్రం వచ్చిందో.. రాజకీయ నాయకులకు బానిసలుగా మారుతున్నారు. నా భార్యది నెల్లూరు, సీఎం రేవంత్ అల్లుడిది ఆంధ్రా..! గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేల పార్ట్‌నర్లంతా ఆంధ్రావాళ్లు.. ప్రజలను మాత్రం సెంటిమెంట్‌తో చంపుతున్నారు. ఒకనాడు రాష్ట్రం విడిపోయింది. ఎవ్వరికో ఏదో అయితే తెలంగాణకు అయినట్లు కాదు. తెలంగాణ ఆత్మగౌరవం బ్రహ్మండంగా ఉన్నది. కొన్ని కుటుంబాలు ఇబ్బందిపడితే ఏమీ చేయలేం. కలం గళం ఎప్పుడూ భయపడకూడదు. రాజకీయ ప్రేరేపిత దాడిని ఖండిస్తున్నా. మీడియాకు స్వయం ప్రతిపత్తి ఉంచుదాం. విలేకర్లు ధైర్యంగా ఉంటే అవినీతి, అక్రమాలు బయటకొస్తాయి. మీడియాను భయపెట్టడం మంచిది కాదు. ఇకముందు తెలంగాణ పదం తక్కువగా వాడండి. తెలంగాణ రాష్ట్రం వచ్చింది. తెలంగాణ సంస్కృతి బ్రహ్మండంగా ఉంది. కొందరు ఆడితేనే బతుకమ్మ కాదు. కొన్ని సమస్యలు వచ్చినప్పుడు తెలంగాణ పదం వాడుతున్నారు. కొందరికి ఇబ్బందులు వస్తే తెలంగాణ ఆత్మగౌరవానికి ఏం సంబంధం" అంటూ ఆయన ప్రశ్నించారు.

రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదుల అరెస్టు

» అదుపులోకి తీసుకున్న తమిళనాడు ఏటీఎస్ పోలీసులు

రాయచోటి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఏపీలోని అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు. కేరళలోని మేళపలయంకు చెందిన అబూబక్కర్, మొహమ్మద్ అలీ అలియాస్ యూసఫ్ అన్నదమ్ములు. అనేక ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొని గత 30 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న వీరిద్దరినీ తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 1995 నుంచి పరారీలో ఉన్న అబూబక్కర్‌పై అనేక ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన కేసులు ఉన్నాయి. అన్నదమ్ములిద్దరూ రాయచోటిలో స్థిరపడ్డారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా సందీప్ మాథుర్


సందీప్ మాథుర్

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే(ఎస్.సి.ఓ.ఆర్) జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా పని చేసిన అరుణ్‌కుమార్ జైన్ పదవీ విరమణతో ఖాళీ అయిన ఆ పోస్టులో సందీప్ మాథుర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రైల్వేబోర్డు ఆదేశాలు జారీ చేసింది. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సందీప్ మాథుర్ జోన్‌లోని వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

అధికారికంగా రోశయ్య జయంతి వేడుకలు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ సీఎంగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గవర్నర్‌గా సేవలు అందించిన కొణిజేటి రోశయ్య జయంతిని జూలై 4న ఏటా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ఏపీ శాసనసభలో అత్యధిక పర్యాయాలు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా రోశయ్య రికార్డు సృష్టించారు. ఆర్థికశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా చేసిన సేవలకు గుర్తింపుగా ఏటా రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు.

వెంకయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోదీ

న్యూఢిల్లీ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయనకు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రులు అమిత్ షా, పెమ్మసాని చంద్రశేఖర్.. 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. పలు సంవత్సరాలు వెంకయ్యనాయుడుతో కలిసి పని చేసే అదృష్టం తనకు లభించిందన్న మోదీ.. ఆయన నిండా నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఆర్పీఎఫ్ ఆధీనంలోనే నాగార్జున సాగర్

నాగార్జునసాగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ భద్రతను డిసెంబరు 31దాకా సీఆర్పీఎఫ్ పర్యవేక్షిస్తుందని ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జున్‌రావు తెలిపారు. జూన్ 30తో సీఆర్పీఎఫ్ భద్రత గడువు ముగియడంతో డిసెంబరు 31దాకా కొనసాగించాలని కేఆర్ఎంబీ నిర్ణయించింది.

ఎప్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన షురూ

హైదరాబాద్/సిటీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ధ్రువపత్రాల పరిశీలనకు రాష్ట్రవ్యాప్తంగా 36 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఆయా సహాయక కేంద్రాల్లో తొలి రోజు 10,602 మంది అభ్యర్థులకు ధ్రువపత్రాలు పరిశీలన పూర్తయిందని తెలిపారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 6 నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియలో పాల్గొనవచ్చని ఎప్‌సెట్ కన్వీనర్ శ్రీ దేవసేన సూచించారు.

'ఫార్ములా' విచారణకు అరవింద్ కుమార్ డుమ్మా

హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు కేసులో మంగళవారం ఏసీబీ విచారణకు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ హాజరు కాలేదు. తాను విదేశీ పర్యటనలో ఉన్నానని మరికొంత సమయం కావాలని ఆయన ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఏసీబీకి చిక్కిన ఇద్దరు అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ/ తలకొండపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు మంగళవారం ఏసీబీకి చిక్కారు. జీహెచ్ఎంసీలోని మూసాపేట సర్కిల్ పరిధిలో ఓ వ్యక్తి తన స్థలం ఆన్‌లైన్ మ్యుటేషన్ చేయాలని కోరితే.. ఆస్తి పన్ను విభాగం సీనియర్ అసిస్టెంట్ ఎం.సునీత రూ.80 వేలు లంచం అడిగారు. మంగళవారం బాధితుడి నుంచి ఆమె రూ.30 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం అంతారం గ్రామ రైతు మల్లయ్య భూమి విరాసత్ కోసం వస్తే.. తహసీల్దార్ నాగార్జున రూ.50 వేలు లంచమడిగాడు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రైతు నుంచి రూ.10 వేలు లంచం తీసుకుంటున్న కార్యాలయ అటెండర్ యాదగిరిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ నాగార్జున, యాదగిరిని అరెస్టు చేశారు. తహసీల్దార్ పట్టుబడినట్లు తెలుసుకున్న స్థానికులు.. కార్యాలయానికి వచ్చి బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు.

ఆరు నెలల్లో 126 ఏసీబీ కేసుల నమోదు

- పట్టుబడినవారిలో మహిళా ఉద్యోగులే ఎక్కువ!

హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): వరుస దాడులతో అవినీతి అధికారులు, ఉద్యోగుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు ఏసీబీ అధికారులు. ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరంలో 126 కేసులను నమోదు చేసిన అధికారులు 125 మందిని అరెస్టు చేశారు. లంచం కేసులకు సంబంధించి ఈ ఆరు నెలల్లో రూ.24,57,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్లో రూ.27,66,60,526 ఆస్తులను వెలికితీశారు. ఆ ఆస్తుల మార్కెట్ విలువ రూ.600 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. ఆరు నెలల కాలంలో 129 కేసుల్లో విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి తుది నివేదికను పంపించామని ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజయకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల్లో నమోదు చేసిన 126 కేసుల్లో 80 ట్రాప్ కేసులని, 8 అక్రమాస్తుల కేసులని, 11 ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని, 14 నేరపూరిత దుష్ప్రవర్తన కేసులని, 10 రెగ్యులర్ విచారణలు నిర్వహించామని, 3 అంతర్గత విచారణలు నిర్వహించామని వివరించారు. అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల్లో ఈసారి ఎక్కువ మంది మహిళా ఉద్యోగులు పట్టుబడటం కీలక పరిణామం.

జూన్ మాసంలో లోటు వర్షపాతమే!

(మొదటిపేజీ తరువాయి)

చెబుతున్నాయి. 13 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జగిత్యాల, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, సిరిసిల్ల, జనగాం, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, నారాయణపేట్, నల్గొండ, పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో 20-59 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు లెక్కలు చెబుతున్నాయి. కాగా, జూన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం, అత్యధిక వర్షపాతం నమోదైన జిల్లా ఒక్కటీ కూడా లేకపోవడం గమనార్హం. గతేడాది జూన్‌లోనే పలు జిల్లాల్లో సాధారణం కంటే అత్యధిక వర్షపాతం కురిసింది, కానీ, ఈసారి ఆ పరిస్థితి ఎక్కడా కనిపించలేదు. కేవలం ఓ 12 మండలాల్లోనే అత్యధిక వర్షపాతం కనిపించగా, 297 మండలాల్లో లోటు వర్షపాతమే. కాగా, రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కొన్ని జిలాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిలాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాబోయే నాలుగు రోజులకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

ట్రోల్స్ కాదు.. దమ్ముంటే నేరుగా రండి!

(మొదటిపేజీ తరువాయి)

నక్సలైట్లను అరెస్టు చేయాలని నాడు అసెంబ్లీ ముందు ధర్నా చేశా. అప్పుడే లాఠీచార్జిలో నా చెయ్యి విరిగింది. సోషల్ మీడియాలో ట్రోల్ చెయ్యడం కాదు.. దమ్ముంటే ఎదురుగా వచ్చి పోరాడాలి" అని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు రాంచందర్‌రావు సవాలు విసిరారు. ఆ పార్టీల నేతలకు దమ్ము లేదు కాబట్టే పేరు లేని పేపర్లు పెట్టి, సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తప్పుడు వార్తల ప్రచారం కోసం సోషల్ మీడియా యూనివర్సిటీలే పెట్టుకున్నాయని ధ్వజమెత్తారు. మంగళవారం మన్నెగూడలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే రాంచందర్‌రావుకు నియామక పత్రం అందజేశారు. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం పార్టీ అధ్యక్షుడి హోదాలో రాంచందర్‌రావు తొలి ప్రసంగం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజాస్వామ్య, వికసిత తెలంగాణ సాధ్యమని అన్నారు. బీజేపీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బలాన్ని పెంచుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీలో అందరితో చర్చించి తీసుకున్న నిర్ణయాలనే అమలు చేస్తామని చెప్పారు. నాడు నక్సలైట్లకు ఎదురొడ్డి పోరాడడం వల్లే నేడు ఓయూ, కేయూలు ఏబీవీపీకి అడ్డాలుగా ఉన్నాయని తెలిపారు. గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగరవేయాలంటే ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు.

కార్యకర్తలే అధ్యక్షులు..

పేరుకే తాను అధ్యక్షుడినైనా అసలు అధ్యక్షులు కార్యకర్తలేనని రాంచందర్‌రావు చెప్పారు. 'నాకు రాష్ట్ర అధ్యక్ష పదవి రావడం ప్రతి కార్యకర్తకు గర్వకారణం. కార్యకర్తలే బీజేపీకి నిజమైన సారథులు' అని అన్నారు. 'క్రమశిక్షణ, సిద్ధాంతాల పట్ల నిబద్ధతతోనే ఈ స్థాయికి వచ్చాం. ఇప్పుడు మనందరి లక్ష్యం.. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే' అని రాంచందర్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాను యువమోర్చా కార్యకర్తగా ఉన్నప్పుడు నల్లగొండ జిల్లాలో సభ్యత్వ నమోదు కోసం సైకిల్‌పై వెళ్లేవాళ్లమని, పార్టీ కోసం కష్టపడి పనిచేశామని చెప్పారు. బీజేపీ అనేది శ్రేణులు, ప్రజలు, సిద్ధాంతం ఆధారంగా పనిచేసే పార్టీ అని తెలిపారు. పార్టీలో కొత్త, పాత అనే తేడా ఉండదన్నారు. అందరూ కలిసి బీజేపీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు.


రాంచందర్‌రావుతో లక్ష్మణ్, శోభా కరంద్లాజే, సంజయ్, కిషన్‌రెడ్డి

పోటీపడి దోచుకుంటున్నారు: కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పోటీపడి దోచుకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణకు బీజేపీ ఏం చేసిందంటూ ప్రతి అడ్డమైనోడు మాట్లాడుతున్నాడని పరోక్షంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. కొంత మంది సన్నాసులు చేసే ఆరోపణలకు తాము సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని, ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉంటామని స్పష్టం చేశారు. గత 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం, తెలంగాణలో రూ.12 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, దీనిపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు సవాల్ చేశారు. కేసీఆర్ కుటుంబం, రాహుల్ కుటుంబం, సీఎం రేవంత్ తెలంగాణను దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలకు బీజేపీ అధ్యక్షుడిపై వ్యాఖ్యలు చేసే అర్హత లేదని కిషన్‌రెడ్డి అన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడుదొంగలు: లక్ష్మణ్

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తోడుదొంగలని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. బనకచర్లపై లేని సమస్యను సృష్టించాయని ఆరోపించారు. తెలంగాణ వాదం పేరిట బీజేపీపై బీఆర్ఎస్ బురద జల్లే ప్రయత్నం చేసిందని విమర్శించారు. బనకచర్లకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని కేంద్ర జలసంఘం స్పష్టం చేయడంతో వాస్తవాలు ప్రజలకు తెలిశాయన్నారు. రాంచందర్‌రావుకు పార్టీ అధ్యక్ష పదవి దక్కడం ఒక కార్యకర్తకు దక్కిన గౌరవంగా భావించాలని లక్ష్మణ్ చెప్పారు. రాంచందర్‌రావు బీజేపీలో గత 40 ఏళ్లుగా పనిచేస్తున్న నిజమైన కార్యకర్త అన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ కోసం కష్టపడిన నాయకులకే బీజేపీలో పెద్ద పదవులు లభిస్తాయని చెప్పారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావు ఒక మిస్సైల్ లాంటి వాడని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. రాంచందర్‌రావు ఏం చేశారని ఆయన్ను పార్టీ అధ్యక్షుడిగా చేశారంటూ కొన్ని పార్టీలు అంటున్నాయని.. ఆయన ఓ మిస్సైల్ అని, ఆయన చరిత్ర వింటే కళ్ల వెంట నీళ్లొస్తాయని చెప్పారు. 'ఎందుకు కుంటుకుంటూ నడుస్తరు? చెయ్యి ఎందుకు వంకర ఉంటుంది? అంటూ నేనోసారి రాంచందర్‌రావును అడిగా. ఓయూలో ఏబీవీపీలో ఉన్నప్పుడు ఆర్ఎస్‌యూ, పీడీఎస్‌యూ వాళ్లు దాడి చేసి నా కాళ్లు, చేతులు విరగ్గొట్టారని, అప్పటి నుంచి ఇప్పటివరకు కూడా అవస్థ పడుతున్నానని ఆయన చెబితే నా కళ్ల వెంట నీళ్లొచ్చినయి' అని సంజయ్ తెలిపారు. పదవుల కోసం కాకుండా నమ్మిన సిద్ధాంతం కోసం, కాషాయ జెండా కోసం కష్టపడిన గొప్ప నేత అని ప్రశంసించారు. దేశానికి బీసీని ప్రధానమంత్రి చేసిన ఘనత బీజేపీదే అన్నారు. ఆ దమ్ము కాంగ్రెస్‌కు ఉందా? బీఆర్ఎస్‌కు ఉందా? మీరు అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేసే దమ్ముందా? అని నిలదీశారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగరేద్దామని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. అందరి ఆమోదంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాంచందర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో చాలా రోజుల నుంచి తనకు మంచి స్నేహం ఉందన్నారు. సౌమ్యుడు, చిత్తశుద్ధి ఉన్న కార్యకర్త అని ప్రశంసించారు. రాంచందర్‌రావును రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం ద్వారా పార్టీ అగ్రనాయకత్వం మంచి సందేశం ఇచ్చిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. పార్టీ నేతలందరూ కలిసికట్టుగా పనిచేయాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు.

బీజేపీ సభకు అర్వింద్ డుమ్మా!

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్.రాంచందర్‌రావు ఎన్నికైనట్లు ప్రకటించడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నిజామాబాద్ ఎంపీ అర్వింద్ హాజరవకపోవడం పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అర్వింద్ పార్టీ అధ్యక్ష పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఒకదశలో ఆయన పేరును కూడా పార్టీ అధినాయకత్వం పరిశీలించిందన్న ప్రచారమూ జరిగింది. కానీ, అనూహ్యంగా రాంచందర్‌రావు పేరును ఖరారు చేశారు. రాంచందర్‌రావు నామినేషన్ దాఖలు సందర్భంలో కూడా అర్వింద్ అందుబాటులో లేరు. అయితే, తాను వ్యక్తిగత కారణాలతోనే కార్యక్రమానికి హాజరు కాలేదని అర్వింద్ చేసిన ప్రకటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. మరోవైపు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, సీనియర్ నేత చింతల రాంచంద్రారెడ్డి వంటి వారు కూడా హాజరుకాకపోవడంపై పార్టీ నేతల్లో చర్చ జరిగింది. నియోజకవర్గంలో ముందుగా ఖరారు చేసుకున్న కార్యక్రమాల వల్లే వెంకటరమణారెడ్డి హాజరు కాలేకపోయి ఉంటారని పార్టీ ఎమ్మెల్యే ఒకరు తెలిపారు.

25 మంది కార్యవర్గసభ్యుల ఎన్నిక

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులుగా 25 మందిని ఎన్నుకున్నారు. వీరిలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్‌తోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మరికొందరు సీనియర్ నాయకులు ఉన్నారు.

రఘునందన్‌కు రాంచందర్‌రావు పరామర్శ

సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పరామర్శించారు. మంగళవారం రఘునందన్‌తో కాసేపు మాట్లాడి.. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నిమ్మగడ్డ ఆస్తులు దాటించేస్తున్నారు

- ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుంది
- హైకోర్టులో రాకియా సంస్థ పిటిషన్
- తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాకియాకు, నిమ్మగడ్డ ప్రసాద్‌కు మధ్య నెలకొన్న ఆర్థిక వివాదానికి సంబంధించిన ఓ కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో హైకోర్టు మంగళవారం తీర్పు రిజర్వు చేసింది. జగన్ అక్రమాస్తుల వ్యవహారంలోని వాన్‌పిక్ కేసుకు సంబంధించి యూఏఈలోని ఒక రాష్ట్ర ప్రభుత్వం రాస్ అల్ ఖైమాకు చెందిన రాస్ అల్‌ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ(రాకియా)కు వ్యాన్‌పిక్ కేసులోనే మరో నిందితుడు నిమ్మగడ్డ ప్రసాద్‌కు మధ్య వివాదాలు ఎడతెగకుండా కొనసాగుతున్నాయి. రాజశేఖర్‌రెడ్డి హయాంలో వ్యాన్‌పిక్ ప్రాజెక్టులో రాకియా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. క్విడ్‌ప్రోకోలో భాగంగానే వాన్‌పిక్‌కు భూములు కేటాయించారని సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేశాయి. నిమ్మగడ్డ ప్రసాద్‌ను భాగస్వామిగా చేర్చుకున్నందుకు తమను నిమ్మగడ్డ ప్రసాద్ మోసం చేశారని, తన కంపెనీల ద్వారా నిధులు గోల్‌మాల్ చేశారని రాకియా యూఏఈ కోర్టులో నిమ్మగడ్డకు వ్యతిరేకంగా లా సూట్ దాఖలు చేసి గెలిచింది. నిమ్మగడ్డ ప్రసాద్ నష్టపరిహారంగా రూ.600 కోట్లు చెల్లించాలని యూఏఈ కోర్టు డిక్రీ జారీ చేసింది. ఈ డిక్రీని అమలు చేయించుకోవడంలో భాగంగా రాకియా హైదరాబాద్‌లోని వాణిజ్య కోర్టులో ఎగ్జిక్యూటివ్ పిటిషన్(ఈపీ) దాఖలు చేసింది. వాణిజ్య కోర్టుకు హామీ ఇచ్చి కూడా ఆస్తులను బినామీ పేర్లతో బదిలీ చేస్తున్నారని, ఇది కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని పేర్కొంటూ తెలంగాణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. రాకియా వాదనలు వినిపిస్తూ.. బినామీ పేర్లతో కంపెనీలను కంట్రోల్ చేస్తున్నారని.. ఆయన పేరుపైనే రూ.2,500 కోట్లు సదరు కంపెనీలు ఫండ్ రైజింగ్ చేపట్టాయని వెల్లడించింది. తమకు నిమ్మగడ్డ ప్రసాద్‌కు ఎలాంటి సంబంధం లేదని సదరు కంపెనీలు పేర్కొన్నాయి. వాదనలు విన్న ధర్మాసనం.. కోర్టు ధిక్కరణ వ్యాజ్యంలో తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణ వాయిదా

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఓఎంసీ కేసులో నిందితురాలిగా ఉన్న శ్రీలక్ష్మి పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి వాదనలు వినిపించారు. తాను గనుల శాఖ కార్యదర్శిగా విధుల్లో చేరకముందే నిర్ణయాలన్నీ జరిగిపోయాయని, ఓఎంసీకి అన్ని అనుమతులు వచ్చాయని, ఓఎంసీకి లీజు నిర్ణయం కూడా జరిగిందని పేర్కొన్నారు. తనకంటే ముందు ఉన్న అధికారి, అప్పటి మంత్రి నిర్దోషులుగా తేలారని.. ఇక తన పాత్ర ఏమీ లేదని తెలిపారు. విచారణ గురువారానికి వాయిదా పడింది.

గురుకులాల డైట్ చార్జీలకు రూ.170 కోట్లు

ఏప్రిల్ దాకా డైట్, అద్దె పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల.. నెలాఖరు కల్లా విద్యార్థులకు యూనిఫాంలు

- ఇకపై ఏ నెలకు ఆ నెల బిల్లుల చెల్లింపు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రకటన

హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపునకు అవసరమైన నిధులు విడుదల చేశామని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రకటించారు. ఇందులో డైట్ చార్జీల కోసం రూ.170 కోట్లు విడుదల చేశామని తెలిపారు. అలాగే, ఈ నెలాఖరులోగా విద్యార్థులందరికీ యూనిఫాంలు అందిస్తామని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలకు సంబంధించిన వివిధ అంశాలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్.. సంక్షేమ శాఖ అధికారులతో సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆపై, మంత్రి లక్ష్మణ్ వినతి మేరకు ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క కూడా సంక్షేమ శాఖ అధికారులతో ప్రజాభవన్‌లో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి అడ్లూరి విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా విద్యార్థులకు యూనిఫాంలు అందిస్తామని ప్రకటించారు. అన్ని గురుకుల పాఠశాలలకు 2025 ఏప్రిల్ వరకు ఉన్న పెండింగ్ బిల్లులు మంజూరు చేశామని వెల్లడించారు. డైట్ చార్జీల కోసం రూ.170 కోట్లు విడుదల చేశామని తెలిపారు. అలాగే, అద్దె బకాయిలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల చెల్లింపులకు కావాల్సిన నిధులు కూడా మంజూరు చేసినట్టు వెల్లడించారు. అన్ని గురుకులాల్లోని ఉద్యోగుల వేతనాల కోసం రూ.100 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఇకపై బకాయిలు లేకుండా ప్రతి నెలా డైట్, అద్దె బిల్లులను చెల్లిస్తామని ప్రకటించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. గురుకులాల్లో విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అడ్లూరి వివరించారు. పాఠశాలల్లో ప్రతి రోజు ఉదయం జరిగే అసెంబ్లీలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు మంత్రి అడ్లూరి చెప్పారు.

చేనేత రుణమాఫీకి రూ.33 కోట్లు

చేనేత కార్మికుల రుణమాఫీ కోసం ప్రభుత్వం రూ. 33 కోట్లు విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా ఈ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది.ఈ మేరకు చేనేత జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

సెటిల్‌మెంట్ అడ్డాలుగా పోలీస్‌స్టేషన్లు!

(మొదటిపేజీ తరువాయి)

ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించింది. నాగోల్ సర్కిల్ బండ్లగూడ కృషినగర్‌లో ఉన్న తన ప్లాట్ నెంబర్ 65కి సంబంధించిన వివాదాన్ని రూ.55 లక్షలకు రియల్ ఎస్టేట్ ఏజెంట్లతో సెటిల్ చేసుకోవాలని నాగోల్ పోలీసులు తనను నిర్బంధించారని పాము సుదర్శనం హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. తాజా కోర్టు తీర్పులకు అనుగుణంగా పోలీస్ స్టేషన్లలో అనుసరించాల్సిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ)ను మళ్లీ రూపొందించాలని డీజీపీకి ధర్మాసనం సూచించింది. సదరు ఎస్‌వోపీలను వెబ్‌సైట్లలో, ప్రతి ఠాణాలో ప్రదర్శించాలని, తద్వారా ప్రజలు ఏయే అంశాలపై ఫిర్యాదు చేయవచ్చో తెలుసుకుంటారని పేర్కొంది. అలాగే ప్రస్తుత కేసులో పిటిషనర్‌కు సంబంధించిన సివిల్ వివాదంలో జోక్యం చేసుకుని, నిర్బంధించిన వ్యవహారంలో వర్చువల్‌గా హాజరైన రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ప్రత్యక్షంగా హాజరైన నాగోల్ ఠాణా ఎస్‌హెచ్‌వోపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్‌ను జూన్ 19న ఠాణాలో నిర్బంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను సమర్పించాలని ఆదేశించింది. సదరు ప్లాట్ వివాదంపై మూడు సివిల్ కేసులు పెండింగ్‌లో ఉండటంతోపాటు ఇంజంక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ పిటిషనర్ ఆస్తిని అవతలి పక్షం డిమాండ్ చేస్తున్నా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం చేసింది. తప్పుడు పత్రాలతో ఆస్తిని క్లెయిం చేస్తున్నాడని పిటిషనర్‌పైనే కేసు పెట్టడం అక్రమమని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులకు పోలీసులు తమకు ఇష్టం వచ్చిన భాష్యం అన్వయించుకుంటూ సివిల్ వివాదాలను క్రిమినల్ కేసులుగా మారుస్తున్నారని ధ్వజమెత్తింది. కేసు కోర్టులో ఉన్న తర్వాత పొజిషన్‌లో ఎవరున్నారనే విషయాన్ని పోలీసులు ఎలా నిర్ధారిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది.



గ్రూప్-1 పిటిషన్లపై కొనసాగిన వాదనలు

హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో లోపాలు, పరీక్ష కేంద్రాల కేటాయింపులో అక్రమాలు జరిగాయని దాఖలైన పిటిషన్లపై మంగళవారం జస్టిస్ రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ కొనసాగించింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు సురేందర్ రావు, రచనారెడ్డి తదితరులు వాదించారు. రెండుసార్లు హాల్‌టికెట్లు ఇవ్వడం, పరీక్ష కేంద్రాల కేటాయింపు అంశాలను ప్రస్తావించారు. ఒకే పేపర్‌ను ఒకరి కంటే ఎక్కువ మంది దిద్దారని ఆరోపించారు. తదుపరి విచారణ బుధవారానికి వాయిదాపడింది. కాగా, డాక్యుమెంట్లు, అర్హత పత్రాలు సరిగా లేని ఆరుగురు అడ్వొకేట్లను రోల్స్ నుంచి తొలగించినట్లు బార్ కౌన్సిల్ పేర్కొంది.

నిషేధిత జాబితాలో పెట్టమంటే నిర్మాణాలా?

- నాగారం భూములపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వండి
- రంగారెడ్డి కలెక్టర్‌కు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే 181,182, 194, 195 నెంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ అందులో నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేస్తూ కోర్టు ధిక్కరణ కేసు దాఖలైంది. భూదాన్ భూములుగా భావిస్తున్న వాటి స్వభావాన్ని మార్చరాదని, క్రయవిక్రయాలు జరపరాదన్న ఆదేశాలను ఉల్లంఘించినట్టు ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లు తప్పుడు పత్రాలతో రికార్డులు మార్చి ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామానికి చెందిన బిర్ల మల్లేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన ధర్మాసనం ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఆ ఉత్తర్వులను ధిక్కరిస్తూ తాజాగా సర్వే నెంబర్ 194లో నిర్మాణాలు చేపడుతున్నారని బిర్ల మల్లేశ్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై పరిశీలన జరిపి రెండువారాల్లో నివేదిక సమర్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.